thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 95 కరీంనగర్ శనివారం, 14 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఢిల్లీ పెత్తనాన్ని ఎప్పటికీ అనుమతించం..

చెన్నై: ఢిల్లీ నుండి రాష్ట్రంపై పెత్తనం చెలాయించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సేలంలోని మోహన్‌కుమారమంగళం ప్రభుత్వ వైద్యకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రూ. 880 కోట్లతో నిర్మించనున్న జౌళి పార్కుకు, రూ. 100 కోట్లతో నిర్మించనున్న కొత్త గ్రంథాలయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 225 కోట్లతో పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేసిన ఆయన 1,01,203 మంది లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మదురైలో పర్యటించిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేశారన్నారు.





హైదరాబాద్ : లోకల్ బాడీ ఎన్నికలపై మంత్రి సీతక్క క్లారిటీ ఇచ్చారు. వారం రోజుల్లో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. మహబూబాబాద్ పర్యటనలో ఉన్న సీతక్క ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. రెండు మూడు రోజుల్లో రైతులకు రైతు భరోసా డబ్బులిస్తామని చెప్పారు. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తున్నారు అధికారులు.

నోటిఫికేషన్ వచ్చిన నెలరోజుల లోపే ఎన్నికలను పూర్తి చేసేలా ప్లాన్ చేస్తోంది ప్రభుత్వం. గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు గతేడాది ఫిబ్రవరిలోనే ముగియగా దాదాపు ఏడాదిన్నరగా ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1,600 కోట్లకు పైగా ఆగిపోయాయి. పాలకవర్గాలు ఎన్నికైతేనే ఈ నిధులు వస్తాయి. ఇక మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు గతేడాది జులై మొదటి వారంలో.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు ఏప్రిల్ లోనే ముగిశాయి. ముఖ్యంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ లాంటి పదవులు దక్కితే పార్టీ మరింత బలపడుతుందని కాంగ్రె స్ పెద్దలు భావిస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో.. జులైలో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. వాస్తవానికి పంచాయతీ ఎన్నికలను గతేడాదే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందుకోసం సమగ్ర కుల గణన సర్వే చేపట్టింది. అనంతరం బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదించింది.




హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని నోటీసులులో పేర్కొంది. ఫార్ములా- ఈరేసు కేసులో విచారణకు హాజరుకావాలని తెలిపింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవు తానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.

**లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం.. సీఎం సిద్ధమా?..** ఏసీబీ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఫార్ములా-ఈ కేసులో ఈనెల 16న ఏసీబీ విచారణకు సహకరిస్తానని తెలిపారు. "బాధ్యత గల పౌరుడిగా విచారణకు హాజరవుతా. పాలన చేతకాక ప్రజల దృష్టి మళ్లించే యత్నం ఇది. ఓటుకు నోటు కేసులో సీఎంను కూడా ఏసీబీ విచారిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ఇద్దరం ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్నాం. లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా? జడ్జి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకుందాం. టీవీల్లో లైవ్‌గా చూపిద్దాం. లైడిటెక్టర్ పరీక్షలు చూసి ఎవరు నేరస్థులో ప్రజలే నిర్ణయిస్తారు. నాతో పాటు లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకునే ధైర్యం ఉందా? పదే పదే విచారణలతో ప్రజాధనం వృథా ఎందుకు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.




## రూ. 10 వేల కోట్ల ఆదాయమే లక్ష్యంగా

# రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..

**రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యలోని స్థిరాస్తి లావాదేవీలపై రిజిస్ట్రేషన్ మార్కెట్ ధరలను పెంచాలని యోచిస్తోంది. అపార్ట్‌మెంట్స్‌పై 30శాతం, ఓపెన్ ప్లాట్లపై వంద శాతం, అంతకంటే ఎక్కువ పెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. మార్కెట్ విలువల మార్గదర్శక నియమాల ప్రకారం ముందుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.**

హైదరాబాద్ : తెలంగాణలో వ్యవసాయ భూములు, నిర్మాణ భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇది గత మూడు సంవత్సరాల తరువాత జరుగుతున్న మార్పు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇదే మొదటి సారి. ఈ కొత్త రేట్లు జూలై 2025 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మార్పుతో ప్రభుత్వానికి రూ. 10,000 కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం ఈ సిఫారసులను స్వీకరించారు. ఆయన ఉన్నతాధికారులతో భూమి విలువ పెంపుపై చర్చించారు. అనంతరం ఈ వివరాలను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.

**ఏరియా వారీగా భూముల విలువలు పెరిగేలా సిఫారసులు...** స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పడిన మార్కెట్ విలువల కమిటీలు ప్రాంతాల వారీగా భూముల విలువలు పెంచేలా ప్రతిపాదనలు చేశాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021, 2022లో భూముల విలువలను భారీగా పెంచారు. అప్పట్లో వ్యవసాయ భూముల విలువ 150% వరకు, నాన్ అగ్రికల్చరల్ భూములు (ఓపెన్ ప్లాట్లు) విలువను 100% వరకు పెంచారు.

**2021లో రేట్లు పెరగ్గా స్టాంప్ డ్యూటీ 2022లో పెరిగింది...** 2021లో భూముల మార్కెట్ విలువలు పెరిగినప్పటికీ, స్టాంప్ డ్యూటీ 2022 జూలైలో మాత్రమే 6% నుంచి 7.5%కి పెంచారు. కానీ ఇప్పటి భూముల రేట్లతో చూస్తే, అప్పుడు నిర్ణయించిన కనీస వ్యవసాయ భూముల విలువ రూ. 75,000 మాత్రమే. అయితే ఇప్పుడు రాష్ట్రంలో ఆ రేటుకు ఎక్కడా భూములు లేవని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల ఈ రేటును రెండింతలు పెంచే యోచనలో ఉంది. కాగా గతంలో ఓపెన్ ప్లాట్ల కనీస విలువ రూ. 100 నుంచి రూ. 200కి పెరిగింది. ఇప్పుడు మరోసారి 20% నుంచి 40% మధ్య పెంపు చేయాలని అధికారులు సూచించారు. స్టాంప్ డ్యూటీని కొద్దిగా పెంచే అవకాశం ఉందని సమాచారం.

**వాయిదా పడింది....** 2024 సాధారణ ఎన్నికలు, అంతర్జాతీయ ఆర్థిక మందగమనంతో రియల్ ఎస్టేట్ నెమ్మదిగా నడవడంతో ఈ ప్రతిపాదన వాయిదా పడింది. అయితే గతేడాది మే నెలలోనే సీఎం రేవంత్ రెడ్డి భూముల విలువలు పెంచాలని సూచించారు. హైదరాబాద్, ఇతర పట్టణాల్లో భూముల ధరలు అమాంతం పెరగగా, ప్రభుత్వ ఆదాయం మాత్రం అంతగా పెరగలేదు. అందుకే నిబంధనల ప్రకారం మార్కెట్ రేట్లు పెంచి, ఆదాయం పెంచాలని సీఎం భావిస్తున్నారు.

# హతవిధీ ఏమిటీ ఈ పరిస్థితి!







## ఎటు చూసినా మాంసపు ముద్దలే.. జాబితాతోనే గుర్తింపు!

గుజరాత్‌లోని పారిశ్రామిక నగరం అహ్మదాబాద్ నుంచి గురువారం మధ్యాహ్నం 1.10 గంటలకు టేకాఫ్ అయిన ఏఐ 171 బోయింగ్ విమానం కొన్ని నిమిషాల్లోనే సమీపంలోని బీజే ఆసుపత్రిపై కుప్పకూలింది. అప్పటికి ఫుల్లుగా ఉన్న రెండు ఇంధన ట్యాంకులు ఒక్కసారిగా పేలిపోయాయి. దీంతో భారీ ఎత్తున మంటలు చెలరేగి.. విమానం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో బోయింగ్ సిబ్బంది సహా ప్రయాణికులు 242 మంది మృతి చెందారని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అయితే.. పరిసర ప్రాంతాలకు కనీసం కిలో మీటరు దూరం వరకు.. దట్టమైన పొగ అలుముకుంది. అదేవిధంగామంటల ధాటికి పదుల సంఖ్యలో కార్లు దహనమైపోయాయి. ఇక, ఇతర వాహనాలు కూడా అంతే సంఖ్యలో మంటలకు బూడిదయ్యాయి. మరోవైపు ప్రభుత్వం సహయాక చర్యలు చేపట్టినా.. అక్కడ మిగిలి ఉన్న వారు.. ప్రాణాలతో ఉన్న వారు ఒక్కరు కూడా లేకపోవడంతో కేవలం మంటలను ఆర్పేందు కు మాత్రమే సిబ్బంది పరిమితమయ్యారు. ఇదిలావుంటే.. కనీసం శవాలను కూడా గుర్తించలేని విధంగా ఎటు చూసినా మాంసపు ముద్దలే కనిపించాయి. ఏది వస్తువో.. ఏది మాంసపు ముద్దో కూడా గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని స్థానిక పోలీసులు తెలిపారు. వందల కొద్దీ అంబులెన్సులను రంగంలోకి దింపినా.. కాలిపోయిన, బూడిదైపోయినా.. దేహాల ను మాత్రమే వాటిలో తరలించే పరిస్థితి ఏర్పడిందని అంబులెన్సుల నిర్వాహకులు చెప్పారు. ఇది క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టేవారికి మరింత సవాలుగా మారింది. విమానంఒ క్కసారిగా పేలడంతో చనిపోయిన వారి మృతదేహాలు.. మంటల్లో చిక్కుకుని భస్మమయ్యాయ ని అధికారులు వివరించారు. గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మృతదేహం కోసం.. ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టినా.. ఫలితం లేకపోయిందని మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. "మాకు ఇప్పుడున్నది కేవలం జాబితా మాత్రమే. దానిని చూసి మాత్రమే ఎవరు ఏంటనేది నిర్ధారించుకోవాలి. కొన్ని మృతదేహాలు.. పూర్తిగా కాలిపోయాయి. కొన్ని ముద్దలు ముద్దలుగా పడి ఉన్నాయి" అని మంత్రి వ్యాఖ్యానించారు.

**రంగంలోకి అమెరికా నిపుణులు!...** కుప్ప కూలిన బోయింగ్ 171 విమానం ప్రమాదానికి గల కారణాలు అంతుచిక్కలేదు. దేశంలోని వైమానిక నిపుణులు.. ఇతర సాంకేతిక నిపుణులు కూడా.. ఈ ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించలేక పోతున్నారు. ప్రమాద తీవ్రత తెలుస్తున్నా.. ప్రమాదానికి కారణాలను మాత్రం అన్వేషించలేకపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. గంటలు గడిచిన తర్వాత.. కూడా బోయింగ్ విమానం ఎందుకు కుప్పకూలిందో తెలియని పరిస్థితి నెలకొంది. అటు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం, ఇటు విమానాయాన శాఖలు కూడా ఈ విషయంపై తీవ్ర ఆవేదన, ఆందో ళన వ్యక్తం చేస్తున్నాయి. పైకి చెబుతున్నట్టు సాంకేతిక వైఫల్యం అంటున్నా.. సదరు సాంకేతిక వైఫల్యం పైనా క్లారిటీ లేదు. అదేవిధంగా పక్షులు ఢీకొట్టాయని తాజా సమాచారం ఇస్తున్నా.. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా లేవు. దీంతో ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ అటు నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండి యా విమానం ప్రమాద వ్యవహారం ఉత్కంఠగా మారింది. దేశంలో ఉన్న పౌరులకు ఎలాంటి సమాధానం చెప్పినా.. ఏమీ కాదు. కానీ.. ఈ ప్రమాదంలో విదేశాలకు చెందిన వారు కూడా చనిపోయారు. ఈ నేపథ్యంలో బ్రిటన్ నుంచి భారత్ పై ఒత్తిడి పెరిగింది. దీంతో ఇప్పుడు హుటాహుటిన బోయింగ్ విమాన ప్రమాదం కారణాలను అన్వేషించేందుకు భారత ప్రభుత్వం అమెరికా నుంచి నిపుణులను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. బోయింగ్ విమానాలు.. అమెరికా నుంచే దిగుమతి చేసుకున్న నేపథ్యంలో అక్కడి నిపుణులను తీసుకువచ్చి.. కారణాలు అన్వేషిస్తే.. ఫలితం ఉంటుందని సర్కారు నిర్ణయించుకుంది. దీంతో ఇప్పటికే విదేశాంగ శాఖ అమెరికాకు అభ్యర్థన పంపించింది. అయితే.. ప్రస్తుతం ట్రంప్ సుంకాల బెడద నేపథ్యంలో ఈ ప్రమాదానికి గల కారణాలు అన్వేషించేందుకు ఏమేరకు సహకరిస్తారన్నది ప్రశ్న. మరో వైపు ప్రధాని మోదీ శుక్రవారం ఘటనా స్థలిని పరిశీలించారు.



# థాంక్యూ సీఎం సార్.. రేవంత్ రెడ్డితో మాదిగ ఎమ్మెల్యేల భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయి మంత్రివర్గంలో తమ సామాజిక వర్గానికి చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఇటీవల జరిగిన కేబినెట్ విస్తరణలో మాదిగ సామాజికి వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ కు అవకాశం దక్కింది. ఆయనకు ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ లు, ట్రాన్స్ జెండర్స్ శాఖలను అప్పగించారు. అంతకు ముందు తమ సామాజికి వర్గానికి కేబినెట్ విస్తరణలో అవకాశం ఇవ్వాలని మాదిగ ఎమ్మెల్యేలు పలు సార్లు సీఎంను భేటీ అయ్యారు. అందుకు అనుగుణంగా మంత్రివర్గ విస్తరణలో వివేక్, వాకిటి శ్రీహరితో పాటు మాదిగ సమాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ కు చోటు దక్కింది. ఈ నేపథ్యంలో అడ్లూరి లక్ష్మణ్ సహా పలువురు మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు ఇవాళ సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్యతో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తదితరులు ఉన్నారు.

# నా ఎన్నికల్లో అందరూ కష్టపడ్డారు.. రేపు మీ ఎన్నికల్లో కలిసి పని చేసుకోండి..



ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల కోసం కామంచికల్ రోడ్ కావాలని సత్యం కోరారు.. ఇందిరమ్మ ప్రభుత్వం రేవంత్ రెడ్డి హయాంలో అన్ని సంక్షేమ పథకాలు అందిస్తుంది.. నా ఎన్నికల్లో అందరూ కష్టపడి పని చేశారు, రేపు మీ ఎన్నికలు వస్తున్నాయని అంతా కలిసి పని చేసుకోండి అని సూచించారు. పాత పథకాలను నడిపిస్తూనే కొత్త పథకాలను అందిస్తున్నాం.. ఇంకా కొన్ని చేయాల్సి ఉంది, తప్పకుండా చేద్దాం మంచి రోజులు వస్తున్నాయి, వర్షాలు ముందే వచ్చాయి.. మీ గ్రామానికి సంబంధించి చాలా అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని చేద్దాం అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

ఇక, మీ ఇండ్లు తాతలు తండ్రులు కట్టినవి, రోడ్డు వెడల్పు కోసం మీ స్థలాలు కొంత పోతాయి అర్థం చేసుకోండి అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వంకాయలపాటి వెంకయ్య ఊరు ఆయన వెళ్ళేప్పుడు ఏమైనా పట్టుకుని వెళ్ళారా అని చెప్పారు. నేను గ్రామానికి ఒకసారి వస్తా వెళ్తా.. గ్రామాల్లో ఉండేది మీరు శుభ్రంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.. ఆసుపత్రికి వెళ్తే ఒక ఎకరం అమ్మవలసి వస్తుంది, అందుకే పరిశుభ్రంగా ఉండండి.. ప్రజలంతా ఖమ్మంలో ఉంటే మంచిది అనే భావన వచ్చింది.. ముఖ్యమంత్రినీ అడిగి ఇంకా 100 కోట్ల రూపాయలు తెచ్చిన పరిశుభ్రంగా ఉండాల్సిన బాధ్యత మీది అని మంత్రి నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు.



# వాళ్లకే ఎక్కువగా దక్కిన బార్లు! ప్రశాంతంగా ముగిసిన డ్రా.. రాష్ట్ర వ్యాప్తంగా 28 బార్లకు లాటరీ

రాష్ట్రవ్యాప్తంగా 28 బార్ల పునరుద్ధరణకు ఇవాళ ఆబ్కారీ శాఖ లాటరీ తీసింది. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లకు, మిగిలిన జిల్లాల్లోని 4 బార్లకు డ్రా ప్రశాంతంగా ముగిసింది. ఈ డ్రా లో బార్లను ఎక్కువగా నల్గొండ, హైదరాబాద్ జిల్లాలకు చెందివారు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం నార్సింగ్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్స్ హాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరి కిరణ్ చేతుల మీదుగా లాటరీ పద్ధతి ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశారు. జీహెచ్ఎంసీలోని 24 బార్లకు 3,520 దరఖాస్తులు రాగా.. మిగతా జిల్లాల్లోని నాలుగు బార్లకు 148 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో భాగంగా రెండు బార్లకు అప్లికేషన్ వేసినోళ్లకి ఒకటి దక్కడం విశేషం. ఒక సింగ్ వ్యక్తి 148 వేస్తే ఒకటి మాత్రమే దక్కడం గమనార్హం. మొత్తం 28 బార్లకు గానూ.. 3,668 దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ శాఖకు 36.68 కోట్ల రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, డ్రా తీయడానికి ముందు అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాద మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి ఎక్సైజ్ శాఖ నివాళులు అర్పించింది.



# దళితులపై అక్రమ కేసుల నమోదు అన్యాయం

హైదరాబాద్: దళితులపై రేవంత్‌రెడ్డి సర్కారు అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు తరలించడం అన్యాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర శివారు మైలార్‌దేవ్‌పల్లి పరిధి అత్తాపూర్‌లోని స్థానికులపై పెట్టిన అక్రమ కేసులపై పార్లమెంటులో ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

మూడు రోజుల క్రితం జంతు కళేబరాలను వాంబే కాలనీలోని దళిత వాడకు తరలిస్తుండగా కొందరు యువకులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు సుమారు 21 మందిని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈక్రమంలో చంచల్‌గూడ జైలులో ఉన్న హిందూ దళిత కార్యకర్తలను కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ములాఖత్ ద్వారా పరామర్శించారు. దళిత వాడలో జంతు వ్యర్థ పదార్థాలను వేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులపై పార్లమెంటులో ప్రస్తావించడమే కాకుండా జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలుస్తామన్నారు.



# అందుకే నాకు మంటలు అంటుకోలేదు..!

## అందుకే నాకు మంటలు అంటుకోలేదు: విమాన ప్రమాద మృత్యుంజయుడు విశ్వాస్

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నుంచి అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్‌కుమార్ రమేశ్. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. ప్రమాద క్షణాలను గుర్తుచేసుకున్నారు. విమానం కూలగానే తాను కూర్చున్న సీటు ఊడి పడిందని, అందువల్లే తాను బతికిబయటపడ్డానన్నారు. "నేను విమానం నుంచి దూకలేదు. టేకాఫ్ అయిన కాసేపటికే విమానం ముక్కలైంది. నా సీటు విరిగిపోవడంతో దూరంగా ఎగిరిపడ్డా. అందుకే విమానంలో చెలరేగిన మంటలు నాకు అంటుకోలేదు" అని విశ్వాస్ కుమార్ చికిత్స సమయంలో వైద్యులకు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై పలుచోట్ల గాయాలు అయ్యాయి. వాటినుంచి కోలుకుంటున్న ఆయన తాజాగా డీడీ న్యూస్ మీడియాతో మాట్లాడారు. "అంతా నా కళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కాలేదు. విమానం కింద పడగానే నేను కూడా చనిపోయానని అనుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నా. శిథిలాల నుంచి మెల్లగా నడుచుకుంటూ వెళ్లా. మంటల ధాటికి నా ఎడమ చేయికి గాయమైంది" అని విశ్వాస్ తెలిపారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ ప్రయాణికుడిని శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్వాస్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్‌కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోని 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. విశ్వాస్ ఒక్కడే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఈ ప్రమాదం వల్ల బీజే వైద్య కళాశాల వసతిగృహంలో మరో 24 మంది మృతి చెందారు.



# తెలంగాణకు ఐదురోజుల పాటు వర్షసూచన

హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించడంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి.. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ విభాగం వెల్లడించింది.

దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురవచ్చని.. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఇవాళ ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండతో పాటు వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. హైదరాబాద్‌లో ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.



# ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్‌పై ఇజ్రాయెల్ దాడులు

ఇరాన్ అణుకర్మాగారం లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. టెహ్రాన్‌లోని ఓ ప్రాంతంలో పేలుడు శబ్దాలు వినిపించినట్లు ఇరాన్‌లోని ఓ వార్తా సంస్థ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దాడులు చేయొద్దని అమెరికా వారించినా టెల్‌అవీవ్ దాన్ని పెడచెవిన పెట్టి మరీ ఈ దాడులకు పాల్పడటం గమనార్హం.

అమెరి కాకు చెందిన అధికారులు దీనిపై మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిందన్నారు. అయితే, ఇందులో అమెరికా ప్రమేయం లేదని స్పష్టంచేశారు. ఇక, ఈ దాడులకు ఇరాన్ ప్రతిస్పందించే అవకాశం ఉండటంతో దేశవ్యాప్తంగా ఇజ్రాయెల్ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. తమ దేశంలోని పౌరులే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్‌లతో ఇరాన్ దాడులు చేసే అవకాశం ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా దేశమంతటా ఎమర్జెన్సీ విధించే ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఈ దాడులను ఐడీఎఫ్ దళాలు ఎక్స్ వేదికగా తెలిపాయి. ఇరాన్‌పై తొలి దశ సైనిక చర్య ముగిసిందని పేర్కొంది.

ఇక, ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. ఇందులో అనేకమంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించినట్లు తెలిపింది. కెర్మాన్‌షా, లోరెస్తాన్, టెహ్రాన్‌లలోని పలు ప్రాంతాల్లో ఈ పేలుళ్లు జరిగినట్లు పేర్కొంది. కాగా.. సైన్యానికి హై అలర్ట్ జారీ చేసినట్లు తెలుస్తోంది.

# గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

**హైదరాబాద్: భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం శుక్రవారం ఆయన ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ గ్యాస్ట్రిక్ పరీక్షలు చేశామని వైద్యులు తెలిపారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు.**





# పది నిమిషాల ఆలస్యం.. ఆమె ప్రాణాలను నిలబెట్టింది

అహ్మదాబాద్ విమాన ప్రమాదం ప్రపంచ వ్యాప్తంగా ఎందరినో కలిచివేసింది. ఎన్నో కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది. అయితే పది నిమిషాల ఆలస్యం ఓ యువతి ప్రాణాలను నిలబెట్టింది. భారీ ట్రాఫిక్‌లో ఇరుకున్న ఆమె అహ్మదాబాద్ విమాన ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఆ ఘటన గురించి తలుచుకుంటుంటే తన శరీరం ఇంకా వణుకుతోందని చెప్పారు. విమాన ప్రమాదం నుంచి తనను దేవుడే రక్షించాడని పేర్కొన్నారు. లండన్‌లో భర్తతో కలిసి ఉంటున్న భూమి చౌహాన్ రెండేళ్ల అనంతరం వెకేషన్ కోసం ఇండియా వచ్చారు. తిరిగి వెళ్లేందుకు ఎయిరిండియా ఫ్లైట్ %ూ×%171లో టికెట్ బుక్ చేసుకున్నారు. విమానాశ్రయానికి చేరుకునే క్రమంలో ఆమె ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. దీంతో పదినిమిషాలు ఆలస్యమై ఆమె విమానం మిస్ అయ్యారు. ఆ తర్వాత కాసేటికే ప్రమాదం వార్త తెలిసింది. ఈ ఒళ్లు గగుర్పొడిచే ఘటన గురించి భూమి చౌహాన్ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టు చేశారు. "పదినిమిషాలు ఆలస్యం కావడం వల్ల నేను విమానం ఎక్కలేకపోయాను. నేను వెళ్లాల్సిన విమానం కుప్పకూలిందనే విషయం తెలిసి షాకయ్యా..! ఆ ఘటన గురించి తలుచుకుంటే నా శరీరం వణుకుతోంది. మాట్లాడలేకపోతున్నా. నా మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఆ దేవుడికి ధన్యవాదాలు. నా గణపతి బప్పే నన్ను కాపాడాడు" అని భూమి చౌహాన్ పేర్కొంది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో నిర్ణీత బోర్డింగ్ సమయం కంటే ఆమె పది నిమిషాలు ఆలస్యమయ్యారు. దీంతో ఆమె విమానం ఎక్కలేకపోయారు. ఫ్లైట్ మిస్ అవడంతో మధ్యాహ్నం 1.30 గంట సమయంలో ఆమె సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి బయటకు వచ్చేశారు. ఆ తర్వాత ఎనిమిది నిమిషాలకు అంటే మధ్యాహ్నం 1.38 గంటలకు విమానం టేకాఫ్ అయ్యి.. కొన్ని క్షణాలకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం AI171 టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 241 మంది మృతి చెందగా.. ఒక్కరే క్షేమంగా బయటపడ్డారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో 230 ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. విమానం మెడికోలు ఉంటున్న భవనంపై పడడంతో 24 మంది చనిపోయారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 265కు చేరింది. మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ కూడా ఉన్నారు.

చురకలు



## తాత్వికత, మానవతా భావనల సమ్మేళనాలు బుచ్చిబాబు రచనలు - జూన్ 14...బుచ్చిబాబు జయంతి



తెలుగు సాహిత్యంలో 'బుచ్చిబాబు' అనే పేరు వినగానే, మనిషి అంతరంగాన్ని, మానసిక సంఘర్షణలను సూక్ష్మంగా చిత్రించే ఆవిష్కరించే రచయితగా ఒక ప్రత్యేక గుర్తింపు వెంటనే ఉట్టిపడుతుంది. బాహ్య ప్రపంచపు చిత్రణ కన్నా వ్యక్తి అంతర్మనస్సు, బాధలు, ఆత్మవేదన, ఆలోచనల ప్రవాహాన్ని తన రచనల్లో ఆవిష్కరించిన బుచ్చిబాబు, కాలానుగుణంగా మార్పులకు లోను కాని సాహిత్య సంపదను తెలుగు భాషకు అందించారు. ఆయన రచనలు తాత్వికతతో పాటు మానవతా భావనల సమ్మేళనంగా నిలుస్తాయి. బుచ్చిబాబు అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు. ఆయన 1916 జూన్ 14న ఏలూరులో జన్మించారు. విద్యాభ్యాసం గుంటూరు, మద్రాస్, నాగపూర్‌లో సాగి, ఎం.ఏ. పూర్తి చేసి ఆంగ్లంలో ఉన్నతమైన పరిజ్ఞానాన్ని పొందారు. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన 1945 నుండి మరణించే వరకు ఆలిండియా రేడియోలో విధులు నిర్వహించారు. ఆంగ్లంలో 'సంతోష్ కుమార్' అనే కలం పేరు తోపా, తెలుగులో 'బుచ్చిబాబు'గా రచనలు చేశారు. బుచ్చిబాబు రచనా ప్రస్థానం విద్యార్థి దశలోనే మొదలైంది. ఆంగ్లంలో 'జువెనిలియా', 'బ్రోకెన్ వయొలిన్' వంటి కవితలతో పాటు, తెలుగులో 'పశ్చాత్తాపం' కథతో ప్రారంభమైన ఆయన సాహిత్య యాత్ర అనేక రూపాల్లో వికసించింది. ఆయన రచనలపై సోమర్‌సెట్ మామ్, ఓ.హెన్రీ ప్రభావం స్పష్టంగా కనిపించినా, తనదైన శైలితో, స్వయంగా అభివృద్ధి చెందిన రచయితగా గుర్తింపు పొందారు. బుచ్చిబాబు సుమారు 82 కథలు, 40 పైగా వ్యాసాలు, నాటికలు, నాటకాలు, ఒకే ఒక నవల, వచన కావ్యం, సాహిత్య పరామర్శ గ్రంథం, స్వీయ చరిత్ర మొదటి భాగం, పీఠికలు, పరిచయాలతో తన రచనా సామ్రాజ్యాన్ని విస్తరించారు. బుచ్చిబాబు రచనలలో మైలురాయి అయిన రచన "చివరకు మిగిలేది" అనే నవల. ఇందులోని దయానిధి అనే పాత్ర మానవ సంబంధాల్లోని సంక్లిష్టతలను, మానసిక వ్యథలను ప్రతిబింబిస్తుంది. తల్లి పాత్రపై వచ్చిన నిందలు, కుటుంబ అనుబంధాల తూటాలు, వ్యక్తిత్వ విపరిణామం వంటి అంశాలను తాత్వికంగా గాను, భావోద్వేగపూరితం గాను విశ్లేషించారు. ఈ నవల, వ్యక్తి అంతరంగ యాత్రగా సాగిపోతూ, మానసిక పరిశీలనకు ప్రతినిధిగా నిలుస్తుంది. 'అజ్ఞానం' వచన కావ్యంగా వెలువడిన బుచ్చిబాబు తాత్విక రచన. ఇందులో జ్ఞానం, అజ్ఞానం మధ్య పరస్పర సంబంధాన్ని ప్రశ్నిస్తూ, మానవ లోపాలను, ఆశయాలను ఆయన తాత్విక బహిర్గతం చేస్తారు. బుచ్చిబాబు కథల సంపుటాలు 'మేడమెట్లు', 'బుచ్చిబాబు కథలు' మొదటి, రెండవ భాగాలు రూపంలో ప్రచురించ బడ్డాయి. 'నన్ను గురించి కథ వ్రాయవూ?', 'అరకులోయలో కూలిన శిఖరం', 'ముగింపు మీకు తెలుసు' వంటి కథల్లో ఆయన లోతైన మానవ అర్థవంతతను, మానసిక సంఘర్షణలను ఆకళింపు చేస్తారు. సాధారణ సంఘటనలనే అసాధారణమైన మనోభావాల చిత్రణగా మలచడంలో ఆయన నైపుణ్యం చూపారు. నాటక రచన లోనూ బుచ్చిబాబు ప్రత్యేక స్థానం సంపాదించారు. 'ఆద్యంతాలు మధ్య రాధ', 'ఉత్తమ ఇల్లాలు', 'ఒకే నిద్ర - ఎన్ని కలలు' వంటి నాటకాలు సామాజిక సంబంధాల్లోని సున్నితత్వాన్ని, భావోద్వేగాల సంఘర్షణను ప్రతిబింబించాయి. నాటికల రూపంలో వచ్చిన 'శిష్యరక్షిత', 'ఒమర్ ఖయ్యాం' వంటి రచనలు వచన ప్రాముఖ్యతను సూచిస్తాయి. 'షేక్స్పియర్ సాహిత్య పరామర్శ' వంటి గ్రంథం ద్వారా బుచ్చిబాబు సాహిత్య విమర్శకుడి గానూ గొప్ప చైతన్యాన్ని ప్రదర్శించారు. ఆయన ఆత్మ కథాత్మక రచన 'నా అంతరంగ కథనం'లో తన బాల్యానుభవాలను పంచుకోగా, 'నన్ను మార్చిన పుస్తకం' వంటి వ్యాసంలో వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన రచనల్ని గుర్తుచేశారు. బుచ్చిబాబు రచనా శైలి విశిష్టమైనది. పదజాలంలో ఆర్భాటం లేకుండా, అంతర్ముఖత కలిగిన భాషను ఉపయోగించడంతో పాటు, పాత్రల మానసిక స్థితిగతుల్ని ఆవిష్కరించడంలో అసాధారణ ప్రతిభ కనబరిచారు. బాహ్య సంఘటనలను కథాంశంగా తీసుకొని, వాటి వెనుక దాగి ఉన్న మానవ భావజాలాన్ని ఆయన వెలికి తీశారు. తాత్వికత, మానవ సంబంధాల విశ్లేషణ, వ్యక్తి మనోభావాల సూక్ష్మ చిత్రణలో ఆయన రచనలు అగ్రగామిగా నిలుస్తాయి. బుచ్చిబాబు రచనలు వ్యక్తిగత అనుభవాలనే గాక, సమాజాన్ని దాని ప్రక్కనుండి గమనించి ప్రతిబింబించే ప్రయత్నంగా కూడా నిలుస్తాయి. మానసిక సంఘర్షణకు మౌలిక గమనాన్ని ఇవ్వడం ద్వారా, ఆయన రచనలు ఆత్మన్వేషణకు మార్గదర్శిగా మారాయి. 1967 సెప్టెంబరు 20న బుచ్చిబాబు హృద్రోగంతో మరణించారు. కానీ ఆయన రచనలు, ఆలోచనలు, తాత్విక విశ్లేషణలు సమకాలీనతను అధిగమించి, శాశ్వత రూపంలో నిలిచి పోయాయి. ఒకే నవలతో తెలుగు నవలా సాహిత్యంలో అపూర్వ స్థానం పొందిన బుచ్చిబాబు, తక్కువ రచనలు చేసినా, నాణ్యతతో ఆ స్థాయిని చాటుకున్నారు. తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు ఒక మనో విశ్లేషకుడిగా, జీవితాన్ని లోతుగా పరికించే తాత్వికుడిగా, మానవతా భావనలకు ప్రతినిధిగా నిలిచారు. ఆయన రచనలు కాలానుగుణ మార్పులపై ప్రభావం చూపగలిగిన అర్ధవంతమైన సాహిత్యంగా పాఠక హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**


## నందూరి పార్థసారథి: సాహిత్యమూ, పాత్రికేయమూ కలిసిన జీవన యానం -జూన్ 14...నందూరి పార్థసారథి వర్ధంతి



తెలుగు సాహిత్య, పత్రికా రంగంలో నిండుగా రసదాయకంగా దశాబ్దాల పాటు విస్తరించిన పేరు ం నందూరి పార్థసారథి. వ్యంగ్యం, హాస్యం, విమర్శ, సంగీతం, చలనచిత్రం వంటి అనేక కళా విభాగాలపై లోతైన చింతనతో రచన చేసి పాఠకులకు కొత్త పోకడలను చూపించిన అరుదైన రచయిత. 1939, జూలై 31న కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, ఆరుగొలను గ్రామంలో జన్మించిన ఆయన, 2024 జూన్ 14న హైదరాబాదులో పరమపదించగా, తన రచనల ద్వారా చిరంజీవిగా నిలిచిపోయారు. విజయవాడలో ఇంటర్మీడియట్ చదివిన ఆయన, హైదరాబాద్‌లో బి.ఏ. పూర్తిచేసి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. విద్యార్హత మాత్రమే కాదు, అభిరుచి, పాండిత్యం కలగలిసిన భావదృష్టితో 1959లో "ఆంధ్రప్రభ" పత్రికలో పాత్రికేయుడిగా ప్రస్థానం మొదలుపెట్టారు. తరువాత ఏకకాలంలో శార్వరి, విద్వాన్ విశ్వం, గొల్లపూడి మారుతీరావుల వంటి సాహిత్య వేత్తలతో కలిసి పనిచేశారు. ఆయన రచనా నైపుణ్యం, సామాజిక పరిపక్వత, వ్యవస్థలపై వాడిగా బాణాలు ఎక్కు పెట్ట గలిగిన ధైర్యం ఆయనను పత్రికా రంగంలో విశిష్టంగా నిలబెట్టాయి. పార్థసారథి రచనలు మొదటిగా 1957లో ప్రచురితమవ్వగా, తరువాత 'రాంబాబు డైరీ' (మూడు భాగాలు), 'పిబరే హ్యూమరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలోకనం', 'ఖారా?నాఖ్యానము', 'జెజి మావయ్య పాటలు' వంటి హాస్య రచనలతో తెలుగు పాఠకులను నవ్విస్తూ ఆలోచింపజేసే శైలిని ఏర్పరచుకున్నారు. ఆయన రచనలు కేవలం వినోదం కోసం గాక, సంఘాన్ని ప్రశ్నించే, అలసిన మానవ సమాజాన్ని చైతన్యపరచే రీతిలో సాగతీత చేశాయి. ఆయన వ్యాసాలు, సమీక్షలు, సంగీతంపై రచనలు హిందుస్తానీ సంగీతం పై నిశిత అవగాహనను చాటాయి. "స్వరార్ణవం", "సంగీత కళా చరిత్ర", "శ్రీకృష్ణ కథామృతం" వంటి రచనలు సంగీతారాధకులను ఆకట్టుకున్నాయి. నాటక, శిల్ప, చిత్రకళలపై కూడా వ్యాసాలు రాశారు. 2000 అక్టోబరులో దీపావళి సందర్భంగా ఆయన ప్రారంభించిన 'రసమయి' మాసపత్రిక (95 సంచికలు) ఒక సాంస్కృతిక వేదికగా నిలిచి, నాటకీయ సమీక్షలు, కళా విశ్లేషణలు, సంప్రదాయ%-%నవీన విలయ రూపంగా పాఠకులకు వినూత్న అనుభవాన్ని అందించింది. సంపూర్ణంగా స్వంత ఖర్చుతో, సాహిత్యాన్ని సేవా ధర్మంగా భావించిన తపస్విగా ఆయన దీనిని నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం 1992లో హాస్య రచనకు, 2002లో పాత్రికేయ సేవలకు ఆయనకు పురస్కారాలు అందించింది. 1993లో "హాస్య రచయిత"గా విశ్వవిద్యాలయ ప్రత్యేక గుర్తింపు పొందారు. అతని రచనా వైవిధ్యం, భాషలో సరళత, లోతైన విశ్లేషణ సామర్థ్యం, మరియు నిర్భయంగా భావాలు చెప్పగల ధైర్యం ఆయనను అసామాన్య రచయితగా నిలిపాయి. వ్యక్తిగతంగా ఆయన అతి సామాన్యుడిగా, మితభాషిగా, పరిపక్వ విశ్లేషణతో కూడిన అరుదైన వ్యక్తిగా పేరుగాంచారు. ఆయనతో పనిచేసిన యువ రచయితలు, పాత్రికేయులు ఆయన దగ్గర నుండి స్పష్టత, నిబద్ధత, శాస్త్రీయతను నేర్చుకున్నారు. ఆయన సోదరుడు నందూరి రామ్మోహనరావు కూడా ప్రముఖ పాత్రికేయుడు. ఆయన భార్య సువర్చలాదేవి, కుమారుడు మధుసారథి కూడా ఆయన వారసత్వాన్ని గౌరవించేవారే. నందూరి పార్థసారథి పేరు, రచనలు, విమర్శా దృక్కోణం తెలుగుకు ఒక ఆత్మీయమైన ఖ్యాతిని తెచ్చాయి. ఆయన జీవితం ం రచనకు అంకితమైన జీవితం. ఆయన పదాలు ం నవ్విస్తూ, తోచిస్తూ, చదివించిన తర్వాత ఆలోచింపజేసే పదాలు. అలాంటి రచయితలను ఒక్కసారి చనిపోయారని చెప్పినా, నిజంగా వాళ్లు చదివే ప్రతి పాఠకుడి హృదయంలో నవ్యంగా పునర్జన్మిస్తుంటారు. తెలుగు పత్రికా, సాహిత్య రంగాలకు చేసిన ఆయన సేవలు ఎనలేనివి. నందూరి పార్థసారథి సాహిత్యమూ, దృక్కోణమూ భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఆయన జ్ఞాపకాలను, రచనలను మనం గౌరవంగా, స్ఫూర్తిగా భావించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## అక్షర యానంలో ఒక ఉద్యమ ప్రతీక... నాగభైరవ కోటేశ్వరరావు - జూన్ 14...నాగభైరవ కోటేశ్వరరావు వర్ధంతి



తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహకు, ప్రజల ఆశయాలకు ప్రతినిధిగా నిలిచిన రచయితలలో నాగభైరవ కోటేశ్వరరావు (ఆగష్టు 15, 1931 – జూన్ 14, 2008) ఒక ముఖ్యమైన స్థానం ఆక్రమించారు. కవిగా, నాటక కారుడిగా, విమర్శకుడిగా, పరిశోధకునిగా, అనువాదకునిగా, సంపాదకుడిగా ఆయన చేసిన విస్తృతమైన కృషి తెలుగు సాహిత్యాన్ని మానవీయత, విమర్శనాత్మకత, చైతన్యంతో నిండి ఉంచింది. రెండు తరాల రచయితలకు ఆయన మార్గదర్శిగా నిలిచారు. 1931 ఆగస్టు 15న ప్రకాశం జిల్లా, రావినూతల గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నాగభైరవ, చిన్ననాటి నుంచే సాహిత్య పఠనంపై మక్కువతో పెరిగారు. ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో, అనంతరం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో విద్యార్హతలు పొందారు. ఆచార్య గంటి జోగి సోమయాజి, ఖండవల్లి లక్ష్మీరంజనం వంటి మహోన్నతుల వద్ద విద్యనభ్యసించి, భిన్న సాహిత్య భావాల మధ్య బలమైన స్థితిగతిని ఏర్పరచు కున్నారు. 1953లో తెలుగు అధ్యాపకునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, విద్యార్థుల్లో పరిశీలనా శక్తిని, విమర్శాత్మక దృష్టిని పెంపొందించారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఆయన సాగించిన సాహిత్య సేవ విస్తృతమైనది. కవిత్వం ద్వారా వ్యక్తిగత భావాలకంటే సమాజం పట్ల బాధ్యతను, చుట్టుపక్కల జరుగుతున్న అన్యాయాల పట్ల స్పందనను ప్రతిబింబించారు. "నాగభైరవ ఖండికలు", "నాగభైరవ గేయాలు'' వంటి కవితా సంపుటులు ఆయన లోతైన భావనా వైశాల్యానికి నిదర్శనం. కవిత్వంలో మానవీయత, చారిత్రక అవగాహన, సామాజిక ప్రశ్నలు ఆయనకు కేంద్ర బిందువులు. విమర్శకుడిగా నాగభైరవ కోటేశ్వరరావు, సాహిత్యాన్ని సామాజిక నిర్మాణ ప్రక్రియగా చూశారు. ఆయన విమర్శ రచనలు భావనా లోతుతో పాటు శాస్త్రీయ నిర్మాణాన్ని కలిగి ఉ ంటాయి. "విమర్శలో నాగభైరవ", "విమర్శ వ్యాసాలు" వంటి గ్రంథాలలో ఆయన శైలీ, దృష్టికోణాలు ప్రతిఫలిస్తాయి. కేవలం సాహిత్య నిర్వచనం కాకుండా, సమకాలీన సమస్యలతో రచనల అనుబంధాన్ని విశ్లేషించడం ఆయన ప్రత్యేకత. అంతేకాకుండా, తెలుగు సాహిత్య పరిశోధనలో కూడా ఆయన చేసిన కృషి ఎంతో విలువైనది. ప్రాచీన సాహిత్యపు మూలాలను వెలికితీసి, ఆధునిక కవుల రచనల ఆధారిత విశ్లేషణలు చేసి, పాఠకులకు చరిత్ర, ప్రక్రియల మధ్య సంబంధాన్ని వివరించారు. "తెలుగు సాహిత్య వికాసం", "ప్రాచీన తెలుగు సాహిత్యం – ఒక పరిశీలన" వంటి గ్రంథాలు పరిశోధనా శాస్త్రంలో ఆయన స్థాయిని వెల్లడిస్తాయి. అనువాదం అనే క్షేత్రంలో కూడా నాగభైరవ విశేష కృషి చేశారు. ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యంలోని విలువైన రచనలను తెలుగులోకి తీసుకువచ్చారు. ఆయన అనువాదాలు అచ్చమైన తెలుగులో, మూల భావనలతో సింధించబడి ఉంటాయి. నాటక రచయితగా ఆయన 'గొడుగు', 'నిశ్శబ్ద ఉద్యమం' వంటి నాటకాలు వ్రాశారు. ఇవి వ్యవస్థాపిత వ్యవసాయ విధానాలపై విమర్శను, దళితుల స్థితిగతులను సామర్థ్యంగా ప్రతినిధీకరించాయి. అలాగే, కథా రచయితగా 'మూసిన కళ్ల వెలుగు' వంటి రచనల ద్వారా పేదల జీవితాల్లోని కఠినతలు, శ్రమజీవుల ఆవేదనల్ని అక్షరాల రూపంలో ఆవిష్కరించారు. నాగభైరవ రచనా శైలిలో స్పష్టత, సామాజిక బాధ్యత, ఉద్యమ ధ్వని మిళితమై ఉంటాయి. ఆయన భాష ప్రజల భాష. పదబలంతో కాక, భావబలంతో ఆకట్టుకునే శైలి. ఆయన రచనల్లో శోభనా ప్రకృతి వర్ణనలు కాక, శ్రమజీవుల చెమట వాసన ఉంటుంది. జీవితాన్ని మానవత్వపు గళంగా చూడాలన్న తపన ఆయన ప్రతి వాక్యంలో ప్రతిబింబిస్తుంది. అందుకే ఆయనను కేవలం సాహితీవేత్తగా కాక, ఉద్యమకారుడిగా గుర్తించాలి. దళిత హక్కుల ఉ ద్యమం, విద్యార్థి ఉద్యమాలు, వామపక్ష భావజాలం – ఇవన్నీ ఆయన సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. రచనను మార్పు సాధనంగా వినియోగించిన కవి, పరిశోధకుడు, విమర్శకుడు ఆయన. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రత్యేక సత్కారం, అభ్యుదయ రచయితల సంఘం ప్రజాసాహిత్య పురస్కారం వంటి గౌరవాలు ఆయనకు లభించాయి. అయితే నిజమైన గుర్తింపు, పాఠకుల అభిమానం, ఉద్యమ వేదికల గౌరవం ఆయనకు లభించిన గొప్ప పురస్కారాలు. 1988లో నాగభైరవ కోటేశ్వరరావు అకాలంగా మృతిచెందారు. కానీ ఆయన రచనలు నేటికీ అందరి గుండెల్లో మారు మ్రోగుతున్నాయి. యువతలో సామాజిక స్పృహను రేకెత్తించేందుకు ఆయన సాహిత్యం మార్గదర్శకంగా నిలుస్తోంది. నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య వారసత్వం – ఒక ఉద్యమ శిలా, ప్రజావాణి, అక్షర సత్యం. ఇందువల్లనే ఆయన్ని "ఉద్యమ ధర్మానికి అక్షర రూపం ఇచ్చిన రచయిత"గా అభివర్ణించవచ్చు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




## అదానీ గ్రూప్ నుంచి మరో ఐపీఓ!

గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ నుంచి మరో కంపెనీ ఐపీఓకి రానుంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ విమానాశ్రయ నిర్వహణ సంస్థ అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకురావాలని చూస్తోంది. ఎయిర్‌పోర్ట్స్ విభాగాన్ని 2027 నాటికి ఐపీఓ ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ చేయనుంది. 2027 మార్చి నాటికి ఈ కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

అదానీ గ్రూప్ వృద్ధి వ్యూహంలో భాగంగా రానున్న కొన్ని సంవత్సరాల్లో వివిధ వ్యాపారాల్లో రూ. 8 లక్షల కోట్లు (100 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టనుంది. ప్రస్తుతం అదానీ గ్రూప్ భారత్‌లో ఎనిమిది విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటిలో భారత ఆర్థిక రాజధాని ముంబయి సమీపంలోని నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది. ఇది త్వరలోనే ప్రారంభం కానుంది. సంస్థ తన మూలధన వ్యయ ప్రణాళికను రెట్టింపు చేసింది. గత పదేళ్లలో ఖర్చు చేయాలనుకున్న 100 బిలియన్ డాలర్లను ఇప్పుడు ఐదు నుంచి ఆరేళ్లలోనే పెట్టుబడిగా మార్చేందుకు సన్నాహాలు చేస్తోంది.

**సెబీ కొత్త యూపీఐ మెకానిజం...** గత వారం అదానీ ఎయిర్‌పోర్ట్స్.. అంతర్జాతీయ బ్యాంకుల కన్సార్టియం నుంచి 750 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 6,400 కోట్ల) రుణాలను తీసుకుంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అయిన ఏఏహెచ్ఎల్, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ) ద్వారా ఈ రుణాలు పొందింది. ప్రస్తుతం సంస్థకు ఉన్న 400 మిలియన్ డాలర్ల రుణాల రీఫైనాన్సింగ్ కోసం ఈ నిధులను వెచ్చించనుంది. వ్యాపార విస్తరణతో అదానీ గ్రూప్ దేశీయ విమానయాన రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## హసీనా నోరు మూయించాలని చూస్తే.. మోదీ అంగీకరించలేదు..!

విద్యార్థుల ఉద్యమంతో పదవి కోల్పోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఢిల్లీ నుంచే సామాజిక మాధ్యమాల వేదికగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై ఆమె విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయమై తాను భారత ప్రధాని నరేంద్రమోదీతో చర్చించానని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తెలిపారు. హసీనాను కట్టడి చేయాలని కోరగా.. దానికి మోదీ అంగీకరించలేదని వెల్లడించారు. లండన్‌లోని చాతమ్ హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని నెలల క్రితం బిమ్‌స్టెక్ సదస్సులో భాగంగా మోదీతో భేటీ అయిన యూనస్.. భారత ప్రధానితో నాటి సంభాషణను గుర్తుచేసుకున్నారు. "హసీనాకు భారత్‌లో ఆశ్రయం కల్పించడంపై నేను మాట్లాడను. అది మీ విధానపరమైన నిర్ణయం. కానీ బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టేలా ఆమె ఆన్‌లైన్‌లో ప్రసంగాలు చేస్తున్నారు. దానివల్ల మా దేశంలో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ విషయంలో మీరు (భారత ప్రధానిని ఉద్దేశిస్తూ) జోక్యం చేసుకోండి. అలాంటి ప్రకటనలు, ప్రసంగాలు చేయకుండా ఆమెను అడ్డుకోండి" అని మోదీని కోరినట్లు యూనస్ తెలిపారు. దీనికి మోదీ బదులిస్తూ.. "అది సోషల్ మీడియా. దాన్ని నియంత్రించడం సాధ్యం కాదు" అని చెప్పినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వాధినేత వెల్లడించారు.

**భారత్‌తో సత్సంబంధాలే కోరుకుంటున్నాం..** ఈసందర్భంగా భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల గురించి ఆయన మాట్లాడారు. "ఇది మా పొరుగుదేశం. భారత్‌తో బలమైన సంబంధాలు ఉండాలని మేం కోరుకుంటున్నాం. వారితో మాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ, నకిలీ వార్తల కారణంగా మా ప్రయత్నాలకు ఎక్కడో గండి పడుతోందని అనుమానంగా ఉంది" అని యూనస్ పేర్కొన్నారు.

**వచ్చే ప్రభుత్వంలో నేను ఉండను..** వచ్చే ఏడాది తొలి అర్ధభాగంలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీనిపైనా యూనస్ స్పందించారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో భాగం కావాలనే ఉద్దేశం గానీ, ఆసక్తి గానీ తనకు లేవన్నారు. ఎన్నికలు సక్రమంగా జరగాలనే తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ పురోగతికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.




## పాక్ గుండెల్లో 'బ్రహ్మోస్' భయం.. 'చైనా సరకు' వద్దని జర్మనీ వైపు చూపు!

పహల్గాం ఉగ్రదాడితో తీవ్ర ఆవేదనకు గురైన ఇండియా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ప్రతిదాడికి దిగిన పాకిస్థాన్‌ను గజగజా వణికించింది. ఆ దేశంలోని వైమానిక స్థావరాలను దెబ్బతీసింది. భారత్ ప్రతాపాన్ని ఎదుర్కోలేక పాక్ బిక్కు మొహం వేసింది. చైనా నుంచి కొనుగోలు చేసిన గగనతల రక్షణ వ్యవస్థ భారత్ అస్త్రాలను నిలువరించలేకపోయింది. దీంతో ఆ వ్యవస్థకు స్వస్తి పలికి.. జర్మనీ నుంచి అధునాతన రక్షణ వ్యవస్థను కొనుగోలు చేయాలని పాక్ అడుగులు వేస్తోంది

**బ్రహ్మోస్ సృష్టించిన భయం!...** ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించినట్లు భారత్ ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. కానీ, తమ వైమానిక స్థావరాలపై భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించిందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బహిరంగంగా వ్యాఖ్యానించారు. దీనిని బట్టి భారత్ పూర్తిస్థాయిలో దాడి చేస్తే.. తట్టుకోలేమని పాక్ ముందుగానే గ్రహించింది. ముఖ్యంగా బ్రహ్మోస్ క్షిపణుల విధ్వంసాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేక రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు పావులు కదుపుతోంది.

**చైనా రక్షణ వ్యవస్థపై సన్నగిల్లిన నమ్మకం...** పాకిస్థాన్ ప్రస్తుతం చైనా నుంచి కొనుగోలు చేసిన హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 గగనతల రక్షణ వ్యవస్థలను వినియోగిస్తోంది. ఇటీవల భారత్ ప్రయోగించిన డ్రోన్, క్షిపణి దాడులను ఇవి నియంత్రించలేకపోయాయి. అంతేకాకుండా పాక్ చెబుతున్నట్లు ఒకవేళ భారత్ బ్రహ్మోస్ క్షిపణులను వినియోగించినా.. వాటిని ఎదిరించే సత్తా, ఈ రెండు రక్షణ వ్యవస్థలకు లేనట్లు తేలిపోయింది. ఈ నేపథ్యంలో కచ్చితమైన పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు పాక్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే గత మూడేళ్లుగా రష్యా అలుపెరుగని యుద్ధం చేస్తున్నా.. సమర్థంగా తిప్పికొడుతున్న ఉక్రెయిన్ వినియోగిస్తున్న గగనతల రక్షణ వ్యవస్థను సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ సాంకేతికతను ఉక్రెయిన్.. జర్మనీ నుంచి కొనుగోలు చేసింది.

**పాక్ చూపులు జర్మనీ వైపు...** గత ఏడాదిలో రష్యా ప్రయోగించిన 60 క్షిపణులను సమర్థంగా నేలకూల్చినట్లు నెల రోజుల క్రితం ఉక్రెయిన్ ప్రకటించింది. జర్మనీ నుంచి కొనుగోలు చేసిన ఐరిస్-టి-ఎస్ఎల్ఎమ్ గగనతల రక్షణ వ్యవస్థను వినియోగించినట్లు తెలిపింది. డీల్ డిఫెన్స్ సంస్థ తయారుచేసిన ఈ వ్యవస్థ.. రష్యాకు చెందిన P-800 ఆనిక్స్ క్షిపణులను సమర్థంగా ఎదుర్కొంది. ఈ క్షిపణులకు, భారత్ రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణులకు దగ్గరి పోలికలు ఉన్నట్లు రక్షణ రంగ నిపుణులు చెబుతుంటారు. ఈనేపథ్యంలోనే వాటిని కొనుగోలు చేసేందుకు పాక్ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**అసలేంటీ రక్షణ వ్యవస్థ?...** ఇది భూ ఉపరితలం నుంచి క్షిపణి దాడులను ఎదుర్కొనే మధ్య శ్రేణి రక్షణ వ్యవస్థ. 1990లో తొలిసారిగా జర్మనీకి చెందిన డీల్ డిఫెన్స్ సంస్థ ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఆ తర్వాతి కాలంలో పలుమార్లు అప్‌గ్రేడ్ చేసింది. రాడార్, ఆపరేషన్ సెంటర్లు, బహుళ లాంచర్ల వ్యవస్థ లాంటి అధునాతన సాంకేతిక వ్యవస్థలను జోడించింది. 360 డిగ్రీల కోణంలో 40 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఈ వ్యవస్థ ఛేదించగలదు. 2023లో జర్మనీ తన రక్షణ అవసరాల కోసం డీల్ డిఫెన్స్ సంస్థ నుంచి ఆరు ఐరిస్ రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసింది. దీనికోసం సుమారు 971.73 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది.

**పాకిస్థాన్‌కు అంత సులువేం కాదు!...** ఐరిస్-టి-ఎస్ఎల్ఎమ్ కొనుగోలు కోసం డీల్ డిఫెన్స్ సంస్థతో పాకిస్థాన్ ఒప్పందం కుదుర్చుకోవడం అంత సులువేం కాదు. ఆ సంస్థలో భాగస్వామ్యం ఉన్న థైసెన్‌క్రప్ మెరైన్ సిస్టమ్స్ అనే సంస్థ భారత్‌లోని వివిధ రక్షణ ప్రాజెక్టుల్లో కీలకంగా వ్యవహరిస్తోంది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా సుమారు రూ. 70 వేల కోట్లతో భారత్ 6 జలాంతర్గాములను అభివృద్ధి చేస్తోంది. ఈ ప్రాజెక్టుకు ఆ రెండు సంస్థలు సంయుక్తంగా ఇంటరాక్టివ్ డిఫెన్స్ అండ్ అటాక్ సిస్టమ్స్ (ఐడీఏఎస్) సరఫరా చేస్తున్నాయి. అంతేకాకుండా భారత్‌కు చెందిన రిలయన్స్ డిఫెన్స్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలతో డీల్ డిఫెన్స్‌కు కీలక ఒప్పందాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కీలకంగా ఉన్న భారత్‌ను కాదని, పాకిస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ సంస్థలు ముందుకువచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

**ఆర్థిక వనరులూ అంతంతే!...** పాకిస్థాన్‌లో దాదాపు 45 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే. అంతేకాకుండా అభివృద్ధిని పక్కకునెట్టి.. రక్షణ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తున్నారని ఆ దేశంలోనే నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గత నెలలో ఐఎంఎఫ్ నుంచి బిలియన్ డాలర్లు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి మరో 800 మిలియన్ డాలర్లను పాక్ అప్పు తీసుకుంది. ఈ పరిస్థితుల్లో పాక్ అంత భారీ మొత్తం చెల్లించి రక్షణ వ్యవస్థను కొనుగోలు చేస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకవేళ చైనాకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటే.. ఇప్పటివరకు మద్దతిస్తున్న చైనా కూడా పాక్‌కు వ్యతిరేకంగా మారే అవకాశముంది. ఇన్ని ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పాక్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

చురకలు

## సంపాదకీయం

# పాకిస్థాన్ కు 'బ్రహ్మోస్' భయం...

## బయటపడే మార్గాలకు ఇదిగో 'నో ఛాన్స్'!

పాకిస్థాన్ ఆలోచనా విధానం, పాకిస్థాన్ ఫ్యూచర్.. పహల్గాం ఉగ్రదాడికి ముందు, తర్వాత అన్నట్లుగా మారిపోయిందన్నా అతిశయోక్తి కాదేమో! పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకున్న దౌత్యపరమైన నిర్ణయాలు, ఆపరేషన్ సిందూర్ తో ఇచ్చిన సైనికపరమైన చర్యల ఫలితాలు పాక్ ను వణికించేసిన పరిస్థితి. భారత క్షిపణుల దాటికి పాక్ బెంబేలెత్తిపోయింది. పాక్ డ్రోన్లు భారత్ ను తాకకుండా అడ్డుకున్న రక్షణ వ్యవస్థలు ఒకపక్క.. పాక్ లో ఎయిర్ బేస్ లను లక్ష్యంగా చేసుకుని అదరగొట్టిన బ్రహ్మోస్ క్షిపణుల పెర్ఫార్మెన్స్ మరో లెక్క. ఈ సమయంలో భారత్ సత్తాతో పాటు పాకిస్థాన్ నమ్ముకున్న ఆయుధాలపైనా ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. దీంతో.. ఆయుధాల విషయంలో పాక్ ఆలోచన మార్చుకుందని తెలుస్తోంది. అవును... భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో చైనా నుంచి కొనుగోలు చేసిన గగనతల రక్షణ వ్యవస్థలు భారత్ అస్త్రాలను నిలువరించలేకపోయాయి! దీంతో.. ఆ వ్యవస్థకు స్వస్తి పలకాలని పాకిస్థాన్ నిర్ణయించుకుందని తెలుస్తోంది. ఈ సమయంలో.. జర్మనీ నుంచి అధునాతన రక్షణ వ్యవస్థను కొనుగోలు చేసి, 'బ్రహ్మోస్' భయం నుంచి బయటపడాలని భావిస్తోంది! వాస్తవానికి ఆపరేషన్ సిందూర్ లో భారత్ 'బ్రహ్మోస్' క్షిపణులను ప్రయోగించినట్లు ఆర్మీ ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. అయితే.. పొలిటికల్ వేదికలపై మాత్రం ఈ మేరకు కామెంట్లు వినిపించాయి. కానీ, తమ ఎయిర్ బేస్ లపై భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించిందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బహిరంగంగా వ్యాఖ్యానించారు. దీంతో.. చైనా నుంచి కొనుగోలు చేసిన హెచ్.క్యూ-9, హెచ్.క్యూ-16 గగనతల రక్షణ వ్యవస్థలను వినియోగిస్తే... భారత్ ప్రయోగించే డ్రోన్లు, క్షిపణి దాడులను అడ్డుకోలేమని పాక్ పక్కాగా ఒక క్లారిటీకి వచ్చిందని అంటున్నారు. బ్రహ్మోస్ పూర్తి స్థాయిలో ప్రయోగిస్తే తమ పని ఇబ్బందే అని భావించిన నేపథ్యంలో.. కచ్చితమైన పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు పాకిస్థాన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గత మూడేళ్లుగా రష్యా అవిరామంగా దాడులు చేస్తున్నా.. సమర్థవంతంగా తిప్పుకొడుతున్న ఉక్రెయిన్ వినియోగిస్తున్న గగనతల రక్షణ వ్యవస్థను సొంతం చేసుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టెక్నాలజీని జర్మనీ నుంచి కొనుగోలు చేసింది ఉక్రెయిన్. ఇప్పుడు అదే టెక్నాలజీని తాము నమ్ముకోవాలని పాక్ భావిస్తోందని అంటున్నారు. అయితే.. జర్మనీకి చెందిన డీల్ డిఫెన్స్ సంస్థతో పాకిస్థాన్ ఒప్పందం చేసుకోవడం అంత సులువేం కాదని అంటున్నారు. ఎందుకంటే.. ఆ సంస్థలో భాగస్వామ్యం ఉన్న థైసెన్ క్రప్ మెరైన్ సిస్టమ్స్ అనే సంస్థ భారత్ లోని వివిధ రక్షణ ప్రాజెక్టుల్లో కీలకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా.. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా సుమారు రూ.70 వేల కోట్లతో భారత్ 6 జలాంతర్గాములను అభివృద్ధి చేస్తోంది. ఈ నేపథ్యంలో కీలకంగా ఉన్న భారత్ ను కాదని.. పాకిస్థాన్ తో ఒప్పందం కుదుర్చుకునేందుకు డీల్ డిఫెన్స్, థైసెన్ క్రప్ మెరైన్ సిస్టమ్స్ సంస్థలు పాక్ తో ఒప్పందం కుదుర్చుకునేందుకు ముందుకువచ్చే అవకాశాలు చాలావరకూ తక్కువని అంటున్నారు.

# "రక్త దానం ఆరోగ్యానికి ప్రయోజనకరం" - జూన్ 14... రక్త దాతల దినోత్సవం




అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టు మిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. ఎ, ఒ, బి, బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజైన జూన్ 14న "ప్రపంచ రక్త దాతల దినోత్సవము"ను ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపు కుంటారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు, సురక్షితమైన రక్తం యొక్క ఆవశ్యకతను తెలియ జేసేందుకు, రక్తదాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచే విధానాలను మెరుగు పరచుకునేందుకు 2005లో ఈ కార్యక్రమం ప్రారంభ మయింది. ఈ సందర్భంగా రక్తం అంటే ఏమిటి.. రక్తదానం ఎలా చేయాలి.. ఎవరు రక్తదానానికి అర్హులు.. రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం..రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడు తుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. అవి - A, B, AB, O అనే వర్గాలుగా విభజించాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్ గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించా లనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండుగడ్డి రంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని "ప్లాస్మా" అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి. అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలా ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని "గ్రహీత" అని, ఇచ్చే వ్యక్తిని "దాత" అని అంటారు. O గ్రూప్ రక్తం కలిగిన వారిని "విశ్వదాత" అని, AB. గ్రూపుల రక్తం కలిగినవారిని "విశ్వ గ్రహీత" అని అంటారు. రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగ పడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చంటే...AB గ్రూప్ వారు AB గ్రూప్ కి, A గ్రూప్ వారు , AB గ్రూపుల వారికి కి, B గ్రూప్ వారు B, AB గ్రూపుల వారికి కి, O గ్రూప్ వారు A,B, AB, O గ్రూప్ల వారందరికి దానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే AB గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. B గ్రూప్ వారు B, O గ్రూపుల వారి నుంచి, A గ్రూప్ వారు A, O గ్రూపుల వారి నుంచి, O గ్రూప్ వారు O గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు.. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 3-4 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35 నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈ మూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైనవారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హాని చేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. రక్తదానం చేయడమంటే ఓ ప్రాణాన్ని కాపాడడమే. ప్రతీ రెండు సెకన్లకు దేశంలో ఎక్కడోచోట ఒకరికి రక్తం అవసరమవుతుంది. ప్రతి రోజూ కనీసం 38,000 మంది రక్తదాతల అవసరం ఉంది. అత్యధికంగా కోరుకునే రక్తం "ఒ" గ్రూప్ దేశంలో ఏటా కొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్ బాధితులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూ వారికి రక్తం అవసరం ఉంటుంది. రక్తదాన ప్రక్రియ పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, సుమారుగా 1 యూనిట్ రక్తాన్ని దానం చేయవచ్చు. దాని వల్ల దాత శరీరానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆరోగ్య వంతుడైన దాత ప్రతీ 56 రోజులకు ఒకసారి ఎర్ర రక్తకణాలను డొనేట్ చేయవచ్చు. ఆరోగ్యవంతుడైన దాత కనీసం 7 రోజుల విరామంతో సంవత్సరానికి 24 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చు.

రక్తం కోసం ప్రతిరోజు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. తలసేమియా లాంటి డేంజర్ వ్యాధిగ్రస్తులకైతే ప్రతి 15 రోజుల కోసారి బ్లడ్ ఎక్కించక పోతే బతకడం కష్టం. కనుక ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, సాటి మనుషులను బతికించుకుందాం. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# శ్రీ చైతన్య మహాప్రభువు... భక్తి ఉద్యమానికి మేలుకొలుపు - జూన్ 14...చైతన్య మహాప్రభువు వర్ధంతి

చైతన్య మహాప్రభువు ( ఫిబ్రవరి 18, 1486 – జూన్ 14, 1534) భారతీయ భక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఒక మహా యోగి, భక్తుడు. ఆయనను శ్రీకృష్ణుని అవతారంగా భావిస్తారు. ముఖ్యంగా హరీనామ సంకీర్తన ద్వారా కృష్ణభక్తిని ప్రచారం చేసి, భక్తి మార్గాన్ని సమస్త జనులకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఆయన జీవితం, బోధనలు, భక్తి మార్గంపై ప్రభావం భారతీయ సంస్కృతికి అపారమైన మార్గదర్శనం కల్పించాయి. శ్రీ చైతన్య మహాప్రభువు 1486లో పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో, మాయాపూర్ గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు విశ్వంభర మిశ్రా. చిన్నతనం నుంచే అపారమైన మేధస్సుతో, సంస్కృత శాస్త్రాలలో ప్రావీణ్యం సాధించి, యువకాలంలోనే గొప్ప తత్వవేత్తగా పేరుగాంచారు. ఆయనను అభిమానంతో నిమాయి పండిట్ అని పిలిచేవారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత, కృష్ణ భక్తి మార్గంలో నిమగ్నమై హరి నామ సంకీర్తన చేయడం ప్రారంభించారు. ప్రజలందరికీ కృష్ణభక్తిని చేరువ చేయడం తన జీవిత ధ్యేయంగా మలుచు కున్నారు. ఆయన భార్య లక్ష్మీదేవిని కోల్పోయిన తరువాత మరింత భక్తి మార్గంలో శ్రద్ధ పెట్టి, ఆధ్యాత్మికతను స్వీకరించారు. 1510లో, కేశవ భారతీ స్వామి వద్ద సన్యాసం స్వీకరించి "శ్రీ కృష్ణ చైతన్య" అనే పేరు పొందారు. అనంతరం జగన్నాథ పురీలో స్థిరపడి, అక్కడ కీర్తన, భక్తి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఆయన అనుచరులతో కలిసి పలు ప్రాంతాలు సందర్శించి, కీర్తనల ద్వారా భక్తి మార్గాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. భగవంతుని నామస్మరణే మోక్షానికి మార్గమని ప్రకటించి, హరే కృష్ణ మహామంత్రాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. కేవలం బ్రాహ్మణులకే భక్తి సాధ్యమనే తప్పుడు



భావనను ఖండించి, అన్ని వర్ణాల వారికీ భక్తి మార్గం తెరిచారు. జీవాత్మ, పరమాత్మ ఒకటే అయినప్పటికీ, ఒక ప్రత్యేక స్వరూపాన్ని కలిగి ఉంటాయని ఉపదేశించారు. భగవంతుడి పట్ల అపారమైన ప్రేమ, విరహ తపన ద్వారా పరమ ఆనందాన్ని పొందవచ్చని చెప్పారు. రాజులు, మునులు, ప్రజలు, దళితులు, విదేశీయులందరికీ కృష్ణ భక్తిని తెలియజేశారు. చైతన్య మహాప్రభువు జాగృతావస్థలోనూ, సమాధి స్థితిలోనూ అత్యున్నత భక్తి స్థాయిని అనుభవించేవారు. జాగృతావస్థలో కృష్ణ వియోగ వేదనలోని సుఖాన్ని, సమాధిలో కృష్ణ సంయోగ సుఖాన్ని అనుభవించేవారని ఆయన అనుచరులు చెబుతారు. ఆయన సిద్ధాంతాలను అనుసరించి ఆయన శిష్యులు అనేక గ్రంథాలు రచించారు. ప్రసిద్ధ రచనలలో రూప గోస్వామి %–% భక్తి రసామృత సింధువు, ఉజ్జ్వల నీలమణి, సనాతన గోస్వామి – వైష్ణవతోషిణి జీవ గోస్వామి %–% సత్సందర్భం, భాగవత టీక, భక్తి సిద్ధాంతం, ఉపదేశామృతం. ఈ గ్రంథాలు గౌడియ వైష్ణవ సంప్రదాయానికి మూలస్తంభాలుగా నిలిచాయి. చైతన్య మహాప్రభువు 1534 జూన్ 14న తన 48వ ఏట జగన్నాథ ఆలయంలో పూజా నిమిత్తం ప్రవేశించి, తిరిగి వెలుపల రాలేదని ఒక కథనం ఉంది. మరికొన్ని కథనాల ప్రకారం, ఆయన భగవత్తత్వంలో మునిగిపోయి నదిలో అంతరించి పోయారని చెబుతారు. చైతన్య మహాప్రభువు భక్తి ఉద్యమానికి ఊపిరిపోసిన మహానుభావుడు. ఆయన జీవితం, బోధనలు కేవలం భారత దేశానికే కాదు, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులకు మార్గదర్శనం చేస్తున్నారు. ఆయన ప్రవేశపెట్టిన హరి నామ సంకీర్తన సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది.

**"హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే ఎ**
**హరే రామ హరే రామ రామ రామ హరే హరే"**

ఈ మహామంత్రం ద్వారా భక్తి మార్గంలో అంతులేని ఆనందాన్ని అనుభవించవచ్చు అని శ్రీ చైతన్య మహాప్రభువు చూపిన మార్గం యుగయుగాల పాటు వెలుగొందుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ప్రతి కదలికకు కీళ్లే కీలకం

మన ప్రతి కదలికకూ కీలే.. కీలకం! జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులు తుంటేనే... మన జీవితం హాయిగా, సుఖంగా సాగుతుంటుంది. అది వేళ్ల, మణికట్టు, భుజం, చివరికి పాదాల, వేళ్ల ఏ జాయింట్లు అయినా కావచ్చు.. మోకాలి కీళ్లు కావచ్చు. ఏ కదలికకైనా ఈ కీళ్లే కీలకం. మరి మన శరీరంలో ఈ కీళ్లు ఉగ్రరూపం దాలిస్తే కాలు, చేయి మెదపాలంటే కష్టం. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంటాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఇది గ్రీకు పదాలైన "ఆర్త్రో" నుండి ఉద్భవించింది, అంటే "ఉమ్మడి", మరియు "ఐటిస్", అంటే "మంట". మానవ ఆర్థరైటిస్ యొక్క మొట్ట మొదటి జాడలు క్రీ.పూ 4500 నాటివి. ప్రారంభ నివేది కలలో, ఆర్థరైటిస్‌ను చరిత్ర పూర్వ ప్రజల అత్యంత సాధారణ వ్యాధిగా సూచిస్తారు. కీళ్ల అరుగుదలనే ఆర్థరైటిస్ అంటాం. కీళ్ల నొప్పులు అధికంగా తుంటి, మోకాలులో వస్తుంటాయి. చేతి, మోచేతిలోనూ కీళ్ల నొప్పులు రావచ్చు. శరీరంలో మోకాలే పెద్ద కీలు. శరీర బరువును సగానికిపైగా మోకాలే మోస్తుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లలో ఉండే కీలకమైన మృదులాస్థి అనే పదార్థం కరిగిపోతుంది. అది నిరంతరం కరుగుతూ మళ్లీ ఏర్పడు తుండటం దాని ప్రత్యేకత. అయితే 40%–%45 ఏళ్ల మధ్య మృదులాస్థి పున రుత్పత్తి తగ్గడం మొదల వుతుంది. దీంతో కీళ్లవాపు, నొప్పి, నడవలేక పోవడం వంటివి వస్తాయి. ఈ విధంగా జరగడాన్నే కీళ్ల నొప్పి లేదా ఆర్థరైటిస్ అంటారు. కీళ్లనొప్పికి జన్యు పరమైన కారణాలూ ఉంటాయి. ప్రధానంగా వయసు, జన్యు పరమైన కారణాలతోనే ఆర్థరైటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎంకైలోడింగ్ ఆర్థరైటిస్ అనే 2 రకాలున్నాయి. సాధారణ ఆర్థరైటిస్‌కు ఈ రెండూ భిన్నం. ఈ రెండింటిలో ఉపశాఖలుగా మరో 15 ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. ఒకసారి తగులుకుంటే వదిలి పెట్టవు. పూర్తిగా నిర్మూలించలేం. స్టెరాయిడ్స్ తదితర మందులు వాడటం వల్ల వీటిని నియంత్రించ వచ్చు. ఇక సోరియాసిస్ కూడా ఆర్థరైటిస్‌కు దారితీస్తుంది. రీటస్ డిసీజ్ అంటే కంటి చూపు మంద గించడం ద్వారా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశ ముంది. ఇలాంటి జబ్బులు వస్తే 20%–%30 ఏళ్లకే ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో 50%–%60 ఏళ్లలో కనిపించే ఆర్థరైటిస్‌ను ఇప్పుడు 35%–%40 ఏళ్లలోనే చూస్తున్నాం. దీన్ని ముందుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోకపోతే ముమ్మందు నడవలేని, కదల్లేని పరిస్థితులు రావొచ్చని వైద్యులు హెచ్చరి స్తున్నారు. కింద కూర్చోవడం వల్ల, సాధారణ మరుగుదొడ్లు వాడినా మోకాలి నొప్పులు వస్తాయి. ఈ కీళ్లకు వచ్చే అతి పెద్ద సమస్య ఆర్త్రైటిస్! అంటే కీలు లోపలంతా వాచి పోయి కదపాలంటేనే తీవ్రమైన నొప్పి, బాధతో జాయింటులో అరిగి పోవడం వల్ల రావచ్చు. దాన్ని "ఆస్టియో ఆర్త్రైటిస్" అంటారు. ఇప్పుడు ఎక్కువ మంది అనుభవిస్తున్న మోకాళ్ల నొప్పుల బాధ ఇదే. ఇక ఒంట్లో ఏద్కెనా ఇన్ఫెక్షన్ తలెత్తి అది కీలుకు చేరటం వల్ల కీళ్లనొప్పి రావచ్చు. దీన్ని "ఇన్ఫెక్టివ్ ఆర్త్రైటిస్' అంటారు. సొరియాసిస్ వంటి చర్మ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపు, నొప్పి పలకరించవచ్చు. దాన్ని "సొరియాటిక్ ఆర్త్రైటిస్" అంటారు. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, నీళ్ల విరేచనాల వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా కీళ్ల వాపు రావచ్చు. దాన్ని "రియాక్టివ్ ఆర్త్రైటిస్" అంటారు. చికున్‌గన్యా వంటి వైరల్ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపులు రావచ్చు, వీటిని "వైరల్ రియాక్టివ్ ఆర్త్రైటిస్" అంటారు. ఇలా కీళ్ల వాపుల్లో ఎన్నో రకాలు న్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంతో వచ్చే కీళ్ల నొప్పులు! వీటికి భిన్నంగా... స్పష్టమైన కారణమేదీ తెలియ కుండానే ఆరంభమయ్యే అతి పెద్ద సమస్య... రుమటాయిడ్ ఆర్త్రైటిస్! కీళ్లవాతం!! వేళ్లు, మణికట్టు వంటి చిన్న జాయింట్లను ఎక్కువగా పట్టి పీడించే ఈ కీళ్లవాతం.. దీర్ఘకాలం ఉండిపోయే సమస్య! దీన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ఇతరత్రా అవయవాలూ ప్రభావితమై పరిస్థితి మరింత విషమిస్తుంది. అదృష్టవశాత్తూ- దీన్ని పూర్తి నియంత్రణలోకి తీసుకు వచ్చే విధానాలు అందుబాటులో ఉన్నాయి. మన శరీరంలో ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ ఉంది. అదే 'రోగ నిరోధక వ్యవస్థ'. మనం వ్యాధుల బారినపడకుండా.. ఎటువంటి సూక్ష్మక్రిములూ మనపై దాడి చెయ్యకుండా నిరంతరం పహారా కాస్తుందీ వ్యవస్థ. రేయింబవళ్లు ఈ బాధ్యతలను ఇది అద్భుతంగా నిర్వర్తిస్తుంటుంది. కానీ.. ఒక్కోసారి ఇది ఏకంగా మన శరీర భాగాల మీదే దాడి చేసేస్తుంది. ఫలితమే రకరకాల 'ఆటో ఇమ్యూన్' సమస్యలు. కీళ్లవాతం.. రుమటాయిడ్ ఆర్త్రైటిస్ కూడా ఇలా తలెత్తే సమస్యే! ఇది మన కీళ్లలో ఎముకల మధ్య ఉండే మృదువ్కెన 'సైనోవియం' పొరను చూసి, దానిపై దాడి చేసి దెబ్బతీయటం ఆరంభిస్తుంది. దీంతో కీలు ఎర్రగా వాచిపోవటం, నొప్పుల వంటి బాధలన్నీ ఆరంభ మవుతాయి. సాధారణంగా ఇతరత్రా కీళ్ల నొప్పుల్కెతే శరీరంలోని ఏదో ఒకవ్కెపు కీలుకు మాత్రమే వస్తాయి. కానీ రుమటాయిడ్ ఆర్త్రైటిస్‌లో- ఒకేసారి రెండు వ్కెపులా వాపు కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు కుడి చేతి వేలి కీళ్లు వాస్తే, ఎడమ చేతి వేలి కీళ్లు కూడా వాస్తుంటాయి. కుడి మణికట్టు కీలు వాస్తే, ఎడమ మణికట్టు కీలూ వాస్తుంది. అలాగే ఈ వాపు ఏకకాలంలో శరీరంలోని చాలా కీళ్లకూ రావచ్చు. కీళ్లవాతం ఏ వయసు వారికైనా రావచ్చుగానీ సాధారణంగా పెద్దవారి లోనే.. అదీ 30-60 ఏళ్ల మధ్య వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా- ఇది మహిళల్లో ఎక్కువ. కీళ్లవాతం సాధారణంగా శరీరంలోని చిన్న కీళ్లతో మొదలవు తుంది. అంటే చేతివేళ్లు, మణికట్టు, కాలివేళ్ల వంటి వాటితో ఆరంభమై క్రమేపీ మోకాలు, తుంటి వంటి పెద్ద జాయింట్లకూ రావచ్చు. వాపు, నొప్పి వంటివన్నీ చిన్న



జాయింట్లతో ఆరంభం కావటం దీని ప్రత్యేక లక్షణం. రుమటాయిడ్ ఆర్త్రైటిస్ బాధితుల్లో చాలా కొద్దిమందికి మాత్రమే కీళ్ల మార్పిడి అవసరం అవుతుంది. కీళ్లవాతం కొంతకాలం పెరుగుతూ తగ్గుతూ ఉండటం దీని మరో ప్రత్యేకత. కీళ్లవాతం వచ్చిన తొలిదశలో కీళ్ల మీది పైపొర మాత్రమే దెబ్బతింటుంది. వ్యాధి ముదురుతున్న కొద్దీ క్రమేపీ అది కీళ్లను, లోపలి ఎముకలను కొరికేస్తుంది. ఇంకా తీవ్రమైతే కీళ్ల మధ్య ఖాళీ తగ్గిపోతుంది. దీంతో ఎముకల రాపిడి కారణంగా నొప్పి వస్తుంది. కొన్నాళ్లకు కీళ్లు మొత్తం దెబ్బతింటాయి. రుమటాయిడ్ ఆర్త్రైటిస్‌ను నియంత్రించు కోకపోతే – గుండె జబ్బులు, పక్షవాతం వంటివి పదేళ్ల ముందుగానే వచ్చే ప్రమాదం ఉంది. కళ్లు పొడిబారటం, లాలాజలం తగ్గిపోవటంతో పాటు గుండె చుట్టూ, వూపిరితిత్తుల చుట్టూ నీరు చేరటం వంటి ఇబ్బందులూ ఎదురవ్వచ్చు. వ్యాధిని సత్వరమే గుర్తించి చికిత్స ఆరంభిస్తే ఈ కీళ్ల మార్పిడి అవసరం అంతగా రాదు. చిన్న కీళ్లకు ఈ మార్పిడి అవకాశమూ ఉండదు. అందుకే మందులతో చికిత్సకే ప్రాధాన్యం ఇస్తారు. కీళ్లవాతం బాధితుల్లో చాలామంది పూర్తి విశ్రాంతిగా పడుకుంటూ వ్యాయామం మానేస్తుంటారు. ఇది సరికాదు. వ్యాయామం చేయకపోతే కీళ్లు గట్టిగా బిగుసుకు పోతాయి. కొన్నిసార్లు ఆపరేషన్ చేసినా ఫలితం ఉండక పోవచ్చు. మందులతో నొప్పి తగ్గాక వ్యాయామం మొదలెట్టాలి. నొప్పి తగ్గుతున్న కొద్దీ వ్యాయామం చేసే సమయాన్ని కూడా పెంచుకోవాలి. ఏరోబిక్, యోగా, నడక వంటి వ్యాయామాలు ఏవ్కెనా చేయొచ్చు. పొగ తాగకూడదు. బరువు పెరగకుండా, శరీరానికి తగ్గట్లుగా ఉండాలి. ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించకపోతే పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరిగిపోతుంది. ఫలితంగా గుండెకు చేటు తెస్తుంది. అలాగే మెటబాలిజం తగ్గుతుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. మన జనాభాలో సుమారు ఒక శాతం మంది దీంతో బాధపడు తున్నారు. కీళ్ల 20 శాతం అరుగుదల ఉంటే, దాన్ని పెరగకుండా చూసుకోవాలి. మృదులాస్థి పెరగడానికి మందులు ఇస్తారు. అవి వాడాలి. సైక్లింగ్, ఈత వంటివి చేయాలి. దీని వల్ల కీళ్లపై ప్రభావం చూపదు. నిర్ణీత మోతాదులో డాక్టర్ల సూచన మేరకు నడవవచ్చు. ఏదైనా సమతుల్య మైన శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. రుమటాయిడ్ ఆర్త్రైటిస్ దీర్ఘకాలిక సమస్య. కాబట్టి చికిత్స కూడా దీర్ఘకాలం, జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

చురకలు



# ఉపాధికి స్వాగతం

సారంగాపూర్: డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులు చదువుకు తగిన ఉద్యోగాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంప్రదాయ కోర్సులు చేసిన వారికి సరైన ఉపాధి అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలో వృత్తిరీత్యా కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో చేరిన విద్యార్థులు రెండేళ్ల పాటు కళాశాలలో చదివి.. మూడో సంవత్సరం కోర్సుకు సంబంధించిన కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ చేయవచ్చు. శిక్షణ, నైపుణ్యం ఆధారంగా అదేచోట ఉద్యోగం కూడా పొందవచ్చు. ఇతర కంపెనీల్లో కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి.

**ఇంటర్ విద్యార్థులు అర్హులు**

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు బీకామ్ 'ఈ-కామర్స్ ఆపరేషన్స్' కోర్సు ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్, షోరూం తదితర ప్రముఖ కంపెనీల్లో సేల్స్ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. బీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) ద్వారా బ్యాంకింగ్ ఆపరేషన్, ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్‌లో ఉద్యోగాలు దొరుకుతాయి. బీఎస్సీ హెచ్‌సీఎం(హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)తో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటర్, హాస్పిటల్ మేనేజర్, హెల్త్ ఇన్సూరెన్సు అనలిస్టు, మెడికల్ ఆఫీస్ మేనేజర్, పబ్లిక్ హెల్త్ ప్రోగ్రాం మేనేజర్, హెల్త్ డాటా అనలిస్టు, క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్, హెల్త్ కేర్




మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అవకాశాలు లభిస్తాయి. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య బీమా, మెడికల్ టూరిజం కంపెనీలు, క్లినికల్ పరిశోధనా సంస్థలు, వైద్యారోగ్య శాఖ, హెల్త్ టెక్ స్టార్టప్స్‌లో స్థిరపడవచ్చు. బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూతో పాటు వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంపీహెచ్(మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్), ఎమ్మెస్సీ(హెల్త్ అడ్మినిస్ట్రేషన్), పీజీ డిప్లొమా – క్లినికల్ రీసెర్చ్, హెల్త్ ఎకనామిక్స్, హెల్త్ ఇన్‌ఫార్మటిక్స్ వంటి ఉన్నత విద్యా కోర్సులు కూడా చేయవచ్చు.

**స్టైఫండ్ అందజేత**

బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్(బోట్) వారు మూడో ఏడాది కంపెనీలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థికి, ఆయా కంపెనీలకు రూ.4వేలు చొప్పున చెల్లిస్తారు. పట్టా చేతికందాక రెండు పదుల వేతనంతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

**కోర్సులు అందుబాటులో ఉన్న కళాశాలలు**

గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (మూడు కోర్సులు)
కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల(బీకాం రిటైయిల్ ఆపరేషన్స్)
గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)
మంథని డిగ్రీ కళాశాలబీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్)

**శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు**

నూతన కోర్సులు అభ్యసిస్తే అప్రెంటిస్‌షిప్ ఆధారిత ఉద్యోగాలు పొందవచ్చు. విద్యార్థులు ఒకసారి ఈ కోర్సు ఎంచుకున్న తర్వాత.. రెండేళ్లు కళాశాలలో చదివి.. హైదరాబాద్‌లో మూడో సంవత్సరం అప్రెంటిస్‌షిప్ శిక్షణ పొందాలి. ప్రతినెల బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ నిర్వాహకులు రూ.4వేలు అందజేస్తారు.

జైకిషన్ ఓజా, ప్రిన్సిపల్, ఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల

# ఆర్డర్లు దండిగా.. కార్మికులు అరకొరగా

సిరిసిల్ల: జిల్లా వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్ల కేటాయింపులు జరిగాయి. రెండు విడతలుగా 4.24 కోట్ల మీటర్ల మహిళా సంఘాల చీరలు 130 మ్యాక్స్ సంఘాలకు ఆర్డర్లు ఇచ్చారు. గతనెల చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులు మీటరుకు రూ.34 చొప్పున ఉత్పత్తి ధర నిర్ణయమైంది. దీనితర్వాత ప్రింటింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ కూడా ఉంటుంది. పరిశ్రమలో ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లు ఉత్పత్తికి సరిపడా కార్మికులు లేరు. అధిగమిస్తేనే ఉత్పత్తిలో వేగం పుంజుకుటుంది. **లక్ష్యం ఇలా..** రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఆగస్టు 15న లాంఛనంగా చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలివిడత ఒక్కో చీరను అందించాలని ప్రణాళికలు చేస్తోంది. జిల్లాలో డాబీ, జకార్డు పరికరాలు అమర్చిన 17 వేల మరమగ్గాలపై రోజుకు లక్ష మీటర్ల చీర వస్త్రం ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ప్రస్తుతం నాలుగువేల మగ్గాలపై రోజుకు గరిష్ఠంగా 30 వేల మీటర్లకు మించి ఉత్పత్తి కావడం లేదు. గతంలో మాదిరిగా ఒత్తిడి లేకపోవడం.. సొంత ఉత్పత్తులు చేస్తూనే చీరలపై దృష్టి పెట్టడంలో ఆలస్యమవుతోంది. మొన్నటి వరకు నూలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాల వెలుతురులో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఏడు కంపెనీల నూలు**

చీరల ఉత్పత్తిలో ఉపయోగించే నూలును నేషనల్ హ్యాండ్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ధ్రువీకరించిన ఏడు కంపెనీల ద్వారా సరఫరాకు టెస్కో ఒప్పందం చేసుకుంది. 130 మ్యాక్స్ సంఘాల్లో 83 సంఘాలు సొంతంగా నూలు కొనుగోలు చేయాల్సి ఉండగా పెట్టుబడిలేక ఆర్థికంగా వెనకబడిన 47 మ్యాక్స్ సంఘాలకు చేయూతనిచ్చేందుకు నూలు బ్యాంకులో నూలు అందుబాటులో ఉంచారు. వీటిలో వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి టెస్కోకు డీడీలు చెల్లించిన వారికి విడతల వారీగా నూలు సరఫరా చేస్తున్నారు.

**పక్క జిల్లాలవారు వస్తేనే..**

జిల్లా వస్త్ర పరిశ్రమలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు రెండేళ్లుగా అరకొర ఉత్పత్తులతో నెట్టుకొస్తున్న కార్మికులకు ప్రస్తుతం పరిశ్రమలో సొంత ఉత్పత్తులకు ప్రభుత్వ ఆర్డర్లు తోడవడంతో ఉపాధికి కొదువలేదు. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి సమయంలో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు.. జిల్లాల నుంచి నేతన్నలు ఇక్కడికి వచ్చేవారు. ప్రభుత్వం ఏకరూప దుస్తులు, మహిళా సంఘాల చీరలు, ఇతర ఆర్డర్లతో ఏడాదిలో గరిష్ఠంగా ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు ఇక్కడ పని లభిస్తుంది. ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్ రాష్ట్రాల నుంచి వెయ్యి మంది కార్మికులు సిరిసిల్లకు వచ్చారు. వీరిలో చాలా వరకు పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి చీరలు నేసేందుకు రెండువేల మందికిపైన వస్తేనే వస్త్రోత్పత్తుల్లో వేగం పెరుగుతుంది. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని.. ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకుంటామని జిల్లా చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకులు రాఘవరావు పేర్కొన్నారు.

# భవిత చిన్నారులకు భత్యం



వికారాబాద్ : ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాలు నెలకొల్పింది. జిల్లాలోని 19 మండలాల్లో 21 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వాటిలో 306 మంది ఉన్నారు. కొన్నేళ్లుగా భత్యం డబ్బులు మంజూరు కాలేదు. దీంతో పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఇటీవల ప్రభుత్వం వివిధ రకాల భత్యాలు మంజూరు చేయడంతో చిన్నారులకు కొంత ఊరట కలిగింది. నెలకోసారి అలవెన్స్ విడుదల కావాల్సి ఉన్నా గత విద్యా సంవత్సరానికి సంబంధించి 2024, జూన్ నుంచి 2025, మార్చి వరకు 8 నెలల భత్యం విడుదల చేశారు. దీంతో భవిత కేంద్రాలకు వెళ్లేందుకు రవాణా ఛార్జీలు, పోషణకు అవస్థలు పడుతున్న మానసిక, దివ్యాంగ పిల్లలకు ఊరట లభించనుంది. గతంలో ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లింపుల కారణంగా ఆలస్యంగా వచ్చేవి. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో నేరుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

**జిల్లాకు రూ.10.43 లక్షలు..**

విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపి భవిత కేంద్రాలతోపాటు ప్రభుత్వ బడుల్లో వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించారు. వారికి చెల్లించాల్సిన రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ భత్యాలు మొత్తం నాలుగు దశల్లో ప్రభుత్వం మంజూరు చేసింది. సమగ్ర శిక్ష కింద జిల్లాకు రూ.10,43,460, పీఎంశ్రీ కింద రూ.1,05,400 విడుదల చేశారు. బ్యాంకు ఖాతాలు సక్రమంగా ఇవ్వకపోవడం, సాంకేతిక సమస్యలతో కొందరు పిల్లలకు భత్యం విడుదల కాలేదు.

భవిత కేంద్రాలు: 21
ప్రత్యేక కేంద్రాలు: 04
విద్యార్థుల సంఖ్య: 306

కేంద్రాల్లో 21 రకాల సేవలు..

కేంద్రాల్లో సాధారణ పిల్లలకు సమానంగా ప్రత్యేకావసరాలున్న వారికి తర్ఫీదునిస్తున్నారు. ప్రతి భవిత కేంద్రంలో 21 రకాల రోగాలున్న పిల్లలను గుర్తించి సేవలను అందిస్తున్నారు. కేంద్రానికి వచ్చే వారే కాకుండా ఇంటి వద్ద శిక్షణ పొందే పిల్లలున్నారు. విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి మాట్లాడుతూ.. విద్యార్థుల భత్యం డబ్బులు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

**కేటగిరీల వారీగా విడుదలైన భత్యం**

రవాణా: రూ.500
ఎస్కార్ట్: రూ.500
రీడింగ్(కనిపించని వారికి): రూ.60
స్టైఫండ్: రూ.200

# 'సుడా' పనుల తీరు వేరయా!



కరీంనగర్ : పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల జోరు కనిపిస్తోంది. రహదారులు, మురుగుకాలువలు, కల్వర్టులు, సామాజిక భవన నిర్మాణాలు, హైమాస్ట్ వీధిదీపాలు, ఓపెన్ జిమ్‌లు వంటి వాటికి నిధులు కేటాయించి టెండర్లు పిలుస్తున్నారు. బల్దియాలో సాధారణ నిధులతో పిలిచిన టెండర్లకు మొగ్గు చూపకపోగా, పలుమార్లు రీకాల్ చేసే పరిస్థితి ఏర్పడుతోంది. సుడాలో అయితే పూర్తయిన వెంటనే బిల్లులు మంజూరు అవుతుండటంతో గుత్తేదారుల నుంచి తీవ్ర పోటీ ఉంటోంది. టెండర్లలో పాల్గొంటున్న గుత్తేదారులు అంచనాల కంటే అతి తక్కువకు కోట్ చేస్తుండటంతో నాణ్యత ఎలా సాధ్యమనే ప్రశ్న వస్తోంది.

**నాణ్యత కాగితాలకే పరిమితమా?**

బల్దియా పరిధిలో అభివృద్ధి పనులకు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈఈలు దగ్గరుండి పరిశీలించినా కొందరు గుత్తేదారులు తిమ్మిని బమ్మి చేస్తున్నారు. ఇసుక, కంకర, సిమెంట్, సలాక, పైపులు, ఇతర విడిభాగాల కొనుగోలు నాణ్యతను పరిశీలించిన తర్వాతే చేపడుతుండగా సుడా పరిధిలో పనులకు మాత్రం ఏఈ, డీఈఈ, ఈఈ ఒక్కొక్కరు మాత్రమే పర్యవేక్షణ చేస్తున్నారు. ఇందులో ఏఈ, డీఈఈ పంచాయతీరాజ్ విభాగం నుంచి రాగా వీరు ఇతర మండలాల్లో పనులు చూడాల్సి ఉంటుంది. ఈఈ అయితే నగరపాలికకు చెందిన వారు కాగా బల్దియాలోనే తీరిక లేకుండా ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో పనుల తీరును పట్టించుకునే వారుండరు. గుత్తేదారు ఏవిధంగా చేసినా నాణ్యత ఫర్వాలేదంటూ కాగితాల్లో మాత్రం రికార్డు చేసే పరిస్థితి ఉంటుంది.

**గిట్టుబాటు లేకుండా పనులు**

సుడా పరిధిలో మొత్తం 21 అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించాల్సి ఉండగా 19 పనులు రూ.1.88 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. ఇందులో సుమారు 10 పనులకు 30.02 శాతం నుంచి 37.65 శాతం అతి తక్కువకు టెండర్లు దక్కించుకున్నారు. మిగతా వాటిల్లో 6.13 శాతం నుంచి 27.21 తక్కువ ధరకు వేసిన వారున్నారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుకూలంగా అంచనాల కంటే అటు ఇటుగా టెండర్లు వేసుకోవాల్సిన గుత్తేదారులు తక్కువ మొత్తానికి పాల్గొనడం చూస్తే గిట్టుబాటు ఎలా అవుతుందోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లెస్ టెండర్లపై ప్రత్యేక నిఘా ఉంచితే నాణ్యత లేమి ఉంటే బయట పడుతుంది.


# ఏటా ముంపు.. ఏదీ కనువిప్పు

జగిత్యాల : చిన్నపాటి వర్షానికే మునకేసే రహదారులు, జనావాస ప్రాంతాలపై పురపాలిక దశాబ్దకాలంగా శాశ్వత చర్యలు చేపట్టలేకపోతోంది. ఏటా పెరుగుతున్న గృహాలు, విస్తరిస్తున్న నూతన కాలనీలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందడం, భూముల ధరలకు రెక్కలు రావడంతో శివారులో చౌకగా లభించే స్థలాల్లో నూతన నిర్మాణాలు అధికంగా పెరిగాయి. కానీ ఇందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించకపోవడంతో ప్రతీసారి వర్షాల మూలంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆయా కాలనీలకు వరద భయం**

పట్టణంలోని దిగువ ప్రాంతాలైన మోతె, సరస్వతీనగర్, సార్గమ్మ వీధి, సలీమాగార్డెన్‌తోపాటు శివారులోని బుడగ జంగాల కాలనీ, గోవిందుపల్లి తదితర కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. పై నుంచి వచ్చే ప్రధాన మురుగుకాల్వ నీటితో సరస్వతీనగర్‌లో జనావాసాల్లోకి నీరు చేరడంతో పాటు వ్యర్థాలు ఇళ్ల మధ్య నిలిచి అపరిశుభ్రత నెలకొంటుంది. వీటిని తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు నానాతంటాలు పడాల్సి వస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా పెద్ద నాలాల్లో వ్యర్థాలు తొలగించినా వరద ప్రవాహం పెరిగి రోడ్లను ముంచెత్తుతోంది.

**కార్యాచరణ ఇలా..** పురపాలికల్లో వరదముప్పు సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం పుర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదేశాలిచ్చారు. ఇందుకు అనుగుణంగా బల్దియా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నారు. లోతట్టు ప్రాంతాలను అధికారులు సందర్శించి అక్కడి పునరావాస



కేంద్రాల యజమానులతో సమావేశమవుతారు. మేరకు వరద ముప్పు చర్యలపై నిర్ణయం తీసుకుంటారు. ప్రధానంగా సలీమాగార్డెన్, తులసీనగర్, మోతె, బుడగ జంగాల కాలనీపై అధికారులు ప్రత్యేక దృష్టి నిలపనున్నారు. వార్డు అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముంపుపై చర్యలు తీసుకోనున్నారు. అయితే శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**అప్రమత్తంగా ఉన్నాం**

వరదలపై ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉన్నాం. ఎక్కడైతే వరద తీవ్రత అధికంగా ఉందో ఆయా ప్రాంతాలను గుర్తించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు యంత్రాలు, పారిశుద్ధ్య సిబ్బంది, సాంకేతిక సిబ్బంది సహకారం తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తపడుతున్నాం. త్వరలో వరదలపై ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు కేటాయించనున్నాం. స్పందన, కమిషనర్ జగిత్యాల

# ఉపాధి తోడుగా.. కష్టాలు తీరగా

సారంగాపూర్: జిల్లాలో ఉపాధిహామీ ద్వారా పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెలపాకలు, వర్మీ కంపోస్టు, నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పొలం బాటలు తదితర అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో పశువుల పాకలు 769, కోళ్ల షెడ్లు 386 ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించారు. వర్మీ కంపోస్టు నిర్మాణాలు 193, అజోలా ఎరువు తయారీ గుంతలు 193, ఫారంపాండ్‌లు 386 లక్ష్యాన్ని నిర్దేశించగా పనులు కొనసాగుతున్నాయి. పాకల నిర్మాణాలపై అవగాహన

జిల్లాలో వివిధ రకాల పశువులు, గొర్రెలు, కోళ్ల పాకల నిర్మాణాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పశువుల పాకకు రూ.85,000 చెల్లిస్తుండగా 18ఐ16 ఫీట్ల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. గొర్రెల పాకకు రూ.లక్ష చెల్లిస్తుండగా 21ఐ16తో, కోళ్ల షెడ్డుకు రూ.3 లక్షలుకాగా 50ఐ16 పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పశువుల పాకలు 769 లక్ష్యంకాగా 726 మంజూరు చేయగా 43 నిర్మాణాలు సాగుతున్నాయి. కోళ్ల షెడ్ల నిర్మాణాల కోసం 386 లక్ష్యాన్ని నిర్దేశించగా 363 మంజూరు చేయగా 19 నిర్మాణాలు, గొర్రెల షెడ్లు 91 మంజూరుకాగా 68 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 193 మంది రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గుంతలు నిర్మించాలని భావించగా 167 నిర్మాణాలు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.12,500, అజోలా తయారు చేసే గుంత నిర్మాణానికి రూ.6 వేలు చెల్లించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆయా నిర్మాణాలు చేపట్టేలా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**భూగర్భ జలాల పెంపుపై దృష్టి**

భూగర్భ జలాల పెంపునకు ఉపాధిహామీ పనుల ద్వారా పలు



నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.4.50 లక్షలతో పర్కలేషన్ ట్యాంకు నిర్మాణాలను పూర్తిగా కూలీల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 96 నిర్మాణాలు లక్ష్యంకాగా 88 నిర్మాణాలు మంజూరు చేయగా పనులు కొనసాగిస్తున్నారు. 1,922 ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యంకాగా 410 ప్రగతిలో ఉన్నాయి. రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు చేపడుతుండగా ప్రతీ మండలానికి 10 కిలోమీటర్ల చొప్పున నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రస్తుతం 764 కి.మీ. మేర రహదారులు పూర్తి చేశారు.

**కూలీలకు ఉపాధి..**

ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన కోళ్లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులు కొనసాగిస్తుండగా దీని ద్వారా కూలీలకు ఉపాధి లభిస్తుంది. రైతుల పంట పొలాలకు రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు. శివప్రసాద్, సాంకేతిక సహాయకుడు

# ఆహారశుద్ధి.. అతివల ఆర్థిక వృద్ధి

సంగారెడ్డి టౌన్: పొదుపులు.. బ్యాంకు రుణాలు.. వాయిదాల చెల్లింపులు.. మహిళా సంఘాలు అంటే గుర్తుకు వచ్చేవి ఇవే. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నా ఆశించిన స్థాయిలో స్థితిగతుల మారడం లేదు. బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండటంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. ఇందుకోసం రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నారు.

**లక్ష్యం 100 యూనిట్లు**

జిల్లాలో మిరప, పసుపు, పప్పు మిల్లులు, పాలపదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్‌మిల్లులు, పాపడాలు, పచ్చళ్లు తదితర యూనిట్లతో మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు మార్గం సుగమం అవుతోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 100 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన యూనిట్లకు 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నారు.

**నాణ్యమైన ఉత్పత్తుల కోసం..**

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధిత రంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యూనిట్ల విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థికపరంగా సాయం అందించనున్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు మహిళా సంఘాల ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి.

**సద్వినియోగంతో సత్ఫలితాలు**

జంగారెడ్డి, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

ఆహారశుద్ధి యూనిట్లతో మహిళా సంఘాల సభ్యులకు ప్రయోజనం ఉంటుంది. యూనిట్ల విస్తరణతో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుంటుంది. వినియోగదారులకు కల్తీలేని ఆహార ఉత్పత్తులు అందించినట్లు అవుతుంది. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేయించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.


జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695
మహిళా సంఘాలు: 18,213
ఆయా సంఘాల్లో సభ్యులు: 1.90లక్షల మంది

# ఉద్యానానికి ఊతం.. రైతన్నకు లాభం

పరిగి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నాయి. రాయితీ ప్రకటించడంతోపాటు నిర్దేశిత లక్ష్యాలను విధించింది. గతం కంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయాలని అధికారులు వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్‌పాం, సుగంధ ద్రవ్యాల సాగు, తోటల పునరుద్ధరణ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా పథకాల కింద సుమారు రూ.35 కోట్ల మేరకు నిధులు ఖర్చు చేయనున్నారు. అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు కసరత్తు చేస్తున్నారు.

**పెరగనున్న సాగు విస్తీర్ణం..**

జిల్లాలో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల సాగుకు నేలలు అనుకూలంగా ఉన్నాయి. మరోవైపు రాయితీ అందించడంతో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది. తోటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పదిహేనేళ్లకు పైబడిన తోటల పునరుద్ధరణకు 71 హెక్టార్లను తీసుకొని ప్రోత్సహించనున్నారు. దీనికిగాను ప్రభుత్వం రూ.17 లక్షలు వెచ్చించనుంది. జిల్లాకు 12 నీటి నిల్వ గుంతల యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.75వేల చొప్పున రాయితీ అందనుంది. 570 హెక్టార్లలో మల్చింగ్ యూనిట్లు, ఉల్లి



నిల్వకు 20 యూనిట్లు మంజూరు కావడంతో రూ.25 లక్షలు వెచ్చించనున్నారు.

**యాంత్రీకరణ పథకం కింద..**

ఈ పథకం కింద మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, తైవాన్ పంపులు వంటివి 136 యూనిట్లు వచ్చాయి. ఆర్‌కేవీవై పథకం కింద తీగజాతి పందిళ్లకు 100 యూనిట్లు రాగా.. ఇది అరెకరం వరకు మాత్రమే పరిమితం చేశారు. బిందు సేద్యంలో భాగంగా 1,225 హెక్టార్లు, తుంపర కింద 485 యూనిట్లు మంజూరయ్యాయి.

**ఇది సువర్ణావకాశం..**

ఇటు పండ్లు, అటు కూరగాయల సాగుకు ఇది సువర్ణావకాశం. నీటి సదుపాయం తక్కువున్న రైతులు వీటి సాగుపై దృష్టి సారించారు. సాగుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తాం. ఆయిల్‌పాం సాగుకు రాయితీ ఎక్కువగా ఉంది. ప్రభుత్వం ప్రత్యేకించి ప్రోత్సహిస్తోంది.ఎంఏ సత్తార్, జిల్లా ఉద్యానాధికారి

# ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నాలు

రాయదుర్గం : ఖాజాగూడలో ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నాలు చేస్తున్నారు. సర్కారు జాగా అనే సూచిక ఉన్నా.. బోర్డును వదిలేసి దాని చుట్టూ చదును చేసే పనులు చేపడుతున్నారు. ఖాజాగూడ సర్వే నం.40లో ఈ పనులు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్కడ ఆక్రమణదారులు కబ్జాలకు యత్నాలు చేస్తుండడంతో గతంలోనే శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని పేర్కొనే సూచికను ఏర్పాటు చేశారు. ఆ సూచిక తొలగిపోవడంతో తిరిగి అదే పనిచేస్తున్నారు. దీంతో అధికారులు కొత్తగా సూచిక ఏర్పాటు చేసినా దాని పక్క నుంచే రాళ్లతొలగింపు, చదును పనులు ఆరంభించారు. పగలు ఆ పనులు చేపడితే యంత్రాంగం అడ్డుకునే అవకాశం ఉండడంతో



రాత్రికిరాత్రి జేసీబీలతో రాళ్లను తొలగించడం, మట్టితో చదును చేసే పనులు చేపడుతున్నారు. దాదాపు 600 గజాల స్థలాన్ని కబళించే యత్నాలు చేస్తున్నారు. ఈ స్థలంపై రెవెర్యూ అధికారులు ఆది నుంచీ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆక్రమణ దారులు నకిలీ పత్రాలు సృష్టించడం వందల గజాల స్థలాన్ని కాజేయడానికి తెరతీశారు. ఇప్పటికే జాగా అన్యాక్రాంతమై ఆ సర్కారు జాగాలో బహుళ అంతస్తుల భవనాలు పుట్టుకొచ్చాయి. మిగిలి ఉన్న స్థల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో త్వరలోనే అది కూడా మాయమయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని, త్వరలోనే కంచె నిర్మిస్తామని శేరిలింగంపల్లి ఆర్ఐ చంద్రారెడ్డి అన్నారు.

# మహా నగరానికి 'వన'హారతి

హైదరాబాద్: మహానగరంలో వనమహోత్సవానికి కార్యాచరణ సిద్ధమైంది. మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలోని 42 నర్సరీల్లో భారీఎత్తున మొక్కలు సిద్ధం చేశారు. అందులో పండ్లు, ఇతర అన్ని రకాల మొక్కలు ఉన్నాయి. త్వరలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఇవి నాటనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, సాధారణ పౌరులకు ఇవి పంపిణీ చేయనున్నారు. ఒకప్పుడు చెరువులు, ఉద్యనవనాలకు చిరునామాగా ఉన్న భాగ్యనగరం చివరికి కాలుష్య కాసారంగా మారుతోంది. దాదాపు కోటికి చేరువవుతోన్న వాహనాలతో వాయు కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో పచ్చదనం పెంపు చాలా కీలకంగా మారనుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం వనమహోత్సవం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. హెచ్ఎండీఏకు శివార్లలో నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ మొక్కలను పెంచి వాటిని నగరంలోని అన్ని ప్రాంతాలకు పంపిణీ చేయనున్నారు. ఇందుకు హెచ్ఎండీఏ రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తోంది. ఈ ఏడాది 4.94 కోట్ల మొక్కలు అర్బన్ ఫారెస్ట్రీ అధికారులు సిద్ధం చేశారు. పార్కులు, చెరువులు, జాతీయ, రాష్ట్ర రహదారులు, సెంట్రల్ మీడియన్లు, అర్బన్ ఫారెస్ట్‌ల బ్లాకుల్లో సుమారు 4.5 కోట్ల మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కోసం చెట్లను తొలగించారు. కొన్నింటిని ట్రాన్స్‌లోకేట్ చేస్తున్నారు. తర్వాత ఈ ప్రాజెక్టుల వెంబడి మొక్కలు నాటాలని నిర్ణయించారు. వనమహోత్సంలో భాగంగా సాధారణ పౌరులకు పెద్ద ఎత్తున పంపిణీ చేసేందుకు కార్యాచరణ షురూ అయింది.

# సైబర్ నేరగాళ్ల రీఫండ్ మాయ.. ఆ లింక్ క్లిక్ చేశారో అంతే!



హైదరాబాద్: ఆకలేసిందంటే చాలు.. ఫుడ్ డెలివరీ యాప్‌ల్లో ఆర్డర్ పెట్టేవారు ప్రస్తుతం వేలల్లో ఉన్నారు. అలాంటివారే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. యాప్‌లలో ఆహారం ఆర్డర్ పెట్టిన తర్వాత రద్దయిందని నకిలీ సందేశాలు పంపిస్తున్న నేరగాళ్లు.. డబ్బు తిరిగి పొందాలంటే(రీఫండ్) బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలంటూ లింకులు పంపిస్తున్నారు. నిజమేనని భావిస్తున్న వినియోగదారులు వాటిపై క్లిక్ చేసి డబ్బు పోగొట్టుకుంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాట్సప్, ఎస్ఎంఎస్ ద్వారా డెలివరీ యాప్‌లకు సంబంధించిన లింకులు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిస్తోంది.

**లింకు క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ**

ఆర్డర్ పెట్టి రద్దు చేసుకున్న తర్వాత రీఫండ్ పేరుతో సైబర్ ముఠాలు డబ్బు కొట్టేస్తున్నాయి. రీఫండ్ కోసం క్లిక్ చేశాక.. నిమిషాల వ్యవధిలోనే సైబర్ నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తున్నాయి. తాము ఫుడ్ డెలివరీ యాప్ నుంచి మాట్లాడుతున్నామని.. రీఫండ్ కోసం పంపించే లింకు క్లిక్ చేసి బ్యాంకు వివరాలు నమోదు చేయాలని సూచిస్తారు. నిజమేనని భావించి క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయి. కొన్నిసార్లు తాము పంపించే లింకు క్లిక్ చేశాక రూ.1 పంపిస్తే రీఫండ్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెబుతున్నారు. పొరపాటున లింకు క్లిక్ చేస్తే ఫోన్ ఆధీనంలోకి తీసుకుంటున్న నేరగాళ్లు డబ్బు కొట్టేస్తున్నారు. ఓ ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్‌లో నగరవాసి ఆహారం ఆర్డర్ పెట్టిన తర్వాత డెలివరీ చేయకుండా నకిలీ లింకులతో రూ.1.90 లక్షలు పోగొట్టుకున్న వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే.

**డేటా నేరగాళ్ల చేతుల్లో..**

ఈ-కామర్స్ సంస్థలు, ఫుడ్ డెలివరీ యాప్ వినియోగదారుల డేటా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి ఎప్పటికప్పుడు చేరుతోంది. వ్యాపారాలు నిర్వహిస్తున్న మెజార్టీ సంస్థలు డేటా నిర్వహణ బాధ్యతను తృతీయ పక్ష ఏజెన్సీలకు అప్పగిస్తున్నాయి. సేవలు అందించేది ఈ సంస్థలే అయినా.. వినియోగదారుల వివరాలు, సాంకేతిక అవసరాల కోసం ఇతర సంస్థల మీద ఆధారపడతాయి.

**ఇవీ జాగ్రత్తలు..** ఈ-కామర్స్, ఫుడ్స్ డెలివరీ సేవలకు కచ్చితంగా అధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లనే వినియోగించాలి.ఆర్డర్ రద్దు, రీఫండ్ విషయంలో సమస్యలుంటే యాప్‌లోనే ఫిర్యాదు చేయాలి.కొందరు ఫిర్యాదు చేసేందుకు నేరుగా గూగుల్ సంస్థ పేరు టైప్ చేసి కస్టమర్ కేర్‌నంబరు కోసం వెతుకుతారు. ఇలా చేస్తే కచ్చితంగా మోసపోయినట్లే. వాట్సప్‌నకు రాయితీ, బంపర్‌డ్రా పేరుతో వచ్చే ప్రకటనల్ని నమ్మి క్లిక్ చేయొద్దు.ఒకవేళ మోసపోతే 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలి.

# వ్యర్థాలతో 14 మెగావాట్ల వెలుగులు



హైదరాబాద్: రాజధానిలో ఉత్పత్తి అవుతున్న చెత్తకు పరిష్కారం చూపడంలో జీహెచ్ఎంసీ మరో మైలురాయి చేరుకుంది. ప్రస్తుతం పనిచేస్తున్న రెండు డబ్ల్యూటీఈ(వేస్ట్ టు ఎనర్జీ)లకు అదనంగా.. మరో 14 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు జీహెచ్ఎంసీ పచ్చజెండా ఊపింది. దశాబ్దంగా పెండింగులో ఉన్న యాచారం ప్లాంటు దరఖాస్తును ఆమోదించింది. దీంతో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గనుంది. చెత్తను గుట్టలుగా పోసే దుస్థితి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇబ్రహీంపట్నం మండలం యాచారంలో రాబోతున్న ప్లాంటు జపాన్ సాంకేతికతతో పనిచేస్తుందని, కాలుష్య ఉద్గారాలకు తావులేకుండా డబ్ల్యూటీఈ అందుబాటులోకి వస్తుందని జీహెచ్ఎంసీ తెలిపింది.

**100 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి లక్ష్యం**

నగరంలో ప్రస్తుతం రోజుకు 8 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దాన్నుంచి 100 మెగావాట్లకుపైగా విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది జీహెచ్ఎంసీ లక్ష్యం. లక్ష్యానికి తగ్గట్లుగా జీహెచ్ఎంసీ ఇప్పటికే రెండు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో 24 మెగావాట్ల కేంద్రం.. దుండిగల్‌లో 14.5 మెగావాట్ల డబ్లూటీఈ పని చేస్తున్నాయి. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులోనే మరో 24 మెగావాట్ల కేంద్రం నిర్మాణంలో ఉంది. ప్యారానగర్‌లో ఏర్పాటు చేయదలచిన 15 మెగావాట్ల కేంద్రం నిర్మాణ పనులు కోర్టు కేసుతో నిలిచిపోయాయి. ఇవన్నీ రాంకీ సంస్థకు చెందినవే. వాటన్నింటిలో చేపడుతున్న విద్యుత్తు ఉత్పత్తికి ప్రస్తుతం 2,500 టన్నుల మండే స్వభావమున్న చెత్త మాత్రమే ఉపయోగపడుతోంది. మిగిలిన వ్యర్థాల్లోని కొంత తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చుతున్నారు. పనికిరాని వ్యర్థాలను డంపింగ్‌యార్డులోనే గుట్టలుగా పోస్తున్నారు. దీంతో జవహర్‌నగర్ కేంద్రం కిక్కిరిసిపోయింది. బీబీనగర్‌లో దశాబ్దం క్రితం ఏర్పాటైన 11 మెగావాట్ల డబ్ల్యూటీఈ పలు కారణాలతో పనిచేయట్లేదు. తాజాగా వెంకటేశ్వర ప్లాంటుకు అనుమతి లభించడం గమనార్హం.

**సమీక్షించి ఎన్వోసీ ఇప్పించారు**

వెంకటేశ్వర పవర్ ప్లాంట్ సంస్థ రూపొందించిన ప్రాజెక్టుపై పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సమీక్షించి.. రాంకీ సంస్థ నుంచి ప్లాంటు ఏర్పాటుకు తాజాగా ఎన్వోసీ ఇప్పించారు. నిత్యం 700 టన్నుల చెత్తను యాచారం ప్లాంటుకు తరలించేందుకు రాంకీని ఒప్పించారు.ఏడాదిన్నరలో కేంద్రం అందుబాటులోకి వస్తుందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. వెంకటేశ్వర సంస్థ బల్దియాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. ఆ సంస్థనే బల్దియాకు రాయల్టీ రూపంలో నిధులు చెల్లిస్తుంది. తద్వారా.. బల్దియాకు ఏటా రూ.25 కోట్లు ఆదా కానున్నట్లు అధికారులు తెలిపారు.

# సమీకృత గురుకులాలు.. వేగంగా అడుగులు!




హైదరాబాద్: విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, నైపుణ్యాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా సమీకృత పాఠశాలలు ఏర్పాటయ్యే ప్రాంతాల ఎంపికపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఒక్కో పాఠశాలను రూ.200కోట్ల వ్యయంతో నిర్మించనుండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెవెన్యూ అధికారులు స్థలాల ఎంపికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 29 నియోజకవర్గాల్లో అనువైన ప్రాంతాలను రెండు, మూడు నెలల్లో ఎంపిక చేసి శంకుస్థాపన పనులు చేపట్టనున్నారు. మహేశ్వరం, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. హైదరాబాద్‌లో అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు.

**రవాణా సౌకర్యాలు.. మౌలిక సదుపాయాలు..**

ఈ పాఠశాలకు 5-25 ఎకరాల స్థలం అవసరం కావడంతో మూడు జిల్లాల్లోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.సమీకృత గురుకులాలు సబర్బన్, గ్రామీణ ప్రాంతాలకు మరీ దూరంగా ఉండకుండా రవాణా సౌకర్యాలు ఉండేలా మౌలిక సదుపాయాలను సమకూర్చనున్నారు. భూముల లభ్యత ఆధారంగా మూడు నెలల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కాప్రా మండలాల్లో ప్రభుత్వ భూముల వివరాలను సేకరించారు. మేడ్చల్ జిల్లాలో నాలుగు, రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూములను జాగ్రత్తగా ఎంపిక చేస్తున్నారు.

**వివరాలు సేకరించి మంత్రికి నివేదించి**

హైదరాబాద్‌లో సమీకృత గురుకులాలు నిర్మించాలంటే సరిపడా ప్రభుత్వ భూములు లేవు. పదిహేను నియోజకవర్గాల్లో రెండు, మూడు నియోజకవర్గాల్లో మినహా ఎక్కడా ప్రభుత్వ స్థలాలు లేవు. ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలమంటే నగరంలో ఎకరం కనీసం రూ.50 కోట్లు అనుకున్నా.. పాఠశాల స్థలానికే రూ.250 కోట్లవుతుంది. దీంతో రెవెన్యూ అధికారులు గతంలో వేర్వేరు శాఖలకు ఇచ్చిన భూముల్లో ఖాళీగా ఉన్న వాటి వివరాలను సేకరిస్తున్నారు. హెచ్ఎండీఏ, రవాణా, పోలీస్, వైద్యారోగ్య శాఖలకు ఇచ్చిన భూముల వివరాలను క్షుణ్నంగా అధ్యయనం చేస్తున్నారు. బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములున్నాయని తెలుసుకున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వివరాలను సేకరించారు. పదిహేను చోట్ల వివరాలు సేకరించి ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వాటిని తెలపనున్నారు.

# ఏరువాక.. జోరుగా సాగాలిక!

జగిత్యాల : అన్నదాతలు కార్తెలను నమ్ముకుని, ప్రకృతితో మమేకమై పొలం పనులను మొదలు పెడతారు. ఇదే అధిక దిగుబ డులను తమ లోగిళ్లకు తెస్తుందని విశ్వసిస్తారు. గత నెలలోనే భారీ వర్షాలు కురవగా అన్నదాతలు ఇప్పటికే దుక్కులు సిద్ధం చేయటం, విత్తనాలను సేకరించుకోవడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. 'ఏరువాక పౌర్ణమి'తో ఉమ్మడి జిల్లాలో సాగు పనులు జోరందుకోనున్నాయి.

**ప్రధాన పంటగా వరి**

ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం 9.50 లక్షల ఎకరాల్లో వరి పండించనున్నట్లు అంచనా. పత్తి, కంది తదితర పంటల సాగు పెంచాలని ప్రభుత్వం పేర్కొంటున్నా పసుపులో మిశ్రమ పంటగా మక్క, ఇతరత్రా అలసంద, సోయాబీన్, పెసర, మినుము, కూరగాయలు, మిరప ప్రధాన పంటలుగా ఉండనున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరినార్లు పోస్తుండగా పసుపు, మక్క, పత్తిని విత్తుతున్నారు.

**ఇలా చేస్తే కర్షకులకు దన్ను**

పత్తిలో బీటీ-3, నకిలీ విత్తులను, ఇతర పంటల్లోనూ నాసిరకం విత్తనాల విక్రయాన్ని అరికట్టాలి. గ్రామాల్లో గుట్టుగా సాగే నకిలీ సేంద్రియ ఎరువుల జీరో క్రయవిక్రయాలను నిరోధించాలి.

జనుము, జీలుగ విత్తనాలను రాయితీపై ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు అన్ని రకాల ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు జిల్లాకు కనీసం రూ.275 కోట్లను యాంత్రీకరణ, యంత్రలక్ష్మి పథకానికి కేటాయించి సీజన్ ఆరంభంలో యంత్రాలు, పరికరాలివ్వాలి. ఈ సీజన్ నుంచి అయినా పంటల



బీమా పథకాన్ని అమలు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలి. రూ.2 లక్షల్లోపు రుణమాఫీ వివిధ కారణాలతో మిగిలిపోయిన వారు, కుటుంబ యూనిట్‌గా పరిగణించినందున రూ.2 లక్షలకన్నా పైబడి రుణమున్నవారు ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.31 లక్షల మంది ఉండగా వీరికి రుణమాఫీ నిధులు విడుదల చేయాల్సి ఉంది.

నిరుడు వానాకాలానికి చెందిన రైతుభరోసా నిధులు ఇవ్వలేదు. గత యాసంగి సీజనుకు చెందిన నిధులను 4 ఎకరాల వరకే ఇవ్వగా మిగిలిన రైతులకు నిధుల విడుదలపై రైతులు ఎదురు చూస్తున్నారు. ఉపాధిహామీని సాగు పనులకు అనుసంధానించాలి. పంటల్లో ఉప ఉత్పత్తుల తయారీకి వ్యవసాయ అనుబంధ పరిశ్రమ, ఫుడ్‌పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలి.

ప్రభుత్వ హామీ మేరకు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు, పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన కేంద్రం, ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం, జిల్లాలో ఉద్యాన పరిశోధన స్థానం ఏర్పాటు చేయాల్సి ఉంది. లక్ష్మీపూర్‌లో విత్తనశుద్ధి కర్మాగారం పూర్తి చేయాలి. వాగులపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంలను పూర్తి చేయాలి.

# ఊరు చిన్న. తీరు మిన్న

సిరిసిల్ల: వేములవాడ పక్కనే ఉన్న చిన్న పంచాయతీ.. అక్కడ ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి.. వీధుల్లో మురుగు కనిపించకుండా ఇంకుడు గుంతలు నిర్మించారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ప్రకటించిన చెక్కపల్లి ఘనత ఇది. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి.. కాలుష్య రహిత గ్రామం దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లో జిల్లా స్వచ్ఛభారత్ మిషన్, కాలుష్య నియంత్రణ విభాగం ఏప్రిల్‌లో సంయుక్తంగా సర్వే చేసి, ప్రతిపాదనలు పంపింది.

**ప్రణాళిక.. ఆదర్శంగా..**

వేములవాడ గ్రామీణ మండలం చెక్కపల్లిలో 464 గృహాలు, 2,320 జనాభా ఉంది. ఇళ్లలో సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలిస్తున్నారు. దీని ద్వారా ఇప్పటికీ 463 కిలోల సేంద్రియ ఎరువును తయారు చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. దీనికోసం గ్రామంలో మహిళలతో ప్రత్యేకంగా ప్లాస్టిక్ నివారణ కమిటీని




నియమించారు. సెగ్రిగేషన్ షెడ్డులోనే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తూనే.. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్టీల్‌బ్యాంకును ఏర్పాటు చేశారు. గ్రామంలో జరిగే శుభకార్యాలకు వీటిని ఇస్తున్నారు. గ్రామంలో చాలా వరకు మురుగునీటి కాల్వలు లేవు. దీంతో ఇళ్లలోని మరుగునీరు వీధుల్లోకి వచ్చి చేరుతుంది. దీనికోసం ద్రవ వ్యర్థాల నిర్వహణ కమిటీని ఏర్పాటుచేసి ప్రతి ఇంటితోపాటు వీధుల్లోనూ సామాజిక ఇంకుడుగుంతలు నిర్మించారు. ఇలా ప్రతీది ప్రణాళిక ప్రకారం చేస్తుండటంతో గ్రామం పరిశుభ్రంగా మారింది.

**స్వచ్ఛతే లక్ష్యంగా..** సురేష్, ఐఈసీ కన్సల్టెంట్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని పంచాయతీలు ఓడీఎఫ్ ప్లస్‌గా ఎంపికయ్యాయి. ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఏ కార్యక్రమంలోనైనా ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. ఈ క్రమంలో తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో వినియోగించిన శానిటరీ న్యాప్‌కిన్‌ల కోసం శుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. జిల్లాలోని మిగతా గ్రామాలు చెక్కపల్లిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని నమూనాగా చూపుతున్నాం.

**నిత్యం పర్యవేక్షణ : మంజుల, వీవోఏ**

సేంద్రియ ఎరువు విక్రయంతో పంచాయతీకీ రూ.6,270 ఆదాయం సమకూరింది. కొంత ఎరువును నర్సరీలు, ప్రకృతి వనాలు, రోడ్ల వెంట నాటిన మొక్కలకు వేశాం. శుభకార్యాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామంలో స్టీలు సామగ్రిని అందుబాటులో ఉంచాం. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్, వస్త్ర సంచులను అందించాలని సూచించాం.

చురకలు



# పల్లె దారులకు పచ్చజెండా


సిరిసిల్ల: జిల్లాలో ఆర్అండ్బీ రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. మండల కేంద్రాలను జిల్లా కేంద్రంతో అనుసంధానించేలా హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హ్యామ్) విధానంలో 300 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. తొలిదశలో 136.2 కిలోమీటర్ల మేర రహదారులకు ఆమోదం లభించింది. ఈ దారుల్లో ట్రాఫిక్, ప్రస్తుత రహదారి పరిస్థితి సర్వే చేయనున్నారు. తర్వాత టెండర్ల ద్వారా 40-60 శాతం ఈపీసీ(ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్), బిల్డ్ ఆపరేటర్, ట్రాన్స్‌ఫర్(బీవోటీ) పద్ధతిలో శాశ్వతంగా నిర్మిస్తారు.

**మంజూరైన రహదారులు ఇవే**

బోయినపల్లి మండలం శాభాష్‌పల్లి-నమిలికొండ(17.3 కిలో మీటర్లు)

తంగళ్లపల్లి మండలం జిల్లెల కూడలి నుంచి ఇల్లంతకుంట(16.0)

సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిలో మాచారెడ్డి నుంచి



ముస్తాబాద్(38.8) సిరిసిల్ల-ముస్తాబాద్ రహదారిలో నామాపూర్, వెంకటాపూర్, అవునూరు(12.4) వేములవాడ-కోరుట్ల(26).

చందుర్తి-మోత్కురావుపేట(10.6) సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండలం మరిమడ్ల రహదారి(4.6)

కోనరావుపేట మండలం బావుసాయిపేట-వెంకటాపూర్(3.3)

కోనరావుపేట మండలం వట్టిమల్ల-నిమ్మపల్లి(2.9)

వేములవాడ పట్టణం మూలవాగు నుంచి చింతల్‌ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీ 4.3 కిలోమీటర్లు ఉన్నాయి.

అల్లుకున్న ఆహ్లాదం ఏపుగా పెరిగిన చెట్టు.. తోరణాలను తలపించేలా అల్లుకున్న కొమ్మలు చూడటానికి ఎంతో బాగుంది కదూ. వేములవాడ, కోరుట్ల రహదారిలో చందుర్తి మండలం మల్యాల, లింగంపేట గ్రామాల మధ్య ఈ చెట్లు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ఈ చెట్లు వాహనదారులు, ప్రయాణికులకు నీడతోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

# భూభారతి.. దరఖాస్తుల పురోగతి

నేలకొండపల్లి :నేలకొండపల్లి మండలాన్ని భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ప్రకటించింది. రెవెన్యూ యంత్రాంగం, భూయజమానులు నూతన ఆర్ఓఆర్ చట్టం-2025 అమలు తీరుపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గతంలో లేని విధంగా చట్టంలో వివిధ మాడ్యూళ్లలో భూ సమస్యల పరిష్కారానికి నూతనంగా కొన్ని అవకాశాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆరు మాడ్యూళ్లలో 33 ఐచ్ఛికాలను పొందుపరిచారు. వీటిపై అవగాహన కోసం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. నేలకొండపల్లి మండలంలో ఏప్రిల్ 17 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు జరిగాయి.

**పరిశీలనకు ఏడు బృందాలు**

దరఖాస్తుల పరిశీలనకు ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి నాయబ్ తహసీల్దార్, గిర్దావర్, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లను కేటాయించారు. వీరు ప్రతి దరఖాస్తును రెండు విధాలుగా పరిశీలిస్తున్నారు. తొలుత రెవెన్యూ రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. తరువాత గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భూమి భౌగోళిక హద్దుల్ని నమోదు చేస్తున్నారు. సంబంధిత వివరాలను దరఖాస్తుకు జోడించి తహసీల్దారు, ఆయన ద్వారా ఆర్డీఓకు నివేదించనున్నారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి అనుమతులు రాగానే పరిష్కరిస్తామని, నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.

**వేలల్లో దరఖాస్తులు...** నేలకొండపల్లి మండల వ్యాప్తంగా 3,224 దరఖాస్తులు అందాయి. సాదాబైనామాతో భూమి హక్కుల కోసం 1,200 వచ్చాయి. పాసు పుస్తకాల్లో తప్పులు, పాత పాసుపుస్తకం నుంచి కొత్తదాంట్లో భూమి నమోదుకాలేదని, విస్తీర్ణం, భూమి స్వభావం, హక్కు రకం తదితర అంశాల్లో సమస్యలున్నాయని 700 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల హక్కుల నమోదుకు 94 అర్జీలు అందాయి. వీటిని రెవెన్యూ అధికారులు క్రోడీకరించి మాడ్యూళ్ల వారీగా విడదీశారు. దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో ప్రణాళిక రూపొందించారు.

# పల్లెలపై పట్టింపేదీ?

జగిత్యాల : సర్పంచుల పదవీకాలం ముగియటం.. నిధుల లేమి.. అధికారులపై పని ఒత్తిడితో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. పైగా జిల్లాలో డీపీవో, డీఎల్‌పీవో పోస్టులను భర్తీ చేయకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. జగిత్యాల జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా ఉంది. గతేడాది ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం ముగియగా.. ప్రత్యేక అధికారులను నియమించారు. నిధుల లేమి.. పని ఒత్తిడి కారణంగా ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామాలపై కన్నెత్తి కూడా చూడటం లేదు. పంచాయతీ కార్యదర్శులతో పాలన కొనసాగుతోంది. గతేడాది ఆగస్టులో జగిత్యాల డీపీవోగా పనిచేసిన దేవరాజ్.. డీఎల్‌పీవోగా ఉన్న కనకదుర్గ, మెట్‌పల్లి డివిజన్ డీఎల్‌పీవో శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. కోరుట్ల డీఎల్‌పీవో శంకర్ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి వీరి స్థానాల్లో ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం ఏపీడీగా పనిచేస్తున్న మధన్‌మోహన్‌కు అదనంగా డీపీవో బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయనపై పనిభారం పెరిగింది. డీఎల్‌పీవోలుగా ఇన్‌ఛార్జులను నియమించారు. పంచాయతీ అధికారుల పోస్టుల్లో ఎవరిని ప్రభుత్వం నియమించకపోవటంతో పల్లెల్లో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**నిధులు రాక.. అభివృద్ధి సాగక**

జిల్లాలో పంచాయతీలకు అందే నిధులు సుమారు 8 నెలలుగా రావటం లేదు. దీంతో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. కొత్తగా ఏవైనా పనులు మొదలు పెట్టాలన్న అధికారులు ఆలోచిస్తున్నారు. గ్రామాల ఆదాయం అంతంత మాత్రమే కావటంతో పాలన పూర్తిగా కుంటు పడింది. చిన్న పంచాయతీల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఈ-పంచాయతీ ఆపరేటర్లు కూడా 5 నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. పల్లెలకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర పనులు మాత్రమే పరిశీలిస్తున్నారు. మిగతా పనులు ఎవరూ పట్టించుకోవటం లేదు. కొన్ని గ్రామాల్లో మొక్కలకు నీళ్లు పట్టక ఎండిపోతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

# అష్టకష్టాల పన్ను.. ఆన్‌లైన్‌తో దన్ను




హైదరాబాద్: ఆస్తిపన్ను సంబంధిత సేవల కోసం ప్రజలు నేరుగా జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకోవచ్చు. బల్దియా వెబ్‌సైట్‌లో ఎనిమిది రకాల దరఖాస్తులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. దళారుల ప్రమేయం, లంచాలు, ప్రజల సమయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని.. డిజిటల్ దరఖాస్తు సేవలను సొంతంగా నిర్వహించాలని తాజాగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ రెవెన్యూ విభాగాన్ని ఆదేశించారు. సంబంధిత అధికారులు దరఖాస్తు విధానంపై కసరత్తు ప్రారంభించారు. ప్రక్రియను రెండు నెలల్లో ముగించి.. అందుబాటులోకి తెస్తామని జీహెచ్‌ఎంసీ ధీమా వ్యక్తం చేస్తోంది.

**ప్రస్తుతం ‘మీ సేవా’ ద్వారానే..**

గ్రేటర్ పరిధిలోని 72 మీసేవా కేంద్రాల్లో ఆస్తిపన్ను సంబంధిత సేవలకు దరఖాస్తులు తీసుకుంటున్నారు. పలు కేంద్రాల్లో మీసేవా సిబ్బంది, స్థానిక బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, దళారులు జట్టుగా ఏర్పడి.. దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారు. వాటిని దూరం చేయాలన్న లక్ష్యంతో జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని కమిషనర్ నిర్ణయించారు.ఎక్కడి నుంచైనా..: వెబ్‌సైట్‌లో దరఖాస్తు ప్రక్రియ అందుబాటులోకి వస్తే..ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ చెల్లింపుల కోసం 8 బ్యాంకులు, వాటికి సంబంధించిన 537 బ్రాంచీలతో ఒప్పందం చేసుకున్నామని, నెట్ బ్యాంకింగ్, ఎన్ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్, యూపీఐని ఉపయోగించి రుసుం చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు.

**జోరుగా కసరత్తు..**

మీసేవా కేంద్రాలు ప్రస్తుతం దరఖాస్తు రుసుము రూ.45 వసూలు చేస్తున్నాయి. దాన్ని కొనసాగించాలా, తగ్గించాలా, ఉచితంగా తీసుకోవాలా అనే విషయమై రెవెన్యూ విభాగం కసరత్తు చేస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తు ఎలా ఉండాలి? దరఖాస్తులను ఆమోదించే అధికారాన్ని ఎవరికి ఇవ్వాలనే విషయంపైనా అధికారులు జోరుగా చర్చిస్తున్నారు. పరిశీలన, ఆమోదానికి నిర్ణీత గడువు ఉంటుందని, ఆ లోపు పరిష్కారం కాకుంటే.. బాధ్యులైన అధికారులపై చర్యలు ఉండేట్టు జీహెచ్‌ఎంసీ నిబంధన పెట్టబోతోంది. వెబ్‌సైట్‌లోనేగాక.. ఆయా దరఖాస్తులను పై జీహెచ్‌ఎంసీ మొబైల్ యాప్‌లోనూ అందుబాటులోకి తీసుకొస్తామని, అరచేతి నుంచే ప్రజలు సేవలను పొందవచ్చని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేస్తోంది.

ఏయే సేవలంటే..

కొత్త భవనాలకు ఆస్తిపన్ను మదింపు

మ్యుటేషన్‌జి

పన్ను సవరణ (రివిజన్)

యజమాని పేరు సవరణ

ఇంటి నంబరు సవరణ

వినియోగంలో లేని భవనానికి పన్నులో రాయితీ

ఆస్తిపన్ను నుంచి మినహాయింపు

బ్లాక్ చేసిన పీటీఐఎన్‌లను వినియోగంలోకి తేవడం

# ప్రతి అడుగూ.. ప్రగతి వైపే..



బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10 వేల కోట్లకు పైగా విలువ చేసే పనులు మంజూరు చేశారు. వీటిలో ముఖ్యమైనవి కొడంగల్‌కు సాగు, తాగునీరు అందించే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కొడంగల్‌లో వైద్య, పశువైద్య, నర్సింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు రహదారులు, పలు భవనాల నిర్మాణ పనులు కూడా ఉన్నాయి. కొన్నింటి పనులు చకచకా జరుగుతున్నాయి.

**‘కడా’ ఆధ్వర్యంలోనే అంతా..**నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ‘కడా’ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం సోదరుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిరుపతి రెడ్డి తరచూ అభివృద్ధి పనులను సమీక్షిస్తున్నారు. అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తూ పనులు సకాలంలో పూర్తిచేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**ఇవిగో ఉదాహరణలు..**నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల కోసం కావలసిన భూసేకరణ వేగవంతం. దీనికోసం రూ.2900 కోట్లు మంజూరు. కొడంగల్‌లో సమీకృత గురుకుల పాఠశాలకు రూ.250 కోట్లు కేటాయించారు. 25 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించనున్నారు.

నియోజకవర్గంలో వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ, 220 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.224.50 కోట్లు ఇచ్చారు. 220 పడకల ఆసుపత్రి నిర్మాణ దశలో ఉంది.

బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలం హకీంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, హకీంపేటలో ఐటీఐ మంజూరయ్యాయి.

దుద్యాల మండల కేంద్రంలో మండల కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

బొంరాస్‌పేటలో రూ.65 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టారు.పనులు సాగుతున్నాయి.

బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్‌లలో గురుకుల పాఠశాలలకు రూ.75 కోట్లతో సొంత భవనాలు నిర్మిస్తున్నారు.

నాలుగు మండలాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరయ్యాయి. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

నిధుల కేటాయింపులు ఇలా (రూ.కోట్లు)

ఎత్తిపోతలకు- 2900

వైద్య, పశువైద్య, నర్సింగ్ కళాశాలలకు- 224.50.

సమీకృత గురుకులం-250

రహదారులకు-రూ.500

విద్యా సంస్థలకు- రూ.500

# నిఘా డొల్ల.. సొత్తు గుల్ల

వీణవంక : ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం అనే మాట అక్షరాల సత్యం. రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే వాటితో సాధ్యమని గ్రామాల్లో పోలీసుల చొరవ, దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో మంచి ఫలితాలు వచ్చాయి. దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. అయితే వీణవంక మండలంలోని 20 గ్రామాల్లో వందకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఏడాదిన్నర కాలంగా అవి పని చేయడంలేదు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్ పరిసరాలలో తప్ప ఏ గ్రామంలో సీసీ కెమెరాలు పని చేయడంలేదు. దీంతో గ్రామాల్లో చోరీలు జరిగితే దొంగలను పట్టుకోలేకపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**దొరకని దొంగల ఆచూకీ..**

ఈ ఏడాది మార్చి 8న రాత్రి గన్ముకుల ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ గది నుంచి మూడు కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. ఈ చోరీ ఇంటి దొంగల పనే అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు ఏడాదికాలంగా మండలంలో జరిగిన చోరీలలో ఏ ఒక్కరిని పట్టుకోకవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. మండలంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నామని.. ఎస్సై తిరుపతి తెలిపారు.

ఆరు నెలల క్రితం వీణవంక ఠాణాకు కూతవేటు దూరంలో ప్రధాన రహదారి పక్కన ఓ ఎలక్ట్రికల్ దుకాణం, ఓ మద్యం దుకాణంలో షట్టరు తాళాలు పగులగొట్టి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. మొత్తం రూ.45 వేల విలువగల మద్యం సీసాలు, ఇతర సొమ్ము దొంగిలించారు.

# ప్రతిభకు మెరుగులు.. ఉపాధికి బాటలు

కరీంనగర్ : ఉపాధి.. ఉద్యోగాలకు బాసటగా నిలిచే వృత్తివిద్యా కోర్సులు నిరుద్యోగ యువతతోపాటు గృహిణులను కూడా ఆకర్షిస్తున్నాయి. డ్రాయింగ్, టైలరింగ్-ఎంబ్రాయిడరీ వంటి వాటిల్లో స్థిరపడేందుకు ఉపకరించే టెక్నికల్ టీచర్స్ కోర్సు (టీటీసీ)లను చేస్తున్నారు. కరీంనగర్‌లోని ధన్గర్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మ్యూజిక్ టీటీసీ శిక్షణ తరగతులు వారిలో సృజనాత్మకతను పెంచుతున్నాయి. ఉమ్మడి జిల్లా వారితోపాటు సిద్దిపేట, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అభ్యర్థులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు.

**ఉద్యోగాలపై ఆసక్తితో..**

పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో పార్ట్‌టైం, ఫుల్‌టైం బోధకులుగా వృత్తి విద్యాకోర్సుల్లో టీసీసీ పూర్తి చేసిన వారు పనిచేస్తున్నారు. దీంతో వృత్తి



విద్యాకోర్సుల్లో శిక్షణకు ఆదరణ ఊపందుకుంది. సహజంగానే టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్‌లలో కొంత ప్రావీణ్యమున్న వారు సులభంగా ఇలాంటి ఉద్యోగాలను సాధించడమో, ఉపాధి పొందవచ్చన్న ధీమా యువతలోనే కాకుండా మహిళల్లో బాగా పెరిగింది. ఆయా అంశాల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లను సాధించి టెక్నికల్ టీచర్స్ కోర్సులో శిక్షణ పొంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు వారు పోటీపడుతున్నారు. దీనికి కరీంనగర్‌లో నిర్వహిస్తున్న టీటీసీ శిక్షణ తరగతులు వారి ఆసక్తికి వేదికగా నిలుస్తోంది. టీటీసీ పరీక్షకు ముందు అభ్యర్థులు 42 రోజుల పాటు థియరీ, ప్రాక్టికల్స్‌లో విద్యాశాఖ అందించే శిక్షణ తరగతుల్లో వారు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

**శిక్షణలో 860 మంది అభ్యర్థులు**

డ్రాయింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, మ్యూజిక్‌లలో నిర్వహిస్తున్న టీటీసీ శిక్షణ తరగతుల్లో మొత్తం 860 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. ఈ నెల 1న ప్రారంభమైన తరగతులు వచ్చే నెల 11న ముగియనున్నాయి. కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లోని ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లతో నిత్యం అభ్యర్థులకు డ్రాయింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, మ్యూజిక్ అంశాల్లో మెలకువలతోపాటు పాఠశాల పరిపాలన, నిర్వహణ, బోధన పద్ధతులు, సైకాలజీ థియరీ క్లాసులు, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల బోధనపై పట్టు పెంచుకుంటున్న అభ్యర్థులు ప్రాక్టికల్ తరగతుల ద్వారా ఆయా అంశాల్లో మరింత సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణకు 856 మంది అభ్యర్థులు పాల్గొంటుండగా, వారిలో అధిక సంఖ్యలో మహిళలు, యువతులే ఉండటం విశేషం. అల్లికలు, నిరుపయోగంగా పడేసే కాగితాలు, అట్టలు వంటి వాటితో అలంకరణ వస్తువులు, ఆకట్టుకునేలా గాజులు, మహిళలకు అందంగా నిలిచే ఎంబ్రాయిడరీ డిజైన్లు, వివిధ రకాల కుట్లు, దుస్తుల కుట్టు వంటివి టైలరింగ్-ఎంబ్రాయిడరీ అభ్యర్థులు, డ్రాయింగ్‌లో పలువురు అభ్యర్థులు అబ్బురపరిచే చిత్రాలతోపాటు రమణీయమైన డిజైన్లు వేయడంలో శిక్షణ పొందుతున్నారు.

అన్ని సదుపాయాలతో శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తూ వారి హాజరు, ప్రాక్టికల్స్ ఆధారంగా వారికి మార్కులను కేటాయించనున్నట్లు శిక్షణ కేంద్రం కోర్సు ఇన్‌ఛార్జి బొట్ల రామస్వామి తెలిపారు.

# సాధారణ కాన్పులు మెరుగు

పాల్వంచ : మారుమూల ప్రాంతాల్లోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు.. భద్రాచలం, చర్ల, అశ్వారావుపేట, మణుగూరు, బూర్గంపాడు, పాల్వంచ, ఇల్లెందులో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.గతంలో ఆయాచోట్ల స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధించేది. ప్రభుత్వం ఆదేశాలతో సరైన వేతనాలు, ప్రోత్సాహకాలు కల్పించి స్పెషలిస్టలను మారుమూల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఉన్నతాధికారులు నియమించారు. స్థానికంగా మెరుగైన ప్రసూతి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. పిల్లల వైద్యులు, మత్తు, రేడియాలజిస్టులను నియమించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆపరేషన్ థియేటర్లు, ప్రసూతి వార్డుల్లో మౌలిక వసతులు కల్పించారు. 24 గంటల వైద్యసేవలతో పాటు ల్యాబ్ టెస్టులు, గర్భిణులకు ఏఎన్సీ, టిఫా స్కాన్లు అందుబాటులో తెచ్చారు. వేసవి నేపథ్యంలో ప్రసూతి వార్డుల్లో ఏసీలు, కూలర్ల ఏర్పాటు చేయించారు. ఫలితంగా కాన్పుల కోసం ఆసుపత్రులకు వచ్చే గర్భిణుల సంఖ్య పెరిగింది.

**జిల్లా వ్యాప్తంగా..**మణుగూరు సామాజిక ఆరోగ్య ఆసుపత్రిలో ఫిబ్రవరిలో



కేవలం ఎనిమిది ప్రసవాలు కాగా, ఏప్రిల్‌లో ఆ సంఖ్య 58కి పెరిగింది. జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరిలో 300గా ఉన్న ప్రసవాల సంఖ్య ఏప్రిల్‌లో 400కి చేరింది. భవిష్యత్తులో కాన్పులు పెంచుతామని వైద్య విధాన పరిషత్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల లో కోత లేకుండా సుఖప్రసవాలు చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

ప్రైవేటుతో పోల్చిచూస్తే సిజేరియన్ సెక్షన్ల సంఖ్య ప్రభుత్వ దవాఖానాల్లో తక్కువగా నమోదవుతోంది. సాధారణంగా ప్రైవేటు దవాఖానాల్లో ఒక కాన్పునకు సుమారు రూ.30,000 నుంచి రూ.40,000 వరకు ఖర్చవుతుంది. కానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు ఉచితం కావడంతో రద్దీ అధికమవుతోంది. వైద్య సిబ్బంది అంకితభావం, అధునాతన వైద్య సేవలు, మిడ్ వైఫరీ నర్సుల సహకారంతో సుఖ ప్రసవాల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ‘ప్రభుత్వ దవాఖానాల్లో కాన్పు చేయించుకుంటే స్కానింగ్, రక్త పరీక్షలు, సిజేరియన్, రూం తదితర ఖర్చుల భారం తగ్గుతుంది. వైద్య విధాన పరిషత్ దవాఖానాల్లో అందుతున్న మెరుగైన సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. కొందరు ఆసుపత్రి సిబ్బంది సైతం తాము పనిచేస్తున్న ఆసుపత్రుల్లోనే సాధారణ కాన్పులు చేయించుకోవడానికి మొగ్గు చూపుతున్నారు.’డా.రవిబాబు, డీసీహెచ్ఎస్

# కాపలాదారులకు కల్పతరువు

పాణ్యం : ఆర్థిక నష్టాలతో మూతపడిన పరిశ్రమ కొందరికి కాసులు కురిపిస్తోంది. అన్నదాతల ఆర్థికాభివృద్ధికి మేలు చేసేలా ఏర్పాటు చేసిన నూలు పరిశ్రమ ఏళ్ల కిందట మూతపడింది. అక్కడ విలువైన సామగ్రి ఉండటంతో రక్షణ బాధ్యతలు ఓ ఏజెన్సీకి అప్పగించారు. వారి కన్ను అక్కడున్న చెట్లపై పడింది. గత 20 రోజులుగా సుబాబుల్, తుమ్మ, వేప తదితర విలువైన చెట్లు కొట్టేయిస్తున్నారు. సుబాబుల్ టన్ను ధర రూ.7 వేలు ఉంది. ఇతర కలప టన్ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు బేరం పెట్టారు. నిత్యం 40 నుంచి 50 టన్నుల కలపను తరలిస్తున్నారు. గత 20 రోజులుగా రూ.50 లక్షల వరకు వెనకేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**చిట్టడవిలా మిల్లు ప్రాంగణం**

పాణ్యం మండలం రైతులకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో 1986లో సహకార నూలుమిల్లుకు పునాది వేశారు. కర్నూలు-కడప జాతీయ రహదారి పక్కన 60 ఎకరాల్లో నిర్మించారు. నష్టాలు రావడంతో 1996లో లేఆఫ్ ప్రకటించారు. కొన్నాళ్లకు శాశ్వతంగా మూతపడటంతో 500 కుటుంబాల వరకు రోడ్డున పడ్డాయి. విలువైన యంత్రాలు తుప్పుపట్టాయి. భవనం శిథిలావస్థకు చేరింది.. పరిశ్రమ ప్రాంగణంలోకి ఖాళీ స్థలంలో చెట్లు పెరిగాయి. యంత్రాలను కొందరు ఎత్తుకుపోయారు. దీంతో జౌళీ శాఖకు చెందిన సిబ్బందిని కాపలాగా నియమించారు.

**పరికరాలకు పాత సామగ్రికి**

నూలుమిల్లు లోపల విలువైన యంత్రాలున్నాయి.. చాలా కాలం నుంచి వినియోగించకపోవడంతో తుప్పుపట్టాయి. స్థానికులు కొందరు



లోపలికెళ్లి ఎక్కడికక్కడ భాగాలు విడదీసి బేరం పెడుతున్నారు. గుజరీ దుకాణం వారికి విక్రయిస్తున్నారు.. కిలోల చొప్పున అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు.. ఇప్పటికే రూ.కోట్ల విలువైన ఇనుప సామగ్రి మాయమైంది. మిల్లుకు సంబంధించిన రుణ బకాయిల అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది.

**భద్రాచలానికి తరలింపు**

మిల్లు ప్రాంగణంలో ఏపుగా పెరిగిన చెట్లను గత 20 రోజులు కొట్టేస్తున్నారు.. వాటిని లారీల్లో తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. కాగితం తయారీకి సంబంధించి కలపను తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ఓ మిల్లుకు తరలించారు. చెట్ల నరికివేత పట్టపగలే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా చెట్లు తొలగించాలంటే అటవీ శాఖ అనుమతి తీసుకోవాలి.. ఇక్కడ ఎవరి అనుమతి తీసుకోలేదు. జౌళీ శాఖకు చెందిన కొందరు సిబ్బంది దగ్గరుండి చెట్లను కొట్టేయిస్తున్నారు. ఏకంగా యంత్రాలు పెట్టి పదుల సంఖ్యలో కూలీలతో తొలగిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు**

– నాగరాజరావు, ఏడీ, జౌళీ శాఖ

నూలుమిల్లులో చెట్లు తొలగించడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. విలువైన సామగ్రి దొంగలపాలవుతోందని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. చెట్ల తొలగింపు అంశం మా దృష్టికి రాలేదు.. వెంటనే అక్కడికెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# వైద్య విద్యకు తరగని కొరత

నంద్యాల : నంద్యాల మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు నాలుగేళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ చాలా భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. వసతిగృహాలు, తరగతి గదులు పూర్తికాలేదు. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సరిపడా వసతులు ఉన్నాయి. మరో మూడు నెలల్లో మొదటి ఏడాదిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. వారు కళాశాలలో చేరేలోగా వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది విద్యార్థులు అవస్థలు పడాల్సిందే.

**నాలుగేళ్లుగా నత్తనడకన**

నంద్యాల మెడికల్ కళాశాల భవనాలను 2022 నుంచి నిర్మిస్తున్నారు. 2023లో తాత్కాలిక భవనాలు మాత్రమే చేపట్టి కళాశాలను ప్రారంభి



ంచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వసతిగృహాల నిర్మాణం మాత్రమే చేపట్టారు. మొత్తం రూ.450 కోట్లకు గాను ప్రస్తుతం రూ.100 కోట్ల పనులే చేశారు. గత ప్రభుత్వంలో విడుదలైన నిధులే ఖర్చు కాలేదని, వాటికి ఖర్చులు చూపితే మరిన్ని నిధులు కేటాయిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇటీవల నంద్యాలకు వచ్చినప్పుడు చెప్పారు. గతంలో తాత్కాలిక భవనాలు మాత్రమే నిర్మించడంతో ప్రస్తుతం విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**పాత భవనాలే దిక్కయ్యాయి**

వైద్య కళాశాలకు కేటాయించిన స్థలంలో ఆర్ఏఆర్ఎస్‌కు సంబంధించిన మూడు భవనాలు ఉన్నాయి. వాటిలో రెండింటిని వసతిగృహాలకు, మరో భవనాన్ని ఎగ్జామినేషన్‌కు ఉపయోగిస్తున్నారు. అవి లేకపోతే వసతిగృహాలు, ల్యాబ్‌లకు ఇతర అవసరాలకు భవనాలను అద్దెకు తీసుకోవాల్సి వచ్చేది.

**బోధనకు ఇబ్బందులు**

మెడికల్ కళాశాల కోసం నిర్మించిన తాత్కాలిక భవనాల్లో రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 300 మంది చదువుతున్నారు. త్వరలో వీరు ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో అడుగుపెడతారు. మొదటి ఏడాదిలో మరో 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. అప్పుడు మూడు తరగతి గదులు అవసరం అవుతాయి. ప్రస్తుతం రెండు తరగతి గదులు మాత్రమే ఉండటంతో ఇబ్బందులు తప్పేలా లేవు. తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులకు సర్వజన ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్ కేటాయిస్తే ప్రొఫెసర్లు ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి కళాశాలకు వెళ్లాలంటే కిలోమీటరు ప్రయాణించాల్సి వస్తుంది. దీనివల్ల సమయం వృథా అయ్యే ఆస్కారం ఉంది. నిర్మాణాలు త్వరగా పూర్తిచేస్తేనే విద్యాబోధన సాఫీగా సాగుతుందని ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు.

# సెంట్రల్ వర్సిటీలో ప్రవేశాలకు వేళాయె



బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద 492 ఎకరాల్లో ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకోవాలనే విద్యార్థులకు ఎనిమిది యూజీ, 17 పీజీ కోర్సులు, పీహెచ్‌డీలో 6 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి 15 డిప్లొమా కోర్సులు ప్రవేశ పెడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వర్సిటీలో చదువుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించి, ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వర్సిటీలో ప్రవేశాలు కల్పిస్తారు.

**జులై చివరి వరకు ప్రవేశాలు**

జులై నెలాఖరు వరకు ప్రవేశాలు కొనసాగుతాయి. మిగిలిన సీట్లకు వర్సిటీలోనే విద్యార్థులకు తక్షణ ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రతి కోర్సుకు గరిష్ఠంగా 60 సీట్లు అందుబాటులో ఉంటాయి. వర్సిటీలో చదువుకునే విద్యార్థులకు బాలికలు, బాలురకు వేరువేరుగా వసతిగృహాలు అందుబాటులో ఉంటాయి.

అనంతపురం పాతూరు నుంచి వర్సిటీకి నేరుగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. విద్యార్థులు నేరుగా వర్సిటీకి వచ్చి వివరాలు తెలుసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో ఈనెల 20న దరఖాస్తు చేయడానికి ఆఖరు అని వర్సిటీ వర్గాలు తెలిపాయి. సీయూఏపీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని వర్సిటీ ప్రొఫెసర్ కెనడీ తెలిపారు.

**ఎనిమిది యూజీ(డిగ్రీ) కోర్సులు**

డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు 8 కోర్సులు అందబాటులో ఉన్నాయి. బీఏ (పొలిటికల్‌సైన్స్), బీఏ (ఇంగ్లిష్), బీఎస్సీ(ఎకనామిక్స్), బీఎస్సీ (సైకాలజీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్-ఏఐ), బీకాం బీబీఏ, బీఎస్సీ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు ఈ ఏడాది బీటెక్ (ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్) కొత్తగా అందుబాటులోకి వచ్చాయి.

**పీజీలో.. :** డిగ్రీ పూర్తి చేసి పీజీ చదవాలనుకునే విద్యార్థులకు 17 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎంఏ(ఇంగ్లిష్), ఎంఏ (గవర్నెన్స్, పబ్లిక్ పాలసీ), ఎంఏ (హిందీ), ఎంఏ (పొలిటికల్ సైన్స్), ఎంఏ (తెలుగు), ఎంఎస్సీ (సైకాలజీ), ఎంఎస్సీ (ఏఐ) ఎంఎస్సీ (క్లినికల్ సైకాలజీ), ఎంఎస్సీ (కంప్యూటేషన్ సోషియల్ సైన్స్), ఎంఎస్సీ (ఎకనామిక్స్), ఎంఎస్సీ (ఎకనామిక్స్, డేటా అనాలసిస్), ఎంఎస్సీ (జాగ్రఫీ), ఎంఎస్సీ (మ్యాథమాటికల్, కంప్యూటింగ్), ఎంఎస్సీ (బయాలజీ), ఎంఎస్సీ (స్పేస్ సైన్స్, టెక్నాలజీ), ఎంబీఏ, ఎంకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. **పీహెచ్‌డీలో.. :** పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఆరు కోర్సులకు వర్సిటీ యాజమాన్యం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తోంది. వీటిలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ కోర్సు, తెలుగు, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులు ఉన్నాయి.

# వనాలు కొట్టేయ్.. భూములు పట్టేయ్!!



ఆనందపురం : ఆనందపురం మండలంలోని ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమార్కుల కన్ను పడింది. మొన్న దబ్బందలో దర్జాగా 80 అడుగుల రోడ్డు వేయగా ..తాజాగా రామవరంలో డి-పట్టాల పేరిట ప్రభుత్వ భూమిలోకి చొరబడేందుకు యత్నిస్తున్నారు. ఇందుకు వీలుగా సుమారు 21 ఎకరాల్లో ఖరీదైన చెట్లను అక్రమంగా నరికి కలపను తరలిస్తున్నారు.

రామవరంలోని ఓ సర్వే నంబర్‌లో 21 ఎకరాల గెడ్డ వాగు ఉంది. దీనిలో ఆరు కుటుంబాలకు 1987లో 7 ఎకరాల భూమిని డి-పట్టాల కింద ఇచ్చారు. పెద్ద పెద్ద గెడ్డలతో కూడిన వాగు కావడంతో వాటిని రద్దు చేసి.. సదరు వ్యక్తులకు మళ్లీ 1997లో మరో సర్వే నంబర్‌లో రెట్టింపు భూమిని డి-పట్టాల కింద అందజేశారు. అయితే.. ఆ భూములోకి ఎవరూ సాగులోకి రాలేదు. సహజ సిద్ధంగానే అక్కడ ఆకేష్, టేకు, వేప వంటి తదితర చెట్లతో పెద్ద తోటగా మారింది.

రాష్ట్ర విభజన సమయంలో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు రావడంతో విశాఖలో స్థిరపడిన ఓ పోర్టు గుత్తేదారుడి కన్ను వాటిపై పడింది. 1987 నాటి డీఆర్ ఫైల్‌లో ఆ వ్యక్తుల పేర్లు తొలగించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ శాఖలో ఉన్న పలుకుబడితో 2017లో కొత్తగా తయారు చేసిన డీఆర్ ఫైల్‌లోకి సదరు వ్యక్తుల పేర్లను చేర్పించాడు.

ఇటీవల డి-పట్టాల ఫ్రీహోల్డ్ సమయంలో సదరు వ్యక్తులతో దరఖాస్తు చేయగా ఈ విషయాన్ని పసిగట్టిన అప్పటి రెవెన్యూ అధికారులు నిరాకరించారు. ఈ క్రమంలో డి-పట్టాలతో చొరబడేందుకు వీలుగా తొలుత పెద్ద పెద్ద వృక్షాలతో కూడిన తోటను దర్జాగా నరికి తరలిస్తున్నారు.

**అక్కడ వారి సహాయంతో...**

ఈ భూముల్లో పెరిగిన ఆకేష్, టేకు తరలించడానికి అటవీ శాఖ అనుమతులు కావాలి. కానీ కొందరు అధికారుల సహాయంతో వారం రోజులుగా చెట్లను తొలగిస్తున్నట్లు ఆరోపణ లొచ్చాయి. ఓ దశలో గ్రామస్థులు అడ్డుకోవడంతో కూటమి ప్రభుత్వంలో కీలక వ్యక్తినని, ఇక్కడ బీటీ రోడ్డును తానే వేయించానని గ్రామస్థులకు చెబుతూ చలామణి అవుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు.

ఒక వేళ ఈ భూముల్లో పట్టాలు ఇస్తే 1987 నుంచి ఇంతవరకు సాగులోకి ఎందుకు రాలేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతున్నారు.

# రైతు వేదిక... వ్యాపారి వేడుక



కర్నూలు : " నగరంలో చిన్న గోదాము అద్దె నెలకు రూ.లక్షకు తక్కువ ఉండదు.. అలాంటిది కర్నూలు మార్కెట్‌లో ఒక గోదాముకు రూ.44 వేల అద్దె నిర్ణయించారు. బాడుగ తక్కువగా ఉండటంతో కొందరు పైరవీలు చేసి దక్కించుకొని వాణిజ్య కేంద్రంగా మార్చుకొంటున్నారు."రైతులకు సేవలందించాల్సిన మార్కెట్ కమిటీలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. నిబంధనలు తుంగలో తొక్కి.. అక్రమ మార్గాల్లో పయనిస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్లలో వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను బహిరంగ మార్కెట్ కంటే అతి తక్కువ ధరలతో వ్యాపారులకు అప్పగించారు. కొందరు వ్యాపారులు రాజకీయ పలుకుబడితో.. మరికొందరు అధికారులకు పెద్దఎత్తున ముడుపులిచ్చి గోదాములను దక్కించుకున్నారు.జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 36,540 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 33 గోదాములు ఉన్నాయి. ఇందులో 20 బాడుగకు ఇచ్చారు. మరో 13 నిరుపయోగంగా ఉన్నాయి. కర్నూలు మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నచందంగా మారింది. రైతులకు ఉపయోగపడాల్సిన షెడ్డు.. వ్యాపారుల సొంతమవుతున్నాయి. వ్యాపారులు బయట దుకాణాలను అద్దెకు తీసుకుంటే ఒక నెలకు రూ.5-6 వేల అవుతుంది. అలాంటిది మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు నామమాత్రపు అద్దెలతో చేజిక్కించుకుంటున్నారు. మూడు, నాలుగు నెలల్లోనే షెడ్డు కాస్త.. వ్యాపారుల దుకాణాల సముదాయంగా మారుతోంది.కర్నూలు నగర నడిబొడ్డులో కొత్త బస్టాండు సమీపంలో పుచ్చలపల్లి సుందరయ్య జంక్షన్ వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములున్నాయి. మూడు గోదాముల్లోనే ఎరువుల నిల్వలున్నాయి. ఒకటి గోనె సంచుల వ్యాపారి కేటాయించగా.. మరో నాలుగు గోదాములను వ్యాపారులకు కేటాయించారు. ఎరువుల గోదాములు.. వ్యాపార కేంద్రాలకు అడ్డాగా మారాయి.కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతుల ఉపయోగార్థం ఏర్పాటుచేసిన గోదాములు వ్యాపారులు, ప్రైవేటు వ్యక్తుల పరమయ్యాయి. గతేడాది డిసెంబరులో ఓ గోదామును సోలార్ ప్యానల్స్ ఏజెన్సీకి అద్దెకు ఇచ్చారు. నెలకు రూ.44 వేలు అద్దె నిర్ణయించారు.

**రైతుల షెడ్డు.. మిర్చి వ్యాపారం**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని కూరగాయల మార్కెట్‌లో ఒకటో నంబరు గోదాము(షెడ్డు) ఎండుమిర్చి వ్యాపారుల సొంతమైంది. రాష్ట్రంలో ఎక్కడా వ్యాపారులకు దుకాణాల షెడ్లు కేటాయించిన దాఖలాలు లేవు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులకు నామమాత్రపు అద్దెలకు దుకాణాలు కేటాయించారు. షెడ్డు లోపల, బయట కలిపి మొత్తం 20 దుకాణాలకు వేలం పాట నిర్వహించి వ్యాపారులకు అప్పగించారు. నిబంధనల ప్రకారం దుకాణాల కోసం స్థలం కేటాయించాలన్నా.. బహిరంగ వేలం నిర్వహించాలన్నా.. వారం పది రోజుల ముందు ప్రకటన జారీ చేయాలి. ఆ తర్వాతే వేలం నిర్వహించి దుకాణాల కేటాయింపు చేయాలి. అలాంటివేమీ చేయకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు మిర్చి వ్యాపారులకు షెడ్డులో స్థలాలు కేటాయించారు. పెద్ద దుకాణాలకు ప్రతి నెలా అద్దె రూ.1,800 నుంచి రూ.1,900, చిన్న దుకాణాలకు రూ.1,300-రూ.1,500 వరకు ఖరారు చేసి వ్యాపారులకు అప్పగించారు.

# రండి.. మేం చూసుకుంటాం

భీమవరం: ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశాలకు ఇంకా కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల కాలేదు. కాని చాలా కళాశాలల్లో సీట్లు భర్తీ చేసుకునే పనిలో యాజమాన్యాలు నిమగ్నమయ్యాయి. ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల కావడంతో కళాశాలలు సీట్ల భర్తీకి తెరదీశాయి. ఇదే అదనుగా కావాల్సిన కళాశాలలో కోరిన కోర్సుల్లో సీట్లు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు సిద్ధమైపోయారు. కొంచెం పేరున్న కళాశాలల్లో చాలావరకు కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచీల్లో సీట్లు ఇప్పిస్తామంటూ మాయ చేస్తున్నారు.

గతేడాది తణుకు పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి తన కుమార్తెకు ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ సీటు కోసం మధ్యవర్తిని ఆశ్రయించి మోసపోయారు. జంగారెడ్డిగూడెంలో ఓ ప్రైవేటు ఉద్యోగి ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నా, చాలామంది తల్లిదండ్రులు ఎవరికీ చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారు. భీమవరంలో రెండేళ్ల కిందట ఇంజినీరింగ్‌లో సీట్లు ఇప్పిస్తామంటూ ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి రూ.లక్ష వరకు మోసం చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో ఏపీ ఈఏపీసెట్ లో ఇంజినీరింగ్ 8,330,



అగ్రికల్చర్ 3,360 మంది, ఏలూరు జిల్లాలో ఇంజినీరింగ్‌లో 3,409, అగ్రికల్చర్‌లో 1726 మంది అర్హత సాధించారు. కౌన్సెలింగ్ ప్రారంభమైన తర్వాత ర్యాంకు రాకపోతే, కోరుకున్న కళాశాలలో సీటు దక్కదని.. అప్పుడు బాధపడినా ప్రయోజనం ఉండదని విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. యాజమాన్యాలతో మాట్లాడుకుంటే ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దాన్ని మేనేజ్‌మెంట్ కోటా లేదా ఎన్నారై కోటాకు మార్చుకోవటానికి అవకాశం కల్పిస్తామంటూ మధ్యవర్తులు మభ్యపెడుతున్నారు. యాజమాన్యాలు సైతం సీట్లకు డొనేషన్లు, ఫీజులు వసూలు చేసుకునే పనిలో పడ్డాయి.

**ముందస్తు పేరుతో..** ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుందామని వేచిచూస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరక్కపోతే పరిస్థితి ఏంటనే సందిగ్ధతను తల్లిదండ్రుల్లో లేవనెత్తుతున్నారు. ముందస్తుగా కొంత అడ్వాన్స్ ముట్టచెబితే ఆయా కళాశాలల్లో సీటు సొంతమవుతుందని నమ్మబలుకుతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, వ్యవసాయ కోర్సులు చేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి బేరసారాలు చేస్తున్నారు. అడ్వాన్స్ ఇస్తే సీటు రిజర్వు చేస్తామంటూ మాయ చేస్తున్నారు.

# గండం గట్టెక్కినట్లే!

పాలకొల్లు : జిల్లాలో గోదావరి తీరాన పెనుగొండ, ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాలు ఉన్నాయి. శివారునున్న యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో గట్టు బలహీనంగా ఉండటంతో పలు ప్రాంతాలను ప్రమాదకర ప్రదేశాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో గట్టును పటిష్ఠ పరచాలని 2020లోనే అధికారులు నివేదికలు తయారు చేసినా గత వైకాపా ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో ప్రజలకు కష్టాలు తప్పలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడతగా యలమంచిలి మండలంలో గట్టు ఎత్తు పెంచి పటిష్ఠ పరచడానికి రూ.8 కోట్లు మంజూరు చేసింది. గడిచిన మూడు నెలల్లో ఆయా పనులు 80 శాతానికి పైగా పూర్తిచేశారు. మిగిలిన పనులకు నిధుల మంజూరు కోసం నిరీక్షిస్తుండగా తాజాగా విడుదలయ్యాయి.

యలమంచిలి మండలం బూరుగుపల్లి నుంచి దొడ్డిపట్ల వరకు పలుచోట్ల ఏటిగట్టు బలహీనంగా ఉండటంతో వరదల వేళ స్థానికులు కంటిమీద కునుకు లేకుండా కాపలా కాసేవారు. 2022, 2023 సమయంలో వచ్చిన వరుస వరదలకు గోదావరి నీరు పొంగుతూ ఏటిగట్టుపైకి చేరుతుంటే ప్రజలు శ్రమదానం చేసి ఇసుక మూటలు కట్టి వరదను నిలువరించారు. వరదొస్తుందంటే తీరానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఏటా ఆందోళన కనిపించేది. కూటమి ప్రభుత్వం



వచ్చాక దశలవారీగా ఏటిగట్టు పటిష్ఠ పనులు నిర్వహించడం ఊరటనిస్తుంది.

**రెండో విడతలో రూ. 8.94 కోట్లు**

మొదటి విడతలో కె.ఎస్.పాలెం నుంచి అబ్బిరాజుపాలెం వరకు పనులు చేయడానికి నిధులు మంజూరు చేశారు. రెండో విడతలో అబ్బిరాజుపాలెం నుంచి ఏనుగువానిలంక వరకు గట్టు బలహీన ప్రాంతాల్లో పటిష్ట పరచడానికి రూ.8.94 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 9న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నిధులు వినియోగించి లక్ష్మీపాలెం, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక ప్రాంతాల్లో పనులు చేయనున్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో పనులు పూర్తయితే వరద గండం నుంచి బయటపడవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

**వంతెనకు రూ.28 లక్షలు**

అబ్బిరాజుపాలెంలో బ్యాంకు కెనాల్ పైనుంచి ఏటిగట్టు వైపునకు వంతెన నిర్మాణానికి రూ.28 లక్షలు మంజూరయ్యాయి. ఆయా పనులకు టెండర్లు పిలిచి పనులు అప్పగించాల్సి ఉంది. దీనిపై ధవళేశ్వరం సెక్షన్ డీఈ సుబ్బారావును సంప్రదించగా గతంలో చేసిన ప్రతిపాదనలకు నిధులు విడుదలయ్యాయన్నారు. పనులు పూర్తయితే వరదలు నిలువరించగలిగే స్థితికి ఏటిగట్టు తయారవుతుందన్నారు.

# ఇప్పటికింతే..!

చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్.. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నా వారి వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. విదేశాలకు పెద్దగా ఎగుమతులు లేవని, ఉన్న గుజ్జునే తక్కువ ధరకు అమ్ముకున్నా కొనుగోలు చేసిన వ్యాపారుల నుంచి డబ్బులు రాలేదని నిర్వాహకులు అధికారులకు సమాధానమిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టన్నుకు రూ.6-7 వేలే ఇవ్వగలమని తెగేసి చెబుతున్నారు. మూడు- నాలుగు రోజుల తర్వాతే సర్కార్ ఆదేశించినట్టు టన్నుకు రూ.8 వేలు వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలోని గుజ్జు పరిశ్రమలు ఇప్పుడిప్పుడే ఉత్పత్తి ప్రారంభిస్తుండటంతో తోతాపురి రైతులు కర్మాగారాల బాట పడుతున్నారు. మార్కెట్‌లో అంతగా డిమాండ్ లేదని పదే పదే యాజమాన్యాలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ధరలు పడిపోకుండా యంత్రాంగం కదిలింది. అన్నదాతలకు ప్రభుత్వం నుంచి అదనంగా టన్నుకు రూ.4 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం వివరాలు సేకరిస్తోంది. పక్వానికి వచ్చే కాయలే పరిశ్రమలకు తేవాలని రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిఅవగాహన కల్పిస్తున్నారు. నెలాఖరు వరకు ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తేనే అన్నదాతలకు నష్టం వాటిల్లదు. మిగిలిన గుజ్జుపరిశ్రమలూ వీలైనంత త్వరగా తెరిస్తే మరికొంత గిట్టుబాటు ధర లభిస్తుంది.

**41కు 21 చోట్లే కార్యకలాపాలు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 41 గుజ్జు పరిశ్రమల్లో దాదాపు 20 ప్రారంభమయ్యాయి. మిగిలిన 21 కూడా త్వరగా కార్యకలాపాలు ప్రారంభించాలి. వీలైనంత త్వరగా ఇవి మొదలైతే రైతులకు పడిగాపులు పడే పరిస్థితి తప్పుతుంది. తమిళనాడులోని క్రిష్ణగిరి, ధర్మపురితోపాటు



మరో ఐదు జిల్లాల్లో ఈ నెలాఖరుతో తోతాపురి కోతలు ఆగిపోతాయి. అప్పటివరకు ధరలు పడిపోకుండా చూడాలి. తర్వాత పరిశ్రమల యాజమాన్యాలే తమకు మామిడి కావాలని రైతులను అడిగే పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా జులైలో 15 రోజుల పాటు కోతలు ఉంటాయి. ఆ సమయంలో ధరలు అధికంగా ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

**తేవాల్సినవి ఇవే..**

పరిశ్రమల వద్దకు తోతాపురి మామిడి తెచ్చే రైతులు వెంట ఆధార్ కార్డు జిరాక్సు, 1బీ/ పట్టాదారు పాస్ పుస్తకం/ అడంగల్ జిరాక్సు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకురావాలి. అప్పుడే ప్రభుత్వం అదనంగా ప్రకటించిన టన్నుకు రూ.4 వేల నగదు వారి ఖాతాలో జమ అవుతుంది.

**ర్యాంపుల వద్ద ఎలా?**

చిత్తూరు జిల్లాలో 35 ర్యాంపులున్నాయి. ఉమ్మడి జిల్లాలో వీటి సంఖ్య 50. పరిశ్రమలు, మండీలతో పోలిస్తే ఇక్కడ ధరలు మరింత తగ్గిస్తారు. వెంటనే డబ్బులు ఇస్తారనే ఉద్దేశంతో కొందరు ఇక్కడ విక్రయించేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇక్కడ గిట్టుబాటు ధర లభించేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలా? అని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రస్తుతానికి రెవెన్యూ యంత్రాంగాన్ని గుజ్జు పరిశ్రమల వద్ద మోహరించారు. రెండు- మూడు రోజుల అనంతరం ఇక్కడ కూడా సిబ్బందిని నియమించనున్నారు. వీలైనంత త్వరగా ఉంచితే నిర్వాహకులకు ఎంతోకొంత భయం వస్తుంది. ప్రభుత్వం ఇచ్చే ధరతో కలిపి టన్నుకు కనీసం రూ.10-11 వేలు లభిస్తుంది.

**తోతాపురికి రూ.6-7 వేలు**

మిగతా గుజ్జు పరిశ్రమలు తెరిస్తేనే గిట్టుబాటు

పకడ్బందీ చర్యలతోనే రైతులకు ఉపశమనం

# మా పంచాయతీలు బంగారం

చిత్తూరు : గ్రామ పంచాయతీలు స్వర్ణమయంగా మారనున్నాయి. అన్ని కుటుంబాలకు ఆధార్ సంఖ్యతో అనుసంధానిస్తున్నారు. పౌరులు చెల్లించే పన్నుల వివరాలు డిజిటలైజ్ చేయిస్తున్నారు. అన్ని చోట్లా ఇంటర్నెట్ సౌకర్యం ఉండటంతో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగవంతం చేసింది. గతంలో ఆదాయాన్ని కొందరు పంచాయతీ కార్యదర్శులు దారి మళ్లించేవారు. ఫలితంగా వారి చెక్ పవర్ రద్దయి, అభివృద్ధి పనులు కుంటుపడేవి. ప్రస్తుతం ఆధార్‌తో అనుసంధానం చేస్తే అన్ని రకాల పన్నుల వివరాలు పారదర్శకం అవుతాయి. పంచాయతీల్లో జరిగే ప్రతీ పని అందరికీ తెలుస్తుంది. జిల్లాలో స్వర్ణ పంచాయతీల ప్రక్రియ సాగుతోంది. 696 పంచాయతీల్లో 3,09,783 కుటుంబాలను ఇంటి యజమాని ఆధార్ నంబరుతో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇంటి పన్ను చెల్లించాలని గుమాస్తాలు,



కార్యదర్శులు ఇంటింటికి తిరిగేవారు. డిమాండ్ నోటీసులు జారీ చేసేవారు. ఇకపై ఆ ఇబ్బందులు తప్పనున్నాయి.

**30 రకాల సేవలు..** అన్ని సేవలు ఆన్‌లైన్‌లో లభించనున్నాయి. పౌరులు ఆన్‌లైన్‌లోనే బకాయి వివరాలు తెలుసుకుని ఇంటి, కుళాయి పన్ను, లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చు. పంచాయతీల్లో పన్నుల వసూళు వేగవంతం చేయడానికి, జవాబుదారీతనం కోసం ఇలా ఆన్‌లైన్ ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేస్తున్నారు. ఇంటి స్థలం సరిహద్దులు తదితర 30 రకాల వివరాలు స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తున్నారు. ఫలితంగా పౌరసేవల్లో వేగం, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా వస్తాయి.

**చిత్తూరు జిల్లా గణాంకాలు**

కుటుంబ యజమానులు: 2,82,970

ఆధార్‌తో అనుసంధానం:2,47,358 (87.41 శాతం)

ఉమ్మడి కుటుంబాల యజమానులు: 23,766

ఆధార్‌తో అనుసంధానం :15,423(64.9)

ప్రభుత్వ ఉద్యోగుల్లో యజమానులు : 3,117

ఆధార్‌తో అనుసంధానం : 1,845(59.19)

# కూటమి పాలనలో పరిశ్రమల పరంపర



పెనుకొండ : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పారిశ్రామిక పార్కుల్లో 41 నూతన పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులకు 1453.02 ఎకరాల భూమిని కేటాయించారు. జిల్లాలో ఐపీ(ఇండస్ట్రీయల్ పార్క్), యూడీఎల్(అన్‌డెవలప్డ్ ల్యాండ్), ఎంఎస్‌ఎంఈ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పేరుతో ఏపీఐఐసీ భూములు అభివృద్ధి చేసి, మడకశిర, గుడిపల్లి, ఆర్.అనంతపురం, అమ్మవారిపల్లి, ఎర్రమంచి, కప్పలబండ, గోళ్లాపురం, కొటిపి 8 పారిశ్రామిక వాడల్లో నూతన పరిశ్రమల కోసం స్థలం సిద్ధంగా ఉంచారు.

**యువతకు ఉపాధి అవకాశాలు**


జిల్లాలో రానున్న 41 నూతన పరిశ్రమల ద్వారా 6,192 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఇది పరోక్షంగా మరో 10 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే పలుచోట్ల పరిశ్రమలు నిర్మాణంలో ఉన్నాయి. మరికొన్ని పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి భూములకు నగదు చెల్లించి, పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూతన పరిశ్రమల ద్వారా జిల్లాకు రూ.4497.83 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. పరిశ్రమల రాకతో వలసలు తగ్గిపోయి స్థానికంగానే ఉపాధి పొందే అవకాశాలు మెరుగయ్యాయి. ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడంతో చిన్నతరహా పరిశ్రమలు స్థా.పించేందుకు, చిరువ్యాపారులే పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి మంచి అవకాశం లభించింది. పెనుకొండ నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కోసం సీడ్‌యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి పరిశ్రమలు స్థాపింపజేసి పారిశ్రామిక వేత్తలగా తయారు చేయనున్నారు.

**చిరు వ్యాపారులకు సైతం ఆదాయం**

గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క పరిశ్రమ రాలేదు. ప్రస్తుతం నూతన పరిశ్రమలు రావడం వల్ల సొంతూళ్లలోనే యువతకు ఉపాధి లభిస్తుంది. ఉపాధితో పాటు స్థానికంగా వ్యాపారాలు, భూమి ధరలు, ఇళ్ల అద్దెలు, వాహనాలు, స్థలాల అద్దెలు పెరుగుతాయి. చిరువ్యాపారులకు సైతం ఆదాయం పెరుగుతుంది. పరిశ్రమలు రావడం సంతోషంగా ఉంది.

ప్రశాంత్, పెనుకొండ

# దివ్యమైన ప్రయోజనం!




అనంతపురం : దివ్యాంగులు, వయోవృద్ధులకు దివ్యమైన ప్రయోజనం చేకూర్చే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపింది. 2019 తర్వాత దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఇవ్వడానికి ఎంపిక శిబిరాలు నిర్వహించలేదు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలిమ్‌కో) ద్వారా సహాయ పరికరాలు అందివ్వాలని నిర్ణయించారు. అనంతపురం జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో ఒకరోజు చొప్పున ఈనెల 12న ప్రారంభమైన శిబిరాలు 18 వరకు కొనసాగించనున్నారు. అనంతపురం జిల్లాలో 50వేల మంది వరకు వివిధ రకాల కేటగిరీలకు చెందిన దివ్యాంగులు ఉన్నారు. ఇందులో కనీసం 6 వేల నుంచి 7 వేల మంది వరకు సహాయ పరికరాలు అవసరం ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమశాఖ అంచనా వేసింది.


**సహాయ పరికరాలు ఇవే**

పలురకాల దివ్యాంగులకు సహాయ పరికరాలు ఇవ్వడానికి గుర్తిస్తారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్లు, రోలేటర్స్, ఎం.ఎస్.కిట్లు, అంధులకు చేతి వాచీ, చేతి కర్రలు, వాయిస్ ఫోన్, ఎల్బో క్రచస్, లెప్రసీ బాగైన వ్యాధిగ్రస్థులకు కిట్లు, డైసీ ప్లేయర్, యం.యస్.ఐడీ కిట్స్, స్మార్ట్ కేన్, కృత్రిమ అవయవాలు తదితర ఉపకరణాలు ఇవ్వడానికి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. ఎంపిక అనంతరం మళ్లీ ప్రత్యేకంగా క్యాంపు నిర్వహించి ఉచితంగా అందజేస్తారు.

**అర్హతలు.. అవసరమైనవి..**

క్యాంపులకు హాజరయ్యే వారు యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, సదరం వైద్య ధ్రువీకరణ, రేషన్‌కార్డు తదితరాలను రెండుసెట్ల జిరాక్స్ తీసుకొని రావాలి. ఫోటోలు-4, మొబైల్ నంబరు ఇవ్వాల్సి ఉంటుంది. దివ్యాంగులు, వయోవృద్ధులు వారి అనుకూలతను బట్టి నిర్ణీత తేదీల్లో ఏ నియోజకవర్గంలో అయినా హాజరు కావడానికి వెసులుబాటు ఉందని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు వినోద్ పేర్కొన్నారు.

# భారీ స్థాయిలో బదిలీలు



అనంతపురం : ముఖ్య శాఖల్లో అధికారులను భారీ స్థాయిలో బదిలీ చేశారు. ఈమేరకు ఆయా అయా శాఖల నుంచి ఉత్తర్వులు అందాయి.

**పట్టుపరిశ్రమ శాఖలో**

ఉమ్మడి జిల్లాలో జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారులను బదిలీ చేశారు. ఈమేరకు ఈ మేరకు ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి ఆంజనేయులును కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలులో పనిచేస్తున్న విజయకుమార్‌ను నియమించారు. హిందూపురంలో డీడీఎస్‌గా శ్రీనివాసులును (సీడ్) కదిరికి, శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి గోవిందప్పను (సీడ్) హిందూపురానికి, శ్రీసత్యసాయి జిల్లాలో డీఎస్‌వోగా పనిచేస్తున్న ఈశ్వరప్పను ధర్మవరానికి బదిలీ చేశారు.

**సహాయ సంచాలకులకూ...**

హిందూపురం అలివేలమ్మను అనంతపురానికి, అనంతపురంలో పద్మావతిని నంద్యాలకు, ధర్మవరం నుంచి గౌరిని అనంతపురానికి, హిందూపురం బాలసుబ్రహ్మణ్యంను రాయచోటికి, పెనుకొండలో పనిచేస్తున్న నాగభూషణంను మడకశిరకు, పెనుకొండలో రాజేశ్వరిని ధర్మవరానికి, హిందూపురం ముక్తాశ్రీ అనంతపురానికి, మడకశిరలో నవీన్‌కుమార్‌ను మదనపల్లికి, పుట్టపర్తి రేణుకను అనంతపురానికి, హిందూపురం లక్ష్మిరెడ్డిని కడపకు, కదిరి రామకృష్ణను కుప్పంకు, మడకశిర ప్రతాప్‌నాయక్‌ను పలమనేరుకు, కదిరి హాజీజ్‌ను హిందూపురానికి పెనుకొండ జయచంద్రారెడ్డిని కుప్పంకు, మడకశిర రాజశేఖర్‌ను కదిరికి, కళ్యాణదుర్గం ఫిరోజ్‌బాషాను పలమనేరుకు, అనంతపురం ఓబుళేసును పెనుకొండకు, హిందూపురం రవినాయక్‌ను మదనపల్లికి బదిలీ చేశారు.

**ఉద్యానశాఖలో...**జిల్లా ఉద్యానశాఖ ఉప సంచాలకులు అండాల్‌ను విజయవాడకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కర్నూలులో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవిని నియమించారు. ఏడీఏహెచ్ నరసింహారావును నెల్లూరుకు ఏడీహెచ్ పల్లవిని కుప్పంకు, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌ను కర్నూలుకు, అనంతపురానికి ఏడీహెచ్ దేవానందకుమార్‌ను, అనంతపురం మున్సిపాలిటీకి ఏడీహెచ్ రాధాకృష్ణారెడ్డిని బదిలీ చేశారు. హెచ్‌వోలు రాప్తాడుకు దివ్య, అనంతపురం గ్రామీణంకు రత్నకుమార్, నార్పలకు నెట్టికంటయ్య, ఉరవకొండకు యామినిని బదిలీ చేశారు.

**ఏవోల్లో ఉత్కంఠ** వ్యవసాయశాఖలో ఏవోలను బదిలీ జాబితా మంగళవారం ఉదయం జిల్లాకు చేరింది. మధ్యాహ్నం చిన్న చిన్న తప్పులు దొర్లాయి. సరిచేసి ఇస్తాం. అంతవరకు ఎవరినీ రిలీవ్ చేయొద్దు కొత్త స్థానాల్లో చేరకుండా చూడాలని జిల్లా జేడీఏకు సంక్షిప్త సందేశం రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చింది. దీంతో ఏవోల్లో ఉత్కంఠ నెలకుంది.

**మత్స్యశాఖలో**ఎంపీఆర్ డ్యాం మత్స్య అభివృద్ధి అధికారి ఆసీఫ్ బైరవానితిప్ప ప్రాజెక్టుకు, బైరవానితిప్ప ప్రాజెక్టులో మత్స్యఅభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణను ఎంపీఆర్ డ్యాంకు బదిలీ చేశారు. జిల్లా మత్స్యశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసులును అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య జిల్లా మత్స్యశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు నాగరాజును అనంతపురం జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు.

**ముఖ్య ప్రణాళికశాఖ ఏఎస్‌వోల వివరాలు..**

గార్లదిన్నె రాజ్యలక్ష్మి రాప్తాడుకు, డి.హీరేహాళ్ నరసింహులు విడపనకల్లుకు, అనంతపురం చంద్రప్రసాద్ విజయవాడకు, శింగనమల శ్రీనాగలక్ష్మి బుక్కరాయ సముద్రానికి యల్లనూరు నుంచి కల్పన తాడిపత్రికి, పుట్లూరు విజయకుమార్ గార్లదిన్నెకు, విడపనకల్లు పర్వతప్ప వజ్రకరూరుకు, కంబదూరు స్వప్న శెట్టూరుకు, గుత్తి శ్రీనివాసనాయక్ యాడికి, గుంతకల్లు సుభాషిణి శింగనమలకు, చిలమత్తూరు భార్గవి లేపాక్షికి, ముదిగుబ్బ చంద్రశేఖర్ నల్లచెరువుకు, రొద్దం వెంకటరమణ నంద్యాలకు, లేపాక్షి వలినాథ్‌రావు హిందూపురానికి బదిలీ చేశారు.**వ్యవసాయ శాఖలో**అనంతపురం ఆత్మా పీడీ మద్దిలేటిని నంద్యాల డీఆర్‌సీకి, అనంతపురం డీడీ(ఎస్సీ) శివప్రసాద్‌ను ఒంగోలు(ఎస్సీ) బదిలీ చేశారు. డివిజనల్ ఏడీఏలు వివరాలు.. హిందూపురం అల్తాఫ్ అలీఖాన్‌ను అనంతపురానికి, పుట్టపర్తి డీఆర్‌సీ సనావుల్లాను కదిరికి, రాయదుర్గం లక్ష్మానాయక్‌ను ధర్మవరానికి, ఉరవకొండ పద్మజను రాయదుర్గానికి, అనంతపురం రవిని తాడిపత్రికి, ధర్మవరం కృష్ణయ్యను హిందూపురానికి బదిలీ చేశారు.

# 'నాడు' విస్మరణ.. 'నేడు' అభివృద్ధి

బైరెడ్డిపల్లె : గ్రామీణ రోడ్ల అభివృద్ధిని నాటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పల్లె ప్రజలు ఐదేళ్లు కంకర రోడ్లపై నరక ప్రయాణం సాగించారు. కంకర దారుల్లో ప్రయాణం చేయలేకపోతున్నామని పాలకులు.. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. నిధులున్నా రోడ్లను అభివృద్ధి చేయలేక వదిలేయడంతో గ్రామీణ ప్రజల ప్రయాణ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. మండల పరిధిలో 12 గ్రామాలకు వెళ్లే రోడ్లకు తారు నిర్మాణం చేపట్టాలని గత తెదేపా ప్రభుత్వం కంకర పరచి అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల వైకాపా పాలనలో రోడ్లను పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఏడాదిలోపు అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గత 15 రోజులుగా కంకర రోడ్లపై తారు నిర్మాణ




పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఐదు గ్రామాల ప్రజలకు సౌకర్యం.. ఏటిగడ్డిండ్లు నుంచి గాజీపేట మీదుగా పెద్దచెల్లారగుంట క్రాస్ వరకూ తారు రోడ్డు నిర్మాణానికి 2018లో ప్రభుత్వం రూ.3.60 కోట్లు నిధులు మంజూరు చేసింది. తారు నిర్మాణానికి కంకర పనులు చేపట్టారు. వైకాపా పాలనలో విస్మరించింది. ఏటిగడ్డిండ్లు, తావడకుప్పం, మురారిపల్లె, గాజీపేట, పెద్దచెల్లారగుంట గ్రామాల ప్రజలు రాకపోకలకు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం పది రోజులుగా తారు పనులు పూర్తి చేయడంతో ప్రజల కష్టాలు తీరాయి.

**కూటమి పాలనలో తారు నిర్మాణం..** లక్కనపల్లె క్రాస్ నుంచి బురిశెట్టిపల్లె క్రాస్ వరకూ తారు రోడ్డు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వం రూ. 3.09 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా కంకర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎన్నికలయ్యాక వైకాపా ప్రభుత్వం గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోగా రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఐదేళ్లు కంకర మార్గంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తారు నిర్మాణ పనులు చేపట్టింది.

# లక్ష్య సాధనకు పరుగులు

పుంగనూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో సామూహిక గృహ ప్రవేశాలు రెండు సార్లు వాయిదా పడ్డాయి. ఈసారి వాయిదాల పర్వం కాకుండా ప్రతిష్ఠాత్మకంగా గృహ నిర్మాణ శాఖ సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని ఈ నెల 12న ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 10 నాటికే 3 లక్షల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆ శాఖ కృత నిశ్చయంతో ఉంది. ఈ లక్ష్య సాధనకు అధికారులు నియోజకవర్గ, డివిజన్, మండలస్థాయిలో సమీక్షలు నిర్వహించడం, లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడం, అదనపు సాయం వివరించడం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా పుంగనూరు, చిత్తూరు, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 77,366 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 51,360 ఇళు



పూర్తి చేశారు. 7,699 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. 18,307 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. గడువు సమయం ముంచుకొస్తుండటంతో లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో అధికారులు ప్రయత్నిస్తున్నారు. వారి కష్టానికి ఫలితం ఎలా ఉంటుందో వేచి చూద్దాం.

**లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం** జిల్లా వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న అదనపు సాయం వివరిస్తున్నాం. శాఖాపరమైన సహకారం అందిస్తూ నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం.గోపాల్ నాయక్, జిల్లా గృహనిర్మాణశాఖ, అధికారి, చిత్తూరు

# భవితకు నవోదయం !

పెదవేగి : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం.. పిల్లలకు విలువలు నేర్పడం.. వారిలో దాగున్న నైపుణ్యాలు పెంపొందించడం.. వీటన్నింటికీ నిలయం జవహర్ నవోదయ విద్యాలయం. ఇక్కడ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధన సాగుతోంది. పెదవేగి నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 1న ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి గడువు జులై 29. ఈ ఏడాది డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

**అర్హులు వీరే...**విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-26 మధ్య అయిదో తరగతి చదివి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల కోటాలో చేరాలనుకునే విద్యార్థులు 3, 4, 5 తరగతుల్లో ఆయా ప్రాంతాల్లోనే విద్యాభ్యాసం చేసుండాలి. మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు.

**వంద మార్కుల పరీక్ష..**

నవోదయలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు ప్రశ్నలుంటాయి. మెంటల్ ఎబిలిటీ 40 ప్రశ్నలకు 50 మార్కులు, అర్థమెటిక్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులు, లాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులుంటాయి.

**సౌకర్యాలు మెండు**కేంద్ర ప్రభుత్వం 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించి.. పెదవేగిలో నెలకొల్పింది. ఇక్కడ ప్రవేశం లభిస్తే విద్యార్థి భవిష్యత్తు మెరుగ్గా ఉంటుంది. 6 నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్యనందిస్తారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి సదుపాయం కల్పిస్తారు. విద్యా బోధనతోపాటు వసతి, ఆహారం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, పాదరక్షలు తదితరాలన్నీ ఉచితమే. కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం తదితర సౌకర్యాలన్నీ ఉన్నాయి.**ప్రతిభ ఆధారంగా..**సుధీర్‌కుమార్, ఇన్‌ఛార్జి ప్రధానాచార్యుడు, జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సమయం సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ప్రశ్నాపత్రం తయారీ నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. ఎంపిక పారదర్శకంగా ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలుంటాయి.

# సైబర్ ఉచ్చు.. జీవితాల్లో చిచ్చు

కర్నూలు : వృద్ధులను, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతుండటంతో చాలా కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. ఇటువంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. బ్యాంకు ఖాతాల్లో ఎక్కువ నిల్వలు ఉంచుకున్న, సెల్‌ఫోన్ వినియోగించే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను తొలుత నేరగాళ్లు గుర్తిస్తున్నారు. వారితో మాటలు కలిపి వారి ఖాతాల నుంచి డబ్బుల్ని దోచేస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహనలేని వారిని గుర్తించి ఆశపెడుతున్నారు. దారిలోకి రాకపోతే భయపెట్టి డబ్బుల్ని దోచేస్తున్నారు. ప్రశాంత జీవితం గడపాల్సిన సమయంలో వృద్ధులు సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో పడి మానసిక కల్లోలానికి గురవుతున్నారు.

**జిల్లాలో జరిగిన సంఘటనలు ఇవీ..**
కర్నూలు వెంకటరమణకాలనీకి చెందిన 80 ఏళ్ల విశ్రాంత పంచాయతీ రాజ్‌శాఖ ఇంజినీరు ఎం.సుధీంధర్‌రావును ఓ ప్రైవేట్ గ్రూపులో చేరమని ఆయన చరవాణికి సందేశాన్ని పంపించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో లాభాలు పొందొచ్చని, కొంత డబ్బు చెల్లించాలనడంతో ఆయన రూ.2 లక్షలను వారు సూచించిన ఖాతాకు పంపించారు. తర్వాత ఆ గ్రూప్ నుంచి ఓ మహిళ ఫోన్‌చేసి 'బీఆర్ బ్లాక్స్ మార్క్స్' అనే ట్రేడింగ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పడంతో ఆయన అలా చేశారు. తర్వాత వారు సూచించిన ఖాతాలకు రూ.54,44,430 పంపించారు. చివరికి మోసపోయినట్లు గుర్తించారు.
కర్నూలులోని పెద్దమార్కెట్‌కాలనీకి చెందిన ఓ మహిళ న్యాయశాఖలో పనిచేసి 2017లో ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేయడంతో వచ్చిన డబ్బును బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసుకున్నారు. ఒంటరిగా జీవిస్తున్న ఆమెకు సైబర్ నేరగాడు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని, క్రెడిట్‌కార్డు తీసుకోమని అడిగాడు. తాను ఉద్యోగవిరమణ చేయగా వచ్చిన డబ్బును ఫిక్స్‌డ్ చేశానని, తనకు క్రెడిట్‌కార్డు అక్కరలేదని ఆమె చెప్పారు. తర్వాత కొన్ని రోజులకు సైబర్‌నేరగాడు ఫోన్ చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎస్పైని మాట్లాడుతున్నానని, అక్రమ డబ్బు, నకిలీ నోట్ల కేసుల్లో అరెస్టు వారెంట్



మీపైన జారీ అయ్యిందని బెదిరించారు. భయపడిన ఆమె అతడు చెప్పిన ఖాతాకు తొలుత రూ.45 లక్షలు, మరోసారి రూ.8.50 లక్షలు పంపించారు. మొత్తంగా సైబర్‌నేరగాళ్లు ఆమెను భయపెట్టి రూ.53.50 లక్షలు కాజేశారు.

**ఆ ఖాతాలపైనే కన్ను**
విశ్రాంత ప్రభుత్వ అధికారులకు ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన ప్రయోజనాలను ఖాతాల్లో జమ చేసి కాలం వెళ్లదీస్తుంటారని సైబర్ నేరగాళ్లు గుర్తిస్తున్నారు. ఖాతాల్లో నిల్వ ఉంచుకున్న డబ్బుకు తోడు ప్రతి నెలా పింఛను జమ అవుతూ ఉంటోంది. శాఖలు, హోదాలను బట్టి వారు ఖాతాల్లో ఎంత మేర డబ్బు ఉంటుందో సైబర్‌నేరగాళ్లు అంచనా వేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు సెల్‌ఫోన్ వినియోగిస్తుండటం సైబర్‌నేరగాళ్లకు అవకాశంగా మారుతోంది. అధికలాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడి పెట్టించటం, అక్రమాస్తులు కలిగిఉన్నారని బెదిరించి వివిధ మార్గాల్లో డబ్బులను దోచేస్తున్నారు. మోసపోయిన బాధితులు చాలామంది కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక..పోలీసులకు ఫిర్యాదు చేయలేక కుమిలిపోతున్నారు.

**సమాచారం ఎలా సేకరిస్తున్నారు..**
సైబర్‌నేరగాళ్లు పలు మార్గాల్లో విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. తెలిసిన బ్యాంకు ఉద్యోగులు, పనిచేసి మానుకున్న వారి నుంచి వివరాలు తెలుసుకుంటున్నారు. కొందరు సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేసి మాయమాటలు చెప్పి ఏదో ఒక సర్వే పేరు చెప్పి వివరాలు అడుగుతున్నారు. ఈక్రమంలో విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సమాచారం సేకరిస్తున్నారు. పనిచేసిన శాఖలు, హోదాలను బట్టి వారి ఖాతాల్లో ఉండే డబ్బు అంచనా వేసుకుని వారి సెల్‌ఫోన్ నంబర్లు తెలుసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పగానే ఠించను తీసుకునే వృద్ధులు నమ్మి అన్ని వివరాలు చెప్పేస్తున్నారు.

**పోలీసుల సూచన**
విశ్రాంత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాలని పోలీసుఅధికారులు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు పంపిన లింకులు, చేసిన ఫోన్‌కాల్స్‌ను నమొద్దంటున్నారు. అలాంటి సమాచారం, ఫోన్‌కాల్స్‌ను తొందరపడి నమ్మకుండా మొదట నిర్ధారించుకోవాలన్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లయితే వెంటనే 1930 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలంటున్నారు.

# అతివల 'ఉన్నతి'కి లేదు వడ్డీ

ఒంగోలు : స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధితో రాణించా లన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే మహిళల జీవనోపాధుల కింద బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు.. రాయితీలు అందజేస్తోంది. ఆయా సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేయూతనందించేలా 'ఉన్నతి' కార్యక్రమం కింద వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే అమలవుతున్న ఈ పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో రుణాల మంజూరుకు సంబంధించి నెలల తరబడి జాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని గాడిలో పెట్టింది. గతంలో యూనిట్ లేకున్నా సొంత అవసరాలకు వినియోగించుకునేవారు. ఇప్పుడు ఉపాధి యూనిట్ల ఏర్పాటు తప్పనిసరి చేశారు. 1,611 మంది మహిళలు.. గరిష్ఠంగా రూ.3 లక్షలు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉన్నతి పథకం కింద జిల్లాలోని 1,611 మంది మహిళలకు రుణం అందించేలా ప్రణాళిక చేశారు. ఏర్పాటు చేసే యూనిట్ ఆధారంగా ఒక్కో మహిళకు రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారు. రుణం మొత్తానికి అనుగుణంగా నెలవారీ చెల్లింపునకు సంబంధించి కాల పరిమితి నిర్ణయిస్తారు. రూ.50 వేల రుణానికైతే 24 నెలలుబీ రూ.2 లేదా రూ.3 లక్షలు అయితే 48 నెలలపాటు వాయిదాలు చెల్లించేలా గడువు విధించనున్నారు. వడ్డీ లేని రుణాలు కావడంతో నిర్దిష్ట గడువులోపు చెల్లించాలి. లేకపోతే అపరాధ రుసుము విధిస్తారు. మహిళలు ఏదైనా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండాలి. గ్రామ సంఘాల్లో తీర్మానం చేసి సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. సభ్యులు ఎంపిక చేసుకున్న యూనిట్ ఆధారంగా రుణం మంజూరుకు లబ్ధిదారులను డీఆర్డీఏ అధికారులు ఎంపిక చేస్తారు.

# సౌర.. ఔరా అనిపించలేరా?



తిరుపతి : క్షేత్రస్థాయిలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ముందుగానే వినియోగదారులు డబ్బు చెల్లించేందుకు నిరాసక్తత వ్యక్తం చేయడం.. అధికారులు అంతగా అవగాహన కల్పించనందున పౌరులు తమ గృహాలపై సౌర ఫలకాలు అమర్చేందుకు ముందుకు రావడం లేదు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేస్తేనే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవేరుతుంది. గతేడాది ఫిబ్రవరి 13న కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించింది. ఇంటి పై కప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుంటే కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ వస్తుందని ప్రకటించారు. వినియోగదారులు ముందుగా జాతీయ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యుత్తు బిల్లు, బ్యాంకు ఖాతా, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి నిర్ణీత ఫీజు చెల్లించి డిస్కంకు దరఖాస్తు ఇవ్వాలి. ఎం- ప్యానల్ చేసుకున్న కంపెనీల నుంచి ఎంచుకున్న కిలోవాట్ల సామర్థ్యానికి అనుగుణంగా డబ్బులు కట్టాలి. ప్రాజెక్టు ఏర్పాటయ్యాక ఫొటోలు అప్‌లోడ్ చేస్తే డిస్కం అధికారులు పరిశీలించి స్మార్ట్‌మీటర్ బిగిస్తారు. ఇది పూర్తయిన 15 రోజుల్లో కేంద్రం నుంచి వచ్చే రాయితీ సొమ్ము వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

**చిత్తూరు జిల్లాలో కేవలం 268..**
చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు 49,947 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలు 47,500 మంది ఉన్నారు. ప్రస్తుతానికి కేవలం 268 గృహాలపైనే సౌర ఫలకాలు ఏర్పాటయ్యాయి. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పైలట్ గ్రామంగా ప్రారంభించిన కుప్పం మండలం నడిమూరులోనే 95 ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 6న కుప్పంలో ఈ ప్రాజెక్టు మొదలుకాగా వేగవంతంగా పరికరాలు అమరుస్తారని భావించినప్పటికీ నెమ్మదిగా పనులు జరుగుతున్నాయి.

**ఎస్సీ, ఎస్టీల దరఖాస్తులు కలిపితేనే..**
తిరుపతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలతో కలుపుకొని 63,534 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సుమారు 60వేలు ఎస్సీ, ఎస్టీలవే. ప్రస్తుతం వీరికి సౌర ఫలకాలు అమర్చేందుకు అయ్యే వ్యయం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీగా ఇవ్వనుండటంతో ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయి. త్వరలోనే వీటికి టెండర్లు పిలిచి పై కప్పులపై పరికరాలు ఏర్పాటు చేస్తారు. ముందుగానే నగదు చెల్లించాలనే నిబంధన కారణంగా మిగతా వర్గాలు పెద్దగా ముందుకు రావడంలేదు. దీనికి తోడు రాయితీల గురించి అంతగా అవగాహన లేదు. ఎస్పీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులు దీనిపై ఆయా వర్గాల అనుమానాలు నివృత్తి చేయాలి.

**నారావారిపల్లిలో భేష్**
సీఎం చంద్రబాబు స్వగ్రామం చంద్రగిరి మండలం నారావారిపల్లి క్లస్టర్‌లో మాత్రం పురోగతి బాగుంది. ఇక్కడ 2,300 గృహాలున్నాయి. రూఫ్‌టాప్ లేనివి, ఒకరికే రెండు- మూడు కనెక్షన్లు ఉన్నవి మినహాయిస్తే 1,600 ఇళ్లున్నాయి. వీటన్నింటిపై సౌర ఫలకాలు అమర్చారు. తిరుపతి జిల్లాలో 2,094 ఇళ్లపై పరికరాలు అమర్చగా ఇందులో సింహభాగం నారావారిపల్లిలోనే ఉండటం గమనార్హం.

# పాత కుంట.. పాపపు పంట



కుప్పం : మా ప్రభుత్వం వచ్చింది.. మాకు ఏదైనా ఉపాధి చూపండి సారూ.. అని అడిగితే సీఎం నియోజకవర్గం. ఇక్కడ ఏ చిన్న తప్పూ చేయలేమని ఉపాధి సిబ్బంది నుంచి ఎదురవుతున్న సమాధానం. బయటకు నీతులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చాపకింద నీరులా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. కొద్ది రోజుల కిందట అటవీ శాఖ అధికారులు నిధులు దోచేశారు. తాజాగా ఓ చెరువులోని చేపల కుంటలనే మళ్లీ తవ్వినట్లు చూపుతూ నిధులు గోల్‌మాల్ చేశారు. ఉపాధి పథకంలో తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కూలీల పేరుతో స్వాహా: చెరువులో గతంలో తవ్విన చేపల కుంటలనే మళ్లీ తవ్వేలా 2025-26లో పనులు మంజూరు చేయించారు. ఫలితంగా పాత కుంటకు కొత్త మెరుగులు దిద్ది కూలీల పేరుతో బిల్లులు స్వాహాకు బరి తెగించారు. ఇంత జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పనులన్నీ పారదర్శకమేనని అధికారులు బుకాయిస్తున్నారు.

**ఆ చెరువులో ఆరు చేపల కుంటలు:** కుప్పం మండలం వసనాడు చెరువులో 2019-20, 2022-23లో రెండు చేపల కుంటల పనులు పూర్తయినట్లు ఉపాధి హామీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మళ్లీ 2023-24, 2024-25కు గాను రెండింటిని మంజూరు చేశారు. తాజాగా 2025-26 సంబంధించి రెండు చేపల కుంటలు మంజూరు చేశారు. ఇందులో వర్కు ఐడీ ఎఫ్ఆర్ 999900317927 8కు సంబంధించి పనులు జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మే 3న రికార్డులు పరిశీలించగా మస్టర్ సంఖ్యలు 1394, 1395, 1396లో 20 మంది కూలీలకు హాజరు వేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పాత కుంటకే మెరుగులు దిద్దుతున్నట్లు కనిపిస్తోంది.

**ఇక్కడ కొత్తేమీ కాదు:** కుప్పం మండలం నడుమూరు నర్సరీలో 20 వేల బ్యాగులకు మట్టిని నింపే పనులను ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు హాజరైనట్లు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేశారు. ఆ చిత్రం పరిశీలిస్తే మహిళలు కనిపించరు. తీరా వారంతా ప్రతినెలా అటవీశాఖ నుంచి రూ.10 వేల చొప్పున జీతం అందుకుంటున్న వాచర్ల అని తెలిసింది.

**తనిఖీ బాధ్యత ఏపీవోదే.. - విజయదత్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, కుప్పం**
పనులన్నీ తనిఖీ చేయడం వీలుకాదు. ఆ బాధ్యత చూసుకోవాల్సింది ఏపీవోదే. అక్రమాలు జరిగితే చర్యలకు సిఫార్సులు చేస్తాం.

**పరిశీలించి చర్యలు- వెంకటరత్నం, ఏపీడీ, కుప్పం**
ఉపాధి పనులకు కూలీలు రావడంలేదు. ఒకటి, రెండు చోట్ల ఇలాంటి తప్పులు జరిగిఉండొచ్చేమో. నేను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటా.

# ఎంఎస్ఎంఈలు.. ఉపాధి నిలయాలు

పలమనేరు : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎస్ఈ) స్థాపనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఈ తరహా పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ వెంటనే ఏపీఐఐసీ అధికారులు రంగంలోకి దిగారు. అనువైన స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో పార్కులు ప్రారంభించగా.. చిత్తూరు, పుంగనూరు, జీడీ నెల్లూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో స్థల సేకరణ దశలో ఉంది.
త్రిరాష్ట్ర కూడలి అనుకూలం: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు నియోజకవర్గాలైన కుప్పం, పలమనేరులో మొదట ఈ పార్కులు ప్రారంభించారు. సీఎం చెప్పిన వారంలోగా స్థలాలు గుర్తించి ఖరారు చేశారు. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు వేగంగా సాగుతున్నాయి. మరో వైపు రెండు విమానాశ్రయాలు, పోర్టు అందుబాటులో ఉంటాయి. అదే సమయంలో పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు సులభంగా అనుమతులు మంజూరు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు చోట్లకు పరిశ్రమలు తరలివస్తాయని అధికారులు చెబుతున్నారు. గుడుపల్లె మండలంలో 38.78 ఎకరాల్లో: మొదటగా కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం పొగురుపల్లి వద్ద 38.78 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇక్కడ దాదాపు 250 వరకు సంస్థలు ఏర్పాటు చేసేలా ప్లాట్లుగా మార్చుతున్నారు. ఒక్కొక్కటి 300 చదరపు మీటర్లలో ఉంటుంది. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా.. అనుమతులు ఇస్తున్నారు. దీనికోసం ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ నూతన విధానంలో విద్యుత్తు, రహదారులు, నీరు తదితర మౌలిక వసతులు ప్రభుత్వమే కల్పిస్తుంది.




పారిశ్రామికవేత్తలు రావడం.. వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టెక్స్‌టైల్, ఫ్లోర్‌మిల్ వంటివి ఇక్కడ రాగానే వెంటనే మొదలు పెట్టుకుంటారు.
పలమనేరులో రూ.15.27 కోట్లతో: ఈ నెల 8న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నాగమంగళం వద్ద 3.85 ఎకరాల స్థలంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. రూ.15.27 కోట్లతో ఏపీఐఐసీ మౌలిక వసతులు కల్పించనుంది. 2018లో తెదేపా హయాంలో మంత్రిగా అమరనాథరెడ్డి.. ఇక్కడ పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. దాదాపు 250 ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించారు. ఇప్పటికే పదుల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2028 నాటికి అన్ని చోట్ల ప్రారంభించనున్నారు.
సద్వినియోగం చేసుకోవాలి- సుబ్బారావు, ఏపీఐఐసీ జెడ్ఎం
జిల్లాలో పరిశ్రమలు స్థాపించాలనుకునే ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేస్తాం.

# వసతికి గ్రహణం

నంద్యాల : సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు గ్రహణం పట్టింది. వేసవి సెలవుల్లో పనులు పూర్తిచేసి సౌకర్యాలు మెరుగుపరుస్తారని ఆశించిన విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల నిర్వహణకు నిధులివ్వలేదు. దీంతో హాస్టళ్లు సమస్యల నిలయాలుగా మారాయి. విద్యార్థులు పడుతున్న అవస్థలు గుర్తించిన కూటమి ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధులు కేటాయించింది. మార్చిలో ప్రారంభమయ్యాయి. నిధులివ్వకపోవడంతో గుత్తేదారులు అర్ధంతరంగా ఆపేశారు. కేటాయింపులు గత ఆర్థిక సంవత్సరం పద్దుల్లో చేర్చకపోవడమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం 2025- 26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచి కేటాయింపులు సమాలోచనలు జరుగుతున్నాయి.

**చేసినవి నాసిరకమే**
వసతిగృహాల్లో ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో నాణ్యత కరవైంది. మరుగుదొడ్లలో నాసిరకం కుళాయిలు వేశారు. కొన్నిచోట్ల ఆరు కుళాయిలు అవసరం రెండే ఏర్పాటు చేశారు. నంద్యాల కళాశాల బాలుర వసతిగృహం-1లో 14 కుళాయిలకు ఆరు మాత్రమే అమర్చారు. ఇదే ప్రాంగణంలోని వసతిగృహం-2లో కూడా అవసరమైనన్ని



కుళాయిలు ఏర్పాటు చేయలేదు. ఫ్లోరింగ్ పనులను తూతూమంత్రంగా చేశారు. పనులపై పర్యవేక్షణ కొరవడింది.

**చేయాల్సిన పనులివే**
ఉమ్మడి జిల్లాలోని 55 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చిన్న, పెద్ద మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీటితో మరుగుదొడ్ల మరమ్మతులు, రన్నింగ్ వాటర్, తాగునీటి సరఫరా, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటుతో పాటు ఎల్ఈడీల అమరిక తదితర విద్యుదీకరణ పనులు, దోమల నివారణకు మెష్‌ల ఏర్పాటు, తలుపులు, కిటకీలు, పైకప్పు, ఫ్లోరింగ్‌కు మరమ్మతులు, బాలికల వసతిగృహాలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో రూ.16.19 కోట్లు కేటాయించారు. కర్నూలు నియోజకవర్గంలో 3, ఆదోని 4, ఆలూరు 3, పత్తికొండ 6, కోడుమూరు 2, ఎమ్మిగనూరులో 1, పాణ్యం 6, నంద్యాల 5, డోన్ 4, ఆళ్లగడ్డ 5, బనగానపల్లి 5, శ్రీశైలంలో నాలుగు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 7 వసతిగృహాల్లో పనులు ప్రారంభించారు.

**అర్ధంతరంగా వదిలేశారు**
2025- 26 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోగా వసతిగృహాల్లో పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ శాఖలకు బాధ్యతలు అప్పగించింది. నంద్యాల జిల్లాలోని 20 మండలాల్లోని 31 వసతి గృహాల పర్యవేక్షణను ఏపీఈడబ్ల్యూఐడీసీ, సమగ్ర శిక్షా అభియాన్, ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు కట్టబెట్టారు. కర్నూలు జిల్లాలోని 13 మండలాల్లో ఉన్న 24 వసతిగృహాల పనులను ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ శాఖలు పర్యవేక్షిస్తున్నాయి. మార్చిలో పనుల ప్రారంభించి జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రెండు జిల్లాల్లో ఎక్కడా పనులు పూర్తి కాలేదు. చాలా వసతిగృహాల్లో 50 శాతం కూడా చేయకుండానే గుత్తేదారులు చేతులెత్తేశారు.

# జూన్ చివరి నాటికి వెలిగొండ పూర్తి లక్ష్యం

ఒంగోలు : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు జూన్ ఆఖరు నాటికి పూర్తికావాలని జల వనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఇంజినీర్లను ఆదేశించారు. వెలిగొండ, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, గుండ్లకమ్మ జలాశయం ఇంజినీర్లతో ఒంగోలులోని ఎన్నెస్పీ అతిథి గృహంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా కొంతసేపు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ ఆఖరున వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున ఆ లోపు సొరంగాలు, ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. గుత్తేదారులను పిలిపించి నిర్దిష్ట గడువులో పు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వెలిగొండ ఎస్ఈని



ఆదేశించారు. రెండు సొరంగాల పనులు ఎంతవరకు వచ్చాయి.. ఇంకా ఏమేమి చేపట్టాల్సి ఉంది.. నిధుల లభ్యత, ఇంకా ఎంత అవసరం అనే అంశాలపై ఇంజినీర్లతో చర్చించారు. సాగర్ నీరు త్వరలో విడుదల చేస్తున్నందున తాగునీటి అవసరాలకు చెరువులు నింపుకొనేలా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఈ శ్యాంప్రసాద్, వెలిగొండ ఎస్ఈ నాగమురళీ మోహన్, మార్కాపురం, కంభం, దోర్నాల ప్రాజెక్టు అధికారులు అబుద్‌అలీ, అప్పారావు, శ్రీనివాసరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# తవ్వేస్తా.. అడ్డుకుంటే తరిమేస్తా..!

రేణిగుంట : వైకాపా హయాంలో రేణిగుంట మండలంలో కొన్ని చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే.. మరి కొన్ని చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇదే పంథాను ఓ కూటమి నేత అనుసరిస్తున్నాడు. అడ్డుకున్న యంత్రాంగాన్ని బెదిరించి అక్కడి నుంచి తరిమేస్తున్నాడు. ఇందుకు రేణిగుంట మండలం ఆర్పీ అగ్రహారం చెరువే ఉదాహరణ.రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లె–ఆర్.మల్లవరం మధ్యలో ఉన్న ఆర్పీ అగ్రహారం చెరువు మట్టిపై ఓ భాజపా నేత కన్నేశాడు. తిరుపతికి చెందిన ఓ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వారు ఇక్కడ సుమారు 40 ఎకరాల భూమి కొన్నారు. దాన్ని చదును చేయాలని భావించగా.. ఆ బాధ్యతను సదరు భాజపా నేత తీసుకున్నారు.



గుత్తేదారు అవతారమెత్తిన ఆయన రెండు రోజులుగా రాత్రుళ్లు జేసీబీలు పెట్టి చెరువు మట్టి తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నాడు. ఒక టిప్పర్‌కు సుమారు రూ.10 వేలు చొప్పున వసూలు చేస్తున్నాడు.

**అడ్డుకున్నా.. ఆగట్లేదు** ఇక్కడ మట్టి తవ్వకాలతో చెరువు రూపురేఖలు మారిపోయాయి. జాతీయ రహదారిని ఈ చెరువుపైనే కాస్త నిర్మించారు. వంతెన కింద సమీపంలో చేపడుతున్న మట్టి తవ్వకాలతో భవిష్యత్తులో వంతెనకు ఇబ్బంది తప్పదు. స్థానిక రెవెన్యూ సిబ్బంది అడ్డుకోగా బదిలీ చేయిస్తానని వారిని బెదిరించడంతో చేసేదేమీలేక వెనుదిరిగారు. ఈ అంశంపై మండల ఇరిగేషన్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా పలుమార్లు ఇక్కడ అడ్డుకున్నామని, అయినా మట్టి తవ్వుతున్నారని తెలిపారు.

# యంత్రాంగం కదిలింది..!

భీమిలి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మహా విశాఖ నగర పాలక సంస్థ అధికార యంత్రాంగం కదిలింది. వచ్చి ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. ఉదయం నుంచి జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భీమిలి, మధురవాడ, మద్దిలపాలెం, పాతనగరం, గాజువాక, మల్కాపురం, వేపగుంట తదితర చోట్ల 42 ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుభ్రత పనులు చేశారు. కాలువల్లో పూడికలు తీసి, దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. నీటి సరఫరా తక్కువగా ఉన్న ప్రాంతాలపై నివేదిక సమర్పించాలని నీటి సరఫరా పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్.రవి ఆదేశాలతో ... సహాయ



ఇంజినీర్లు ఆయా ప్రాంతాల వివరాలతో పాటు, కారణాలు తెలియజేస్తూ నివేదిక సిద్ధం చేస్తున్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి ఎంత మంది లబ్ధిదారులకు నిధులు వెనక్కి చెల్లించాలన్న అంశాలపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, టెండర్లకు కాస్త సమయం పడుతుందని మేయరు పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఆయా సమస్యల్నీ త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

# బిడ్డల సంరక్షణకు శ్రీకారం!

పుత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం పిల్లల సంరక్షణకు సంబంధించి దృష్టి సారించింది. ఈ మేరకు ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. తద్వారా చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ నుంచి ఊరట లభించనుంది. గతంలో తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్లు పథకాన్ని అమలు చేసింది. 2019ల వైకాపా అధికారంలోకి వచ్చాక పేరు మార్చింది. అనంతరం 2021లోనే ఈ పథకానికి స్వస్తి పలికింది. ఇది చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోందని భావించిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏటా సుమారు 38 వేల ప్రసవాలు జరుగుతాయి. ఈ మేరకు ఏడాదికి సుమారు రూ.5.35 కోట్లను ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు




వ్యయం చేయనుంది. ఈ బేబీ కిట్‌లో 11 రకాల వస్తువులుంటాయి. దోమతెర, బేబీబెడ్, వాటర్‌ప్రూఫ్ కాట్, బేబీ డ్రస్, జేబు రుమాళ్లు, పౌడర్, షాంపూ, ఆయిల్, సబ్బు తదితర వస్తువులుంటాయి. ఒక్కో కిట్టు విలువ రూ.1,410 ఉంటుంది.

**పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట..**

ఆర్థిక స్థోమత లేని వారంతా కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకుంటుంటారు. కనీసం ప్రసవం అనంతరం పిల్లలకు చిన్నపాటి బెడ్ కూడా కొనలేని వారికి ఈ పథకం ఎంతో ఉపయోగకరం. పేదలు, మధ్య తరగతి ప్రజలు గర్భం దాల్చిన నాటి నుంచి కూడా ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో సిజేరియన్ ప్రసవాలు చేస్తున్నారు. తిరుపతి మెటర్నిటీ, శ్రీకాళహస్తి, చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు ప్రాంతీయ ఆస్పత్రుల్లో ప్రసవాలు బాగానే జరుగుతున్నాయి. వీరికి బేబీ కిట్లు అందించడం వల్ల పిల్లలు ఇన్‌ఫెక్షన్లు, రోగాల బారిన పడకుండా ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తిరిగి ఈ పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.పిల్లల సంరక్షణకు ఎంతో ఉపకరిస్తుందని పేర్కొంటున్నారు.

# నిఘా కళ్లు.. నేలచూపు!



అనంతపురం : జిల్లాలోని పలు ఆర్టీసీ ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు నేలచూపు చూస్తున్నాయి. వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లలో భద్రతపై నీలినీడలు అలముకున్నాయి. చాలా మంది ప్రయాణికులు గమ్యస్థానం చేరాలన్న ఆత్రుత...మరికొందరు బస్సుల్లో సీటు దక్కితే చాలన్న ఆలోచనలో ఉంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు పెట్రేగిపోతున్నారు. పోలీసు ఔట్‌పోస్టు ఉంటున్నా నామమాత్రంగా ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గుంతకల్లు, తాడిపత్రి, గుత్తిలో మినహా మిగతా చోట్ల అరకొరగా సీసీ కెమెరాలు ఉన్నా సక్రమంగా పని చేయడం లేదు.

అనంత జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణానికి రాష్ట్రం నుంచే కాకుండా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి నిత్యం 270 బస్సులు వస్తుండగా.. సుమారు 50 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీకి సంబంధించిన ఒక్క సీసీ కెమెరా లేకపోవడం గమనార్హం. దుకాణాల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న కెమెరాల మీదే ఆధారపడాల్సి వస్తోంది. గతంలో పోలీసులు ఏర్పాటు చేసిన అరకొర కెమెరాల నిర్వహణ కరవైంది.

ప్లాట్‌ఫాంలు 19 ఉండగా ఒక్క కెమెరా కూడా ఏర్పాటు చేయలేదు. ఇటీవల బస్టాండ్‌లో 18 తులాలు బంగారం చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు.

**ఒక్కటీ లేదాయె..**

ఉరవకొండ ఆర్టీసీ ప్రాంగణంలో సీసీ కెమెరాల జాడే లేదు. 55 సర్వీసులతో పాటు ఇతర డిపోలకు చెందిన బస్సులు నడుస్తుంటాయి. రోజూ 15 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఉంటుంది. ఆ సమయంలో చరవాణులు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి.

చాలా కాలంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా యంత్రాంగం స్పందించడం లేదు.

ఉన్నా.. నిరుపయోగమే కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండులో రెండు సీసీ కెమెరాలు ఉండగా ఒక్కటీ పని చేయడం లేదు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి.

ఈనెల 6న బస్సు ఎక్కుతున్న మహిళ మెడలో నుంచి సుమారు 5 తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది.

ఇక్కడ 67 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రోజూ సుమారు సుమారు 8 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.

పోలీసులే ఏర్పాటు చేస్తారు..–సుమంత్ ఆర్ ఆదోని, ఆర్ఎం, అనంతపురం జిల్లా

ఆయా ఆర్టీసీ ప్రాంగణాల్లో పోలీసులే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇందుకు స్థానిక డిపో మేనేజర్లు పోలీసులకు సహకారం అందిస్తారు. కొన్ని బస్టాండుల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది.

# మధుర ఫలం.. విషతుల్యం..



పుట్టపర్తి : పచ్చి మామిడి కాయలను కొందరు వ్యాపారులు యథేచ్ఛగా ప్రమాదకర రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తున్నారు. ఆ పండ్లను తిన్న వారు అనారోగ్యపాలవుతున్నారు. ఆహార భద్రతా తనిఖీ అధికారులు అరకొరగా తనిఖీలు చేస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 47,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి, బుక్కపట్నం, నల్లమాడ, కొత్తచెరువు, కదిరి నియోజకవర్గంలో తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, ధర్మవరం నియోజకవర్గంలో ముదిగుబ్బ మండంలో దిగుబడులు ఉంటున్నాయి. 95 శాతం బేనీషా రకం సాగుచేయగా, మిగిలిన ఐదు శాతం మల్లిక, బాదామి, కేసరి రకాలు సాగులో ఉన్నాయి. ఏటా 1.50 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసిన వ్యాపారుల్లో అత్యధిక మంది రసాయనాలతో మాగబెట్టి విక్రయాలు జరుపుతున్నారు.

**రంగు చూసి మోసపోవద్దు**

మామిడి పండ్లను వివిధ రసాయనాలతో మాగబెట్టడం నేరమని తెలిసినా కొందరు వ్యాపారులు ఆ ధోరణిని మాత్రం వదల్లేదు. మాగబెట్టడానికి క్యాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. దీంతోపాటు ఈథెఫోన్ రసాయనాన్ని కాయలపై చల్లుతున్నారు. ఈ రసాయనాలు అసిటలీన్‌ను ఉత్పత్తి చేయడంతో మామిడి కాయ దాని నిర్ణీత సమయం కంటే త్వరగా పసుపు రంగులోకి మారుతోంది. వీటిని తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు, తలనొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో క్యాన్సర్, లివర్, జీర్ణ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని వారు హెచ్చరికలు చేస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు..** 'ఎత్రిల్ రసాయన పౌడర్‌ను నీటిలో కలిపి ఉంచాలి. అందులో పక్వానికి వచ్చిన మామిడి పండ్లను ఐదు నిమిషాలు ఉంచి బయటికి తీయాలి. మూడు, నాలుగు రోజుల తరువాత పండు మాగి పసుపు వర్ణంలోకి వస్తుంది. మంచి సువాసన వస్తుంది.' అని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ విధంగా మాగబెట్టిన పండ్లను తింటే అనారోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. సహజ సిద్ధంగా మాగబెట్టిన మామిడి రుచికరంగా ఉండటంతోపాటు ఆరోగ్యానిస్తు ఒదన్నారు.

**తనిఖీలు చేస్తున్నాం..– కల్యాణ్‌చక్రవర్తి, జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి** మామిడి పండ్ల సీజన్ ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు, మండీలు, ఉత్పత్తులు నిల్వ చేసిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# అదిగో.. మరో రాచబాట

విశాఖపట్నం : విజయనగరం, అనకాపల్లి జిల్లాలను అనుసంధానిస్తూ వలయ రహదారి (రింగు రోడ్డు)కి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక రూపొంది స్తోంది. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేలా ఈ ప్రతిపాదన సిద్ధం చేశారు. భవిష్యత్తు అవసరాలు, విశాఖలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ కసరత్తు సాగుతోంది. ఇటీవల విశాఖ జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించిన సమయంలో దీనిపై చర్చించడంతో అమలు దిశగా వీఎంఆర్‌డీఏ చర్యలు తీసుకుంటోంది.అనకాపల్లి, పెందుర్తి, ఆనందపురం, భోగాపురం మండలాల పరిధిలో సుమారు 85 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మించాలనుకుంటున్నారు. మొదట నాలుగు వరుసలు, ఆ తర్వాత ఆరు, ఎనిమిది వరుసలతో నిర్మించేలా భూసేకరణ చేయాలని భావిస్తున్నారు.భూసేకరణ జరిపి రైతులకు పరిహారం అందజేసి నిర్మించాలంటే ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున.. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నారు.

ప్రతిపాదిత రోడ్డుకు ఇరువైపులా ఉండే భూములకు విలువ కల్పించేలా ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్య విధానంలో చేపట్టాలనే దిశగా ప్రాథమికంగా పరిశీలిస్తున్నారు. అంటే.. అక్కడక్కడ వాణిజ్య సముదాయాలు, బహుళ అవసరాల నిర్మాణాలు చేపట్టి సంబంధిత భూయజమానులకు ప్రయోజనం కల్పించేలా చేయనున్నారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా సర్వే నిర్వహణ, లేఅవుట్ ఖరారు, ప్రతిపాదిత మార్గం, సాంకేతిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ నియామకానికి వీఎంఆర్‌డీఏ ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) కోరింది. వేగంగా పట్టాలెక్కేలా వీఎంఆర్‌డీఏ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.



ప్రయాణ సమయం తగ్గేలా: వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ, పరిసర ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ఈ రోడ్డుకు ప్రణాళిక చేశాం. అచ్యుతాపురం నుంచి భోగాపురం బీచ్ వరకు, రాంబిల్లి ఇతర ప్రాంతాల్లోని రద్దీ, ప్రయాణ సమయం తగ్గించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. విశాఖ, భోగాపురం విమానాశ్రయాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా ఇది ఉంటుంది. అటు పర్యాటకంగానూ కీలకంగా మారనుంది. దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టు రూపొందిస్తున్నాం. – ఎంవీ ప్రణవ్‌గోపాల్, ఛైర్మన్, వీఎంఆర్‌డీఏ

# సాహస యాత్రలా.. జాగ్రత్తలు పాటించండి

తిరుపతి : ప్రకృతిపై ప్రేమతోనో.. అడవులంటే మమకారంతోనో.. జాలీ ట్రిప్పుల కోసమో కొందరు అడవిబాట పడుతున్నారు. అయితే అటవీశాఖను సంప్రదించకుండా, అనుభవజ్ఞుల తోడులేకుండా ట్రెక్కింగ్‌లకు ప్రయత్నించడం కోరి ప్రమాదాలను ఆహ్వానించడమేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరీ ప్రధానంగా గుర్తింపులేని నిర్వాహకులను నమ్మి ప్రవేశిస్తే అటవీ చట్టాలను అనుసరించి జైలుపాలు కావాల్సి వస్తుందని చెబుతున్నారు. రెండురోజుల కిందట తలకోనలో, అంతకుముందు అన్నమయ్య జిల్లాలో అనుమతులు లేకుండా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించడంతో సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అప్రమత్తం చేస్తోంది.

**గుర్తింపులేని సంస్థలతో జాగ్రత్త**

కొన్ని గుర్తింపులేని సంస్థలు తమకు అన్నీ తెలుసని, అధికారుల సహకారం ఉందని కిందిస్థాయి సిబ్బందిని అడ్డుపెట్టుకుని అనధికార ట్రెక్కింగులు నిర్వహిస్తున్నాయి. రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. తాము పరిశోధకులమని, వన్యప్రాణి ప్రేమికులమని ప్రకటించుకుని స్నేహితులను, సన్నిహితులను వెంటబెట్టుకుని అడవుల్లో సాహస యాత్రలు చేపడుతున్నారు.

**అనుతులు ఇలా..**

శేషాచలం అడవుల్లోని రిజర్వు అటవీ ప్రాంతాల్లో, శ్రీవేంకటేశ్వర నేషనల్ పార్కు, ఎస్వీ అభయరణ్యాల పరిధిలో ట్రెక్కింగ్ నిర్వహించాలంటే తప్పనిసరిగా అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. డీఎఫ్‌వో స్థాయి అధికారి వద్ద ముందస్తు ప్రణాళిక, రూట్మ్యాప్, బృంద సభ్యుల వివరాలు, రక్షణకు సంబంధించిన నిర్దిష్ట ఏర్పాట్ల వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఔత్సాహికులు స్వతహాగా వెళ్లాలంటే



బృందంగా ఏర్పడి అటవీశాఖ అధికారులను సంప్రదిస్తే వారే ఏర్పాట్లు చేస్తారు. వన సంరక్షణ సమితులు (వీఎస్ఎస్), ఎకో డెవలప్ కమిటీలు (ఈడీసీ), కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం (సీబీఈటీ) బృందాల సాయంతో ట్రెక్కింగ్‌లో పాల్గొనేలా అవకాశం కల్పిస్తారు.

**ఆ మూడు నెలలు నిషేధం**

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవి కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. ఈ సమయంలో ట్రెక్కింగ్‌లకు వెళ్తే అగ్నికీలల్లో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకోవాల్సి ఉంటుంది. నీటికోసం చిరుతలు, ఏనుగుల గుంపులు వెతుకులాటల్లో ఉంటాయి. ఈ సమయంలో వాటి కంటపడితే ప్రాణాపాయం తప్పదు. ఈ కారణంగానే ఈ మూడు నెలలూ అడవుల్లోకి ప్రవేశం, ట్రెక్కింగ్‌ల నిర్వహణపై అటవీశాఖ నిషేధం విధిస్తుంది. ఔత్సాహికులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాల్సి ఉంటుంది.

**కొత్త పాలసీ సిద్ధం చేస్తున్నాం..– వివేక్ ఆనంద్, డీఎఫ్‌వో, జిల్లా అటవీపాలనాధికారి**

శేషాచలం అడవుల్లో ట్రెక్కింగ్ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి. గుర్తింపులేని సంస్థల నిర్వాహకులను అనుసరిస్తే ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తుంది. కొందరు అనధికారికంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ట్రెక్కింగ్‌ల నిర్వహణ కోసం అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నాం. త్వరలోనే కొత్తపాలసీని ప్రవేశపెడుతాం. తలకోన, అన్నమయ్య జిల్లాల పరిధిలో జరిగిన ఘటనలపై చర్యలు తీసుకుంటున్నాం.

# లోపాలు దాచబోయి.. మరిన్ని తప్పులు

తిరుపతి : తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య వర్సిటీ అధికారుల తప్పటడుగులతో సరికొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. విజయనగరం జిల్లాలోని గరివిడి పశువైద్య కళాశాలకు భారత పశువైద్య మండలి (వీసీఐ) అనుమతుల సాధన కోసం గతంలో చేసిన దొడ్డిదారి ప్రయత్నం బెడిసికొట్టింది. ఈనెల 14 నుంచి 16 వరకు వీసీఐ బృందాలు అనుమతులు అవసరమైన గరివిడి కళాశాలతోపాటు మరో మూడింటిలో సాధారణ పరిశీలనలు చేపడుతున్నట్లు సమాచారం ఇవ్వడంతో వర్సిటీ అధికారులు ఇరకాటంలో పడ్డారు.

**ఇదీ జరిగింది..!** పశువైద్య విద్యను ఉత్తరాంధ్రకు విస్తరించాలన్న లక్ష్యంతో 2016లో విజయనగరం జిల్లా గరివిడిలో రూ.81.72 కోట్లతో పశువైద్య కళాశాలను అప్పటి తెదేపా ప్రభుత్వం మంజూరు చేసింది. 2021లో వైకాపా ప్రభుత్వం భారత పశువైద్య మండలి (వీసీఐ) అనుమతులు లేకుండానే ప్రవేశాలు కల్పించింది. తదనంతరం రాష్ట్రవాటా చెల్లించపోవడంతో నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారు. 86 మంది అధ్యాపకులను నియమించాల్సి ఉండగా 18 మందితోనే సరిపెట్టారు. దీంతో 2021, 2022లో ప్రవేశం పొందిన విద్యార్థులకు మాత్రమే వీసీఐ అనుమతి లభించింది. 2022 ఆగస్టులో కళాశాలను సందర్శించి నా అనుమతుల మంజూరుకు నిరాకరించింది. 2024 నవంబరులో మరోదఫా పరిశీలనకు



వస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు సరికొత్త ఎత్తులు వేశారు. తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలల నుంచి 26 మంది సీనియర్ అధ్యాపకుల్ని అక్కడికి బదిలీ చేశారు. ముందస్తు ఒప్పందం ప్రకారం పరిశీలనలు ముగిసిన వెంటనే 2025 జనవరిలో 18 మందిని యథాస్థానాలకు పంపారు. ఇంకో రెండునెలల్లో ఐదేళ్ల బీవీఎస్సీ (ఏహెచ్) తొలిబ్యాచ్ పూర్తికానుండటం, అందులో మూడేళ్లకు వీసీఐ అనుమతులు లేకపోవడంతో 70 మంది తొలిబ్యాచ్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వీసీఐ అనుమతులు లేకుండా కోర్సు పూర్తిచేస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉండదు.

**వర్సిటీ ఎత్తుకు వీసీఐ పైఎత్తు**

వర్సిటీ అధికారులు వేసిన ఎత్తుల్ని చిత్తుచేస్తూ వీసీఐ ఈదఫా పరిశీలనల్ని పక్కా ప్రణాళికతో రూపొందించుకుంది. గరివిడి కళాశాలతో పాటు తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు కళాశాలల్ని ఏకకాలంలో సందర్శించాలని నిర్ణయించింది. ఒక్కో వర్సిటీకి ఒక్కో బృందం ఈనెల 14– 16 వరకు తనిఖీలకు వెళ్లనుండటం, వర్సిటీ పరిధిలో 50 శాతం అధ్యాపకుల ఖాళీలు ఉండటంతో అసలుకే ఎసరు తెచ్చిపెడుతోదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## డైరెక్టర్ గా మారనున్న హీరోయిన్?

టాలీవుడ్ ఆడియన్స్ ను కట్టిపడేసిన హీరోయిన్లలో చందమామ కాజల్ కూడా ఒకరు. స్క్రీన్ పై ట్రెండీ గా కనిపించడంతో పాటూ హీరోల పక్కన మాస్ స్టెప్పులేస్తూ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన కాజల్ కేవలం సినిమాలే కాకుండా వెబ్‌సిరీస్‌లు, స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తూ తనదైన గుర్తింపు తెచ్చుకుంది. పాన్ ఇండియన్ హీరోయిన్ గాపేరు తెచ్చుకున్న కాజల్, తెలుగు సినిమాల్లో నటించి బాగా పాపులర్ అయింది. మొదట్లో గ్లామరస్ పాత్రల్లో నటించినా, ఆ తర్వాత మగధీర, చందమామ లాంటి సినిమాల్లో మంచి పాత్రలు చేసి మెప్పించిన కాజల్, ఆ తర్వాత తమిళంలో అందాల ఆరబోతకే ఎక్కువగా పరిమితమైంది. మధ్యలో ఒకటి రెండు లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. 2020లో గౌతమ్ కిచ్లుని పెళ్లి చేసుకుని మధ్యలో కొన్నాళ్ల పాటూ కాజల్ ఇండస్ట్రీకి దూరమైంది. బాబు పుట్టాక మళ్లీ ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చిన కాజల్, ప్రస్తుతం కమల్ హాసన్



చేస్తున్న ఇండియన్3లో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. దీంతో పాటూ మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా వస్తున్న మైథలాజికల్ మూవీ కన్నప్పలో పార్వతీదేవిగా నటించింది. ఇవి కాకుండా కాజల్ చేతిలో కొత్త అవకాశాలేమీ లేవు. ఓ వైపు కమర్షియల్ యాడ్స్ లో నటిస్తూ, మరోవైపు సొంత బిజినెస్ లతో కూడా కాజల్ బిజీగా ఉంది. అయితే సినిమాల పరంగా తనకు ఛాన్సులు తక్కువైన నేపథ్యంలో మళ్లీ అవకాశాలను దక్కించుకోవాలనే ఆలోచనతో కాజల్ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే కాజల్ మెగాఫోన్ ను పట్టి డైరెక్టర్ గా సినిమా చేయాలని చూస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ప్రైమ్ టైమ్ లోకి రావాలనే ఆలోచనతో స్వీయ దర్శకత్వంలో హీరోయిన్ గా సినిమా చేయాలని చూస్తోందట. బాలీవుడ్ లో కమర్షియల్ అంశా లతో ఓ సినిమాను తెరకెక్కించడానికి కాజల్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఆల్రెడీ కెరీర్లో స్టార్ స్టేటస్ ను ఎంజాయ్ చేసిన కాజల్ ఇప్పుడు వచ్చిన ఆఫర్లను చేసుకుంటూ, వ్యాపారాలను చేసుకోకుండా అనవసరంగా డైరెక్టర్ గా మారి రిస్క్ చేయడం ఎందుకని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు. మరి కాజల్ మనసులో ఏముందో చూడాలి.

## శ్రీలీల లవ్.. ట్విస్ట్ ఇచ్చిన యువ హీరో!

బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్, టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల.. ప్రేమలో మునిగి తేలుతున్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అనురాగ్ బసు దర్శకత్వంలో శ్రీలీల తన బీటౌన్ డెబ్యూ మూవీ చేస్తుండగా.. అందులో కార్తీక్ హీరోగా నటిస్తున్నారు. ఆ మూవీ షూటింగ్ టైమ్ లోనే ఇద్దరూ లవ్ లో పడ్డట్టు టాక్ వచ్చింది. ఆ తర్వాత మూవీ షూటింగ్ కు సంబంధించిన కొన్ని ఫోటోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అందులో ఇద్దరూ చాలా క్లోజ్ గా కనిపించారు. అంతకుముందు కార్తీక్ తల్లి ఓ కార్యక్రమంలో తనకు కాబోయే కోడలు గురించి మాట్లాడారు. ఓ మంచి డాక్టర్ ను తమ ఇంటి కోడలిగా



చేసుకోవాలనుందని అన్నారు. రీసెంట్ గా శ్రీలీల.. ఇన్ స్టాగ్రామ్ చిట్ చాట్ లో ప్రేమపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. దీంతో శ్రీలీల, కార్తీక్ లవ్ లో ఉన్నారని అంతా ఫిక్సయిపోయారు. అయితే తాజాగా కార్తీక్ ఆర్యన్ ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మరో విషయంపై మాట్లాడుతూ.. తనకు ఇండస్ట్రీలో గర్ల్ ఫ్రెండ్ లేదని తెలిపారు. అయితే కార్తీక్ రూ.50 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. దీనిపై స్పందించిన ఆయన.. ఇండస్ట్రీలో అంత పారితోషికం తీసుకునే నటుడు తాను ఒక్కడినేనా అని క్వశ్చన్ చేశారు. ఇంకా చాలా మంది ఉన్నారని అన్నారు. కానీ వారి గురించి ఎవరూ వార్తలు రాయరని అన్నారు. తనకు ఇండస్ట్రీలో ఎవరి సపోర్ట్ లేదని, అందుకే అలాంటి వార్తలు రాస్తారని వ్యాఖ్యానించారు. ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చిన తనకు ఇండస్ట్రీలో అన్నదమ్ములు, ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్ లేరని తెలిపారు. రూమర్స్ క్రియేట్ చేయడానికి కొందరు ఎప్పుడూ రెడీగా ఉంటారని, తమకు నచ్చని వారి కోసం అలా చేస్తారని చెప్పారు. అయితే తన కామెంట్స్ లో శ్రీలీల పేరు ఎక్కడా కార్తిక్ ఆర్యన్ ప్రస్తావించకపోయినా.. సినీ ఇండస్ట్రీలో గర్ల్ ఫ్రెండ్ లేదని చెప్పడం గమనార్హం. కానీ నెటిజన్లు మాత్రం ఇద్దరూ లవ్ లో ఉండడం నిజమేనని అంటున్నారు. మొత్తానికి శ్రీలీల, కార్తీక్ లవ్ మ్యాటర్ హాట్ టాపిక్ గా మారింది. మరి ఆ విషయంలో అసలు నిజమేంటో వాళ్లకే తెలియాలి.




## 2025 ఫస్టాఫ్ హీరోలు వీరే!



నిన్న కాక మొన్న కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టినట్టు ఉంది. కానీ అప్పుడే ఏడాదిలో దాదాపు సగం క్యాలెండర్ పూర్తయిపోయింది. ఇందులో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తాయని భావించిన కొన్ని పెద్ద హీరోల సినిమాలు బొక్కబోర్లా పడితే, అసలు ఎలాంటి అంచనాలు లేని మరికొన్ని సినిమాలు సైలెంట్‌గా వచ్చి ఘన విజయాలు సాధించి కలెక్షన్ల సునామీలను సృష్టించాయి. స్టార్లు, భారీ బడ్జెట్లు లేని చిన్న సినిమాలు సైతం గడిచిన నెలల్లో మంచి విజయాలు సాధించడం విశేషం. అలాంటి కొన్ని సినిమాలపై ఓ లుక్కేద్దాం. బాక్సాఫీస్ వద్ద ఛావా సినిమా సృష్టించిన కలెక్షన్ల హంగామా గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ.780 కోట్లు కలెక్షన్స్‌ను వసూలు చేసిన ఈ సినిమాలో కథ బలం కంటే ఒక మతంకు సంబంధించిన అంశాలే ఆ చిత్రం విజయాన్ని ప్రభావితం చేశాయని సినీ క్రిటిక్స్ మిశ్రమ అభిప్రాయాలను వెల్లడించడం తెలిసిందే. దీనికి పూర్తి భిన్నంగా కోర్టు డ్రామా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన కేసరి చాప్టర్-2 మూవీ విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. కథతో పాటు అక్షయ్ కుమార్, మాధవన్ నటన ఈ సినిమా విజయంలో కీలకపాత్ర పోషించింది. ఎలాంటి అంచనాలు లేకుండా టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన కోర్టు సినిమా మంచి విజయాన్ని అందుకుంది. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ న్యాయాన్ని కూడా ఎలా ప్రభావితం చేయవచ్చు అనే కథను దర్శకుడు రామ్ జగదీష్ అద్భుతంగా తెరకెక్కించి క్రిటిక్స్ నుంచి కూడా ప్రశంసలు పొందాడు. నటి సిమ్రన్ మినహా పెద్దగా పేరు ప్రఖ్యాతులు లేని తారాగణంతో తమిళ్‌లో తెరకెక్కిన టూరిస్ట్ ఫ్యామిలీ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా బ్రహ్మాండమైన విజయం సాధించింది. అత్యంత తక్కువ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా ఏకంగా రూ.82 కోట్లు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులను సృష్టించింది. మళయాలంలో మోహన్‌లాల్ హీరోగా విడుదలైన తుదరం సినిమాకు మిక్స్డ్ రివ్యూలు వచ్చినా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు రాబట్టింది. కథ కంటే కూడా మోహన్ లాల్ స్టార్‌డమ్ ఈ సినిమా విజయానికి బాగా పనిచేసింది. రూ.250 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర స్టార్ హీరోల స్టామినాను మరోసారి ప్రూవ్ చేసింది. మొత్తానికి ఊహించని ఎన్నో సినిమాలు 2025 ఫస్టాఫ్ లో సూపర్ హిట్లుగా నిలిచాయి.

## పవన్ ఉస్తాద్ కూడా ఇదే ఏడాది అయితే...!




పవన్ కళ్యాణ్ చివరగా 2023లో 'బ్రో' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అంతకు ముందు ఏడాది అంటే 2022లో భీమ్లా నాయక్ సినిమా విడుదల అయింది. రాజకీయాల కారణంగా పవన్ కళ్యాణ్ సినిమాలకు చాలా బ్రేక్ వచ్చింది. సుదీర్ఘ కాలం తర్వాత పవన్ కళ్యాణ్ మూవీ విడుదలకు సిద్ధం అయింది. హరి హర వీరమల్లు సినిమాను ఈ నెలలోనే విడుదల చేయాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నెల చివరి వరకు లేదా వచ్చే నెలలో వీరమల్లు సినిమా విడుదల కన్ఫర్మ్ కావచ్చు. వీరమల్లు సినిమా విడుదల తేదీ విషయంలో ఇంకా క్లారిటీ రాకుండానే తదుపరి సినిమా ఓజీ రిలీజ్ విషయంలో ఫుల్ క్లారిటీ ఇచ్చారు. సాహో సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓజీ సినిమా షూటింగ్ పూర్తి అయింది. ఈ విషయాన్ని స్వయంగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. ఈ రెండు సినిమాలనే పవన్ కళ్యాణ్ చేస్తాడని అంతా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా నేటి నుంచి ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. పవన్ కళ్యాణ్ నుంచి ఈ ఏడాది రెండు సినిమాలు రావడం కన్ఫర్మ్ అయింది. అయితే ఈ మధ్య కాలంలో పవన్ ఆ రెండు సినిమాలను ముగించిన జోరు చూస్తూ ఉంటే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా రెండు మూడు నెలల్లోనే పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే మరీ ఆలస్యం చేయకుండా ఇదే ఏడాదిలో ఉండే అవకాశం ఉంది. స్టార్ హీరోల సినిమాలు ఈమధ్య కాలంలో ఏడాదికి ఒకటి మాత్రమే విడుదల అవుతోంది. కొందరు హీరోలు ఏడాదికి ఒక్కటి కూడా విడుదల చేయలేక పోతున్నారు. కానీ పవన్ కళ్యాణ్ నుంచి మూడు సినిమాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పవన్ ఫ్యాన్స్ కి రెండు సినిమాలు విడుదల అయినా కూడా పండుగే అనడంలో సందేహం లేదు. అలాంటిది మూడు సినిమాలు విడుదల అయితే వారి ఆనందానికి అవధులు ఉండక పోవచ్చు. అంతే కాకుండా థియేటర్ల వద్ద సందడి ఓ రేంజ్‌లో ఉండే అవకాశం ఉంది. సినిమా ఇండస్ట్రీ బాగు పడాలి అంటే, సింగిల్ స్క్రీన్ థియేటర్లు నిలవాలి అంటే స్టార్ హీరోలు ఏడాదికి రెండు మూడు సినిమాలు చేయాలి అంటున్నారు. పవన్ కళ్యాణ్ నుంచి మూడు సినిమాలు వస్తే ముందు ముందు మరింత మంది ఇదే ఫార్ములాను పాటించే అవకాశాలు ఉన్నాయి. స్పీడ్‌గా తీసిన సినిమాలకు బడ్జెట్ తక్కువ అవుతుంది. అంతే కాకుండా నిర్మాతకు ఇబ్బందులు ఉండవు. హీరోలు ఎక్కువగా సినిమాలు చేసే అవకాశం ఉంటుంది. ప్రేక్షకుల పై టికెట్ల భారం తగ్గించే అవకాశం ఉంటుంది. కనుక పవన్ కళ్యాణ్ నుంచి ఈ ఏడాది మూడు సినిమాలు రావాల్సిందే అని అభిమానుల బలంగా కోరుకుంటున్నారు. హరీష్ శంకర్ తలుచుకుంటే కచ్చితంగా నవంబర్ లేదా డిసెంబర్ వరకు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. పవన్ నుంచి ఏడాదికి రెండు సినిమాలు వచ్చి చాలా కాలం అయింది. ఇక మూడు సినిమాలు ఆయన కెరీర్ ఆరంభం నుంచి ఎప్పుడూ ఒకే ఏడాదిలో రాలేదు. కనుక ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఇదే ఏడాదిలో వస్తే అరుదైన రికార్డులు చాలానే నమోదు కావచ్చు.

## శ్రీనిధి ఖాతాలో మరో లక్కీ ఛాన్స్..?

తనకు కథ నచ్చి సినిమాలో తన పాత్ర నచ్చితే కానీ ప్రాజెక్ట్ ఓకే చేయని హీరోయిన్స్ చాలామంది ఉంటారు. అలాంటి సెలెక్టెడ్ సినిమాలు చేసే వారి లిస్ట్ లో కచ్చితంగా కె.జి.ఎఫ్ భామ శ్రీనిధి శెట్టి పేరు ఉంటుంది. యష్, ప్రశాంత్ నీల్ కాంబోలో వచ్చిన కె.జి.ఎఫ్ రెండు భాగాలతో పాన్ ఇండియా క్రేజ్ సంపాదించిన శ్రీనిధి శెట్టి ఆ సినిమా తర్వాత మాత్రం ఆ రేంజ్ దూకుడు చూపించలేదు. కె.జి.ఎఫ్ తర్వాత చియాన్ విక్రమ్ తో కలిసి కోబ్రా సినిమా చేసిన శ్రీనిధి అది ఫ్లాప్ అవ్వడంతో డీలా పడింది. ఇక తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా సైన్ చేశాక నాని హిట్ 3 ఆఫర్ రావడం అందులో నటించి ఆ సినిమా రిలీజై సూపర్ హిట్ అవ్వడం తెలిసిందే. నాని, శ్రీనిధి హిట్ 3 లో సూపర్ హిట్ జోడీ అనిపించుకున్నారు. ఐతే హిట్ 3 తర్వాత తెలుగులో తెలుసు కదా సినిమాతో వస్తుంది శ్రీనిధి శెట్టి. ఈ సినిమా అక్టోబర్ 17న రిలీజ్ అవుతుంది. సిద్ధు తో శ్రీనిధి మాత్రమే కాదు ఈ సినిమాలో రాశి ఖన్నా కూడా జత కడుతుంది.



ఇదిలా ఉంటే శ్రీనిధి శెట్టికి లేటెస్ట్ గా ఒక పాన్ ఇండియా సినిమా ఆఫర్ వచ్చినట్టు తెలుస్తుంది. స్టార్ హీరో స్టార్ డైరెక్టర్ కలిసి చేయబోతున్న ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ లో శ్రీనిధి హీరోయిన్ గా పర్ఫెక్ట్ అని భావిస్తున్నారట. ఆఫర్ రాగానే అమ్మడు ఏమాత్రం ఆలోచించకుండా ఓకే అనేసిందని తెలుస్తుంది. శ్రీనిధి చేయబోతున్న ఆ పాన్ ఇండియా సినిమా ఏంటన్నది త్వరలో తెలుస్తుంది. ఐతే తెలుగు ఎంట్రీ కోసం కాస్త టైం తీసుకున్న శ్రీనిధి శెట్టి ఇక్కడ ఆడియన్స్ చూపిస్తున్న ప్రేమకు ఫిదా అయ్యిందని తెలుస్తుంది. అందుకే తెలుగులో ఛాన్స్ వస్తే మాత్రం చేసేందుకే ప్రయత్నించేలా చూస్తుందట. ఇదివరకు తెలుగు ఆఫర్స్ వచ్చినా అంతగా ఆసక్తి చూపించని శ్రీనిధి శెట్టి హిట్ 3 టైం లో తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమను చూసి ఇక్కడ సినిమాలు కొనసాగించాలని ఫిక్స్ అయ్యింది. మరి శ్రీనిధి టాలీవుడ్ కెరీర్ ఎలా ఉంటుందో చూడాలి. కన్నడలో కూడా శ్రీనిధి ఇక మీదట వరుస సినిమాలు చేయాలని అనుకుంటుందట. కె.జి.ఎఫ్ తర్వాత సొంత భాషలో ఆఫర్లు లేక ఇబ్బంది పడిన శ్రీనిధి ఇక మీదట అన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యిందట.

## అక్కినేని కోడలు స్టన్నింగ్ న్యూలుక్

అక్కినేని అఖిల్- జైనాబ్ రావూజీ పెళ్లి వేడుకలో అతిథులు, అక్కినేని కుటుంబం మొత్తం ఒకెత్తు అనుకుంటే, నాగార్జున పెద్ద కోడలు శోభిత ధూళిపాల- నాగచైతన్య జంట ఆకర్షణ మరొక ఎత్తు. స్టైలిష్ నాగచైతన్య సరసన శోభిత ముగ్ధ మనోహరంగా రెడీ అయ్యి పెళ్లి వేడుక ఆద్యంతం కనిపించారు. డి-డేతో పాటు, పెళ్లి అనంతర విందులోను, ప్రీవెడ్డింగ్ లోను రకరకాల డిజైనర్ చీరలు, ఆభరణాల్లో శోభిత వేషధారణలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇప్పటివరకూ బయటపడని ఒక కొత్త లుక్ ఒకటి ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. అక్కినేని నాగచైతన్య- శోభిత జంట ఎంతో స్టైలిష్ గా పార్టీ కోసం రెడీ అయిన కొన్ని ఫోటోలు వెబ్ లో వైరల్ గా దూసుకెళు తున్నాయి. చైతూ డార్క్ కలర్ సూట్ లో ఎంతో స్టైలిష్ గా కనిపించగా, శోభిత రెడ్ హాట్ శారీలో అల్ట్రా పోష్ అవతార్ లో కనిపించారు.



ముఖ్యంగా శోభిత ఎంపిక చేసుకున్న ఎరుపు రంగు సాదా చీర, కాంబినేషన్ డిజైనర్ గోల్డెన్ బ్లౌజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అందమైన బ్రీడ్స్, ముత్యాల అల్లికతో డిజైనర్ బ్లౌజ్ శోభిత అందాన్ని పదింతలు పెంచింది. సింపుల్ మేకప్, కాటుక కళ్లతో మ్యాజిక్ చేసింది అక్కినేని కోడలు. చై-శోభిత జోడీ షో స్టాపర్స్ గా నిలిచారు అంటే అతిశయోక్తి కాదు. శోభిత చేతిలో ఖరీదైన హ్యాండ్ బ్యాగ్ కూడా ఆపోజిట్ కలర్ తో ఎర్ర చీరకు మ్యాచింగ్ గా కనిపించింది. ఇక అక్కినేని వారి ఇంట పెళ్లి సందడి ముగిసింది.. సరే కానీ, చైతన్య తదుపరి ప్రాజెక్ట్ గురించి ఏం ఆలోచిస్తున్నాడు? శోభిత కెరీర్ లో నెక్ట్స్ ఏంటి? అంటూ అభిమానులు ప్రస్తుతం ఎగ్జయిటింగ్ గా ఎదురు చూస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536